# ప్రభువైన యేసు చెప్పిన ఉపమానములు

*The Parables of our Lord Jesus*

లూయిస్ రష్మోర్

**LOUIS RUSHMORE**

**Church of Christ - Satya Vani**
P.o. Box - 80
Kakinada, A.P. 533001
India

# విషయసూచిక


1. మన ప్రభువైన యేసు చెప్పిన ఉపమానములు........................5
2. విత్తువాడు........................................................9
3. గోధుములు - గురుగులు.......................................20
4. ఆవగింజ ఉపమానము.............................................26
5. పుల్లని పిండి........................................................32
6. దాచబడిన ధనము.................................................38
7. అమూల్యమైన ముత్యము........................................44
8. వలను గూర్చిన ఉపమానము..................................47
9. ఇంటి యజమానుడు...............................................53
10. ద్రాక్షతోటలో పనివారు.........................................57
11. దుర్మార్గులైన తోట కాపులు..................................65
12. పదిమంది కన్యకలు...............................................72
13. తలాంతులు.........................................................78
14. కనికరము లేని దాసుడు.......................................84
15. మంచి సమరయుడు.................................................93
16. బుద్ధి హీనుడైన ధనికుడు......................................104
17. నిష్ఫలమైన అంజూరపు చెట్టు.................................112
18. గొప్ప విందు........................................................119
19. తప్పిపోయిన గొఱ్ఱె................................................126
20. పడిపోయిన నాణెము.............................................132
21. తప్పిపోయిన కుమారుడు.......................................136
22. అన్యాయస్థుడైన గృహ నిర్వాహకుడు........................143
23. ధనవంతుడు - లాజరు..........................................151
24. అన్యాయస్థుడైన తీర్పరి..........................................157
25. పరిసయ్యుడు-సుంకరి...........................................162
26. ఇద్దరు కుమారులు................................................166

# 1. ప్రభువైన యేసు చెప్పిన ఉపమానములు

## (The Parables of our Lord Jesus)

యేసు యొక్క ఉపదేశములు నిజంగా అసాధారణమైనవి. ఆయన ఆదర్శ ఉపాధ్యాయుడు, ఉపదేశకుడు. యేసు సత్యస్వరూపి. అందువలన ఆయన బోధించిన దానిని ఉదహరించెను. సరిగదా మన ప్రభువు శక్తితోను అధికారముతోను తాను బోధించిన దానిని విశదీకరించెను. ఆయన జీవితం ఆయన ఉపదేశములకు అద్దము పట్టెను. యేసు బోధించిన రీతి ఎవడును ఎన్నడును బోధించలేదు (యోహాను 7:45-46). ఆయన అధికారము గల వానివలె బోధించెను (మత్తయి:28:18). కథారూపముగను, ఉపమాన రూపకముగను బోధించుటలో ఆయనకు ఆయనే సాటియాయెను. "సామాన్య జనులు ఆయనను సంతోషముతో వినుచుండిరి" (మార్కు 12:37). యేసు చేసిన బోధలలో మూడవవంతు ఉపమానములే. దైవిక సత్యములు చిత్రీకరించుటలో యేసును మించిన వాడెవడును లేడు.

క్రీస్తు శరీరధారి కాకముందునుండే, పాతనిబంధన కాలములో ఉపమానములు వినియోగించబడెను. ప్రవక్తయైన నాతాను దావీదుకు చెప్పిన ఉపమానము వాటిలో ప్రసిద్ధి జెందినది (2 సమూ12:1-13). ఉపమాన రీతిలో బోధించు విధానము యేసులో ప్రత్యేకముగ కనబడుచున్నను, అట్లు బోధించిన విధానమును ఆయన కనుగొనలేదు. పురాతన కాలము నుండే ఉపమానములు వినియోగించ బడుచుండెను.

### ఉపమానముల యొక్క నిర్వచనము:

ఆత్మీయ సత్యములను జనులెరిగిన వాస్తవములతో పోల్చి చెప్పుటయే

ఉపమానము. ఇందులో ఎల్లప్పుడు తారతమ్యాలు కనబడును. యేసుయొక్క ఉపమానములు మత్తయి మార్కు, లూకా సువార్తలలో ముఖ్యముగా కనబడును. ఉపమానమనగా పరసంబంధ భావము గల భూసంబంధ కధనమని చెప్పుకొనవచ్చును. భూసంబంధ వాస్తవముల ప్రక్కన యేసు పరసంబంధ సత్యములను బోధించెను. ఆయన రాజ్యమును గూర్చి ఆయన బోధించెను. జనులెరిగిన వాస్తవములనుపయోగిస్తూ వారెరుగని పరసంబంధ సత్యములను ఆయన వారికి గంభీరముగ ఉపదేశించెను.

అందువలన ఉపమానమనగా దైవిక సత్యమును అలంకార రీతిగా బోధించుటయని చెప్పవచ్చును. లేఖనములలో మనకు ఉపమానము, సామెత, పోలిక, అలంకారము అనునవి కనబడును. అలంకారభాషలో ఉపమానము పురాతనమైనది. పాత నిబంధన వాటితోనిండి యున్నది. యేసు తరచు ఉపమాన రీతిగ బోధించెను.

## ఉపమానముల ప్రయోజనము:

1. ఉపమానములు ఆత్మీయసత్యమును బయలు పరచుటకు ఉపయోగింపబడెను. ప్రజలు ఎరుగని వాటిని గ్రహించునట్లు వారెరిగిన వాస్తవముల ద్వారా బోధించబడెను.

2. ఆత్మీయ సత్యమునకు హక్కులేనివారి నుండి దానిని దాచిపెట్టుటకు ఉపమానము ఉపయోగపడెను. అట్టివారికి సత్యము బయలు పరచబడినా దానిని వారు దుర్వినియోగము చేతురు.

3. సత్యమునకు మెరుగు పెట్టుటకు ఉపమానము వినియోగించబడెను.

4. అది వారి నుద్దేశించి చెప్పబడెనని గ్రహించుకొనకముందే ప్రజలు సత్యమును అంగీకరించునట్లు చేయు నిమిత్తము ఉపమానములు ఉద్దేశించబడెను.

5. తదుపరి మెస్సీయను గూర్చిన ప్రవచనములు నెరవేరునట్లు ప్రభువు ఉపమానరీతిగా బోధించెను. "ప్రవక్త చెప్పినమాట నెరవేరునట్లు యేసు ఈ

సంగతులన్నిటిని జనసమూహములకు ఉపమాన రీతిగా బోధించెను; ఉపమానము లేక వారికేమియు బోధింపలేదు" (మత్తయి 13:34-35).

"జనులారా నా బోధకు చెవి యొగ్గుడి, నా నోటి మాటలకు చెవియొగ్గుడి. నేను నోరు తెరచి ఉపమానము చెప్పెదను. పూర్వకాలపు గూఢ వాక్యములను నేను తెలియ జెప్పెదను" అని కీర్తన 78:1-2లో చెప్పబడిన ప్రవచన నెరవేర్పును యేసు బోధన విధానములో మనము చూడగలము.

మత్తయి సువార్త యేసుక్రీస్తు తన జీవితంలోను, బోధలోను పాత నిబంధన లేఖనములనెట్లు నెరవేర్చారో తెలియజేయుటకు వ్రాయబడియున్నది. ప్రవక్త ద్వారా "చెప్పబడిన మాట నెరవేరునట్లు" అను పదములను తరుచు మత్తయి సువార్తలో మనము కనుగొనగలము (మత్తయి 1:22; 2:15, 17, 23; 4:14).

## ఉపమానముల భావార్థము:

ప్రభువు చెప్పిన రెండు ఉపమానములకు ఆయనే భావార్థము చెప్పెను, విత్తువానిని గూర్చినది మరియు గురుగులను గూర్చినది. యేసు ఈ రెండింటికి చెప్పిన భావార్థమును బట్టి మిగతా ఉపమానముల భావార్థమును గ్రహించుటకు మనకు తగినంత జ్ఞానమున్నదని అనుకొనుట సమంజసమే. యేసు ఈ రెండింటికి యిచ్చిన వివరణ మిగతా ఉపమానముల వివరణకు మూలమై యుండుట అత్యవసరము. అయినను ఈ ఉపమానముల భావార్థము విషయంలో కొందరు విభేధిస్తు యున్నారు. అందువలన శతాబ్దముల తరబడి మానవులు యేసుచెప్పిన ఉపమానములకు విపరీత భావార్థములు చెప్పుచున్నారు. కొందరు లేనిపోని సంగతులు కలిపి భావార్థము చెప్పుదురు, మరికొందరు ఉపమానములో యున్నవాటిని తీసి వేతురు. అందువలన యేసు యొక్క ఉపమానములకు భావార్థము చెప్పునప్పుడు మనము కొన్ని జాగ్రత్తలు వహించవలెను.

మొదటిగా ప్రతి ఉపమానము దాని సందర్భానుసారముగ చదువవలెను.

ఆఉపమానము యొక్క చరిత్రాత్మక సందర్భమును గ్రహించుకోవాలి.

రెండవదిగా ఆ ఉపమానములో యున్న వివరములన్నియు గ్రహించుకోవాలి. కొన్ని ఉపమానములు సవిస్తరముగా యున్నవి. విత్తువానిని గూర్చినది మరియు గురుగులను గూర్చినది సవిస్తరముగా యున్నవి. మరికొన్నిటిలో వివరణ యేమీలేక బహు సంగ్రహముగా యున్నవి.

# ౨. విత్తువాడు

## (The Sower)

మత్తయి 13:1-23; మార్కు 4:1-20; లూకా8:4-15

### పరిచయము:

అత్యంత ఘనుడైన బోధకుడగు యేసు అలంకార రీతిగా తరుచు బోధించెను. యేసు చెప్పిన అలంకార ఉదాహరణలన్నీ ఉపమానములేయని కొందరు చెప్పుదురు (ఉదా:మత్తయి 5:13-16). అయితే మత్తయి 13వ అధ్యాయము నుండి యేసు ఉపమానములను పరిపూర్ణ రీతిగా వినియోగించెను. యేసు తన బోధన విధానమును మార్చి బోధించుచున్నట్లు శిష్యులు గ్రహించి "నీవు ఉపమాన రీతిగా ఎందుకు మాటలాడుచున్నావని" వారాయనను ప్రశ్నించారు (మత్తయి 13:10).

యేసు ప్రభువు చెప్పిన ఉపమానములు అత్యంత ప్రయోజనకరములు. యేసు తన ఉపమానములోని ప్రతి అంశమును శిల్పకారుని చెక్కడమువలె చెక్కారు. ఆయన ఉపమానములు సంక్షిప్తమైనవి, సూక్ష్మమైనవి. జనులెరిగిన వ్యవసాయము, గృహజీవితము, వ్యాపారము, సాంఘికజీవనము, ప్రకృతి మొదలగు అంశములను ఆయన ఉపమానములలో వినియోగించెను. పరసంబంధ సంగతులను బోధించుటకు ఇహసంబంధ సంగతులు ఉపమానములో వాడబడెను.

'విత్తువాని గూర్చిన ఉపమానము' అను నామకరణమును ప్రభువే దానికి యిచ్చారు (మత్తయి 13:18). ఆయనే దానికి భావార్థము చెప్పెను. యేసు గురుగులను గూర్చిన ఉపమానము యొక్క భావార్థము కూడ చెప్పారు (మత్తయి 13:24-30, 36-43). గనుక మిగతా ఉపమానములు అర్థము చేసికొనుటకు ఈ రెండింటి భావార్థమును మనము సంపూర్తిగ

గ్రహించుకొనుట అత్యవుసరము. విత్తువాని ఉపమానము, గురుగులను గూర్చిన ఉపమానము యొక్క గ్రహింపు మిగతా ఉపమానములను గ్రహించుటకు మూలమగును.

ఆయన ఎందుకు ఉపమానరీతిగా బోధించారో కూడ యేసు తెలియజేసారు (మత్తయి 13:10-17). యూదుల చరిత్ర అంతటిలోను తరుచు వారిని గూర్చి వాడబడిన పదములను యేసు ఇక్కడ వినియోగించారు (ద్వితీ 29:4; యెషయా 6:9-10; యెహెజ్కేలు 12:2). పౌలుకూడ తాను బోధించుచున్నవారు దేవుని వాక్యము విషయమై వాతవేయబడినట్లున్నారని చిత్రీకరించాడు (రోమా 11:8).

"ఇందు నిమిత్తమై నేను ఉపమానరీతిగా వారికి బోధించుచున్నాను. ఈ ప్రజలు కన్నులారజూచి, చెవులారవిని హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నావలన స్వస్థత పొందుకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది, వారి చెవులు వినుటకు మందములైనవి. వారుతమ కన్నులు మూసికొని యున్నారు గనుక మీరు వినుటమట్టుకు విందురుగాని గ్రహింపనే గ్రహింపరు. చూచుటమట్టుకు చూతురు గాని యెంత మాత్రమును తెలిసికొనరు. అని యెషయా చెప్పిన ప్రవచనము వీరి విషయమై నెరవేరుచున్నది. అయితే మీకన్నులు చూచుచున్నవి గనుక అవి ధన్యములైనవి. మీ చెవులు వినుచున్నవి గనుక అవిధన్యములైనవి" (మత్తయి 13:13-16).

రాజ్యమును గూర్చి యేసు చెప్పిన దజను ఉపమానములలో విత్తువాని ఉపమానము ఒకటియై యున్నది. ఆత్మీయ రాజ్యమును గూర్చిన భావము పాత నిబంధనలో ఉత్పన్నమాయెను. అది ప్రవచనములలోను, సిద్ధపాటులోను, నెరవేర్పులోను ముఖ్యభాగమాయెను. "ఆరాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు" (దానియే 2:44). యేసుప్రభువు, బాప్తిస్మమిచ్చు యోహాను, వారియొక్క శిష్యులు ఫిలిప్పు, పౌలు యోహాను మొదలగువారు

రాజ్యమును గూర్చి బోధించిరి (మార్కు 1:15; 3:1–2; అపొ.కా. 8:12; కొలస్స 1:13; ప్రక 1:9). ఇవియేగాక మిగతా లేఖనభాగములు కూడ రాజ్యమును గూర్చి బోధించును. లేఖనములలో అది తరుచు పరలోక రాజ్యమని, దేవుని రాజ్యమని సంబోధించుట జరిగినది. ఈ రెండు పదములు సరిసమానముగ ఒకే రాజ్యమును సూచించుటకు వాడబడినవి.

ఈ ఉపమానములో ప్రభువు రాజ్యము ఒక మొక్కతో పోల్చబడెను. క్రమక్రమముగా కనబడు పెరుగుదల ఇందులో కనబడును. ఒక మొక్క పెరుగాలన్నా, రాజ్యము అభివృద్ధి కావాలన్నా ఓర్పు అవసరము (యాకోబు 5:7; లూకా 8:15).

క్రైస్తవ పెరుగుదలలో చెట్టుకంటే ముందు ఫలమును కాంక్షించకూడదు. రాజ్యము యొక్క క్రమము అభివృద్ధి వ్యక్తులు మార్పుజెందుట, తదుపరి వారి ఆత్మీయాభివృద్ధిపై ఆధారపడి యున్నది. క్రీస్తులో శిశువులైన వారు క్రమముగా దేవుని వాక్యమనే పాలను ఆపేక్షించాలి (I పేతురు 2:2–3). అప్పుడు వారు బలవంతులగుదురు. క్రైస్తవులు (రాజ్యముకూడ) బలవంతులు కాకపోతే వారి అభివృద్ధి కుంటుపడును ((I కొరింథి 3:1–4; హెబ్రీ 5:11–6:2). క్రైస్తవుల యొక్కయు రాజ్యము యొక్కయు అభివృద్ధి క్రమక్రమముగా యుండాలి, అభివృద్ధి జెందాలి.

నిజానికి విత్తువాడైన ప్రతి క్రైస్తవుడు విత్తనము ఎట్లు పెరుగునో తెలిసికొననవుసరము లేదు. అయితే విత్తువాడు మాత్రము నిష్కల్మషమైన విత్తనమును ఎంచుకోవాలి, ఎట్లు విత్తవలెనో పంటకోయవలెనో తెలిసికోవాలి. ఏలయనగా "విత్తనము దేవుని వాక్యము" (లూకా 8:11), విత్తువాడు చేయవలసినదంతా విత్తడమే. ఆ విత్తనము మొలకెత్తునట్లు చేయుశక్తి అతనికి లేదు.

వ్యవసాయములోను రాజ్యవిస్తరణలోను అభివృద్ధి జెందాలంటే మానవుడు దేవుడుకూడ జతకట్టబడియుండాలి. దేవుడు లేకుండా మానవుడు

రాజ్యమును విస్తరింపజేయజాలడు. మరియు మానవునియొక్క విధేయతతో కూడిన సహకారములేకుండా దేవుడు రాజ్యమును విస్తరింపజేయడు. అందువలననే, "నేను నాటితిని అపొల్లో నీరుపోసెను. వృద్ధికలుగజేసినవాడు దేవుడే" యని పౌలు చెప్పెను ((I కొరింథీ 3:6). మంచి పంట కావాలంటే దైవ మానవ సహకారము అత్యవుసరము.

విత్తువాని ఉపమానము యొక్క ముఖ్యోద్దేశము మాత్రమేగాక, తమ పరిచర్యలో కలుగు కొన్ని పరిణామములను గూర్చి శిష్యులను సిద్ధపరచు నిమిత్తము యేసు ఈ ఉపమానము చెప్పియుండ వచ్చును. చివరిగా అపొస్తలులు తమ బోధకుడు సిలువపై మరణించుట చూచారు. దానికిముందు వెనుక కూడ వారు ప్రకటించిన సువార్తకు ప్రతిఘటనను వారు ఎదుర్కొన్నారు. యేసు తన శిష్యులకు పరిమితిగల ఆజ్ఞయిచ్చి పంపకమందు వారు ప్రతిఘటనను హింసను ఎదుర్కొందురని ముందుగనే వారికి తెలియజేసెను (మత్తయి 10:16-25).

అపొ.పౌలు సువార్త ప్రకటించుచుండగా అది ఎట్లు నిరాకరించబడెనో అపొస్తులల కార్యముల గ్రంథములో వ్రాయబడియున్నది. పౌలు యొక్క శ్రమలు 2 కొరింథీ 11:23-28లో మనకు కనబడును. ముఖ్యముగా ఏథెన్సులో అతడు సువార్త ప్రకటింపగా అతనికి కలిగిన విజయము బహుస్వల్పమే (అపొ.కా. 17).

శాతము కట్టవలసివస్తే విత్తువాని ఉపమానము సువార్త చాటు కృషిలో నూటికి 25వంతు మాత్రమే మంచి ఫలితము లభించునని సూచించుచున్నది. రక్షింపబడువారు కొందరే (మత్తయి 7:13-14). అయినను సరే లెక్కింపజాలనంతమంది జనులు పరలోకములో యుందురు (ప్రకటన 7:9). ఒక సందర్భములో అపొస్తలులు యేసును వెంబడించినందువలన యేమి దొరుకును అనే నిరుత్సాహమును వ్యక్తపరిచిరి. గాని వారు కోల్పోయిన దానికంటె అత్యధికముగా దేవుడు వారికి దయ చేయునని యేసువారికి నిర్ధారణనిచ్చారు (మత్తయి 19:27-30 అపొస్తలులు, ఆదిమ క్రైస్తవులు

కూడ నిరుత్సాహ పడుటకొక కారణమున్నది. వారు హింసలు పాలయ్యారు (అపొ.కా. 8:1-4). నేడు కూడ మనం ఎవరికైనా యేసును గూర్చి చెబితే వారు నిరాకరిస్తే మనకు బాధకలుగును. గాని మనం అపొస్తులవలె సంతోషించడానికి గొప్ప కారణమున్నది. మనం విమోచింపబడినవారము. మరియు సువార్త అనేకులకు చాటబడుచున్నను రక్షింపబడేవారు కొద్దిమందియే.

## ఉపమాన సందర్భము:

కపెర్న హూమునకు వెలుపల గొప్ప జనసమూహమునకు యేసు ఈ ఉపమానము చెప్పెను. గలిలయసముద్రము దరినున్న ఒక నావలో కూర్చుని యేసు జనసమూహములకు ఉపదేశించెను (మత్తయి 13:1-2)

ఆరోజు అంతకు ముందు దయ్యము పట్టిన ఒక మనుష్యుని ఆయన బాగుచేసెను (మత్తయి 12:22); అది అనేకులలో ఆసక్తిని మరికొంత మందికి వివాదమును రేకెత్తించెను. పరిసయ్యులు యేసునుండి ఒక సూచక క్రియచూడగోరారు గాని యేసువారిని నిరాకరించెను (మత్తయి 12:38-45). యేసు కుటుంబ సభ్యులు ఆయనను చూచుటకు వచ్చిరిగాని జనసమూహము వలన వారాయనను కలిసికొనలేక పోయిరి (మత్తయి12:46-50). ఆదినమందే యేసు ఉపమాన రీతిగా బోధింప నారంభించెను. విత్తువాని ఉపమానము అందులో ఒకటి.

## ఉపమానము:

"ఆయన జన సమూహములను చూచి చాల సంగతులు ఉపమాన రీతిగా చెప్పెను. ఎట్లనగా ఇదిగో విత్తువాడు విత్తుటకు బయలువెళ్లెను" (మత్త 13:3).

యేసుముందున్న జనములు విత్తనములు విత్తుట బాగుగా ఎరిగినవారే. విత్తనము ఎవరైనా విత్తవచ్చును. చిన్నపిల్లలు సయితము భూమిలో విత్తనము

నాటగలరు. అదే రీతిగా క్రైస్తవులందరు రాజ్యము యొక్క విత్తనము విత్తగలరు (అపో.కా. 8:4; 2తిమో 2:24; హెబ్రీ 5:11–6:2).

కానాను వాసులు సాధారణముగా గ్రామములలోనే నివసించేవారు. వారందరు విత్తనములు విత్తే దృశ్యాన్ని చూచిన వారే. "విత్తువాడు విత్తుచుండగా కొన్ని విత్తనములు త్రోవ ప్రక్కను పడెను; పక్షులు వచ్చి వాటిని మ్రింగివేసెను" (మత్తయి 13:4).

విత్తబడిన విత్తనము మంచిదే యనుభావము ఈ ఉపమానములో యున్నది. ప్రతిచోట పడినది మంచివిత్తనమే. విత్తనము నాటబడితేనే గాని పంటరాదని మనందరము ఎరిగిన వాస్తవమే. విత్తబడిన దానిని బట్టి వచ్చే పంటనుకూడ అంచనా వేయగలము. ప్రతి విత్తనము దాని జాతి ప్రకారము ఫలమునిచ్చును. (గలతీ 6:7–8; ఆదికా. 1:11). విత్తబడిన విత్తనము యొక్క నిష్పత్తిలోనే పంటకూడ యుండును (2 కొరింథీ 9:6).

ఈ ఉపమానములో విత్తనము దేవుని వాక్యము (మత్త 13:19; మార్కు 4:14; లూకా 8:5,11). ఈ విత్తనము సజీవమైనది, అక్షయమైనది, నిత్యమైనది. "మీరు క్షయ బీజము నుండిగాక శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యమూలముగా అక్షయ బీజమునుండి పుట్టింపబడినవారు" (I పేతురు 1:22–23). పొలములోనాటబడిన విత్తనమువలె దేవుని వాక్యము ఫలభరితమైనది. "వర్షమును హిమమును ఆకాశమునుండి వచ్చి అక్కడికి ఏలాగు మరలక భూమిని తడిపి విత్తువానికి విత్తనమును భుజించు వానికి ఆహారమును కలుగుటకై అది చిగిర్చునట్లు వర్ధిల్లజేయునో ఆలాగే నానోటనుండి వచ్చు వచనమును ఉండును. నిష్ఫలముగా నా యొద్దకు మరలక అదినాకు అనుకూలమైన దానిని నెరవేర్చును. నేను పంపిన కార్యమును సఫలము చేయును" (యెషయా 55:10–11).

ఆత్మీయ విత్తనమైన దేవుని వాక్యము మన ఆత్మలను రక్షించును. (యాకోబు 1:21). మంచి మనస్సుగల వారి ఆత్మకు యేసు యొక్క మాటలు

జీవము కలుగజేయును (యోహాను 6:63). అట్లుగాక మరణము కలుగజేయు విత్తనము నాటుటకు ఒకడు ఎంచుకొనవచ్చును (గలతీ 6:78). ఫలించకపోతే నాశనము సంభవించును (యోహాను 15:2,6).

త్రోవ ప్రక్కను పడిన విత్తనమును గూర్చి ఈ ఉపమానములో మొదట చెప్పబడినది. ఇది విత్తువాని ఉపమానమని చెప్పబడినను విత్తువాడు ఇందులో ముఖ్యుడు కాదు. వీగిపోయిన పంటనుగూర్చి అతడు నింద్యుడు కాదు. పంటయొక్క తారతమ్యములు నేలపై ఆధారపడియున్నవి. బైబిలులో విత్తనములు పడిన నేల మనుష్యుల హృదయమై యున్నది. అది మనుష్యుని జ్ఞానము (రోమా 10:9-10), భావము (మత్తయి 22-37) చిత్తములై యున్నవి. (రోమా 6:16-17). "నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా నీహృదయమును భద్రముగా కాపాడుకొనుము" (సామె 4:23; మార్కు 7:20-23).

త్రోవగా యున్ననేల గట్టిపడియుండును. అట్టి నేలపై పడిన విత్తనము ఒక రోడ్డుపై పడిన విత్తనముతో సమానము. అట్టి నేల విత్తనమును బట్టి మార్పు జెందదు. ఆ విత్తనము నిష్ప్రయోజనముగా నేలపైనే యుండును. మొలకెత్తదు. సాతానుకు సాదృశ్యముగా యున్న పక్షులు వచ్చి ఆ విత్తనమును మ్రింగివేయును (మత్త 13:19) గనుక మొలకెత్తదు.

మత్తయి 13 అధ్యా 4, 19 వచనములనుబట్టి త్రోవప్రక్కను పోలిన హృదయము గలవాడు వాక్యము ప్రకటించబడగా వినిన వాడుగాని దానిని మన్నన చేసినవాడుకాదు. అట్టివాడు తన హృదయమును మూసికొనినవాడు. అందువలన దానిని గ్రహించు కొనడు; గ్రహించుకొన ప్రయత్నించడు. సువార్త విషయమై అట్టి వాని హృదయము కఠిన పరచబడినట్టిది.

హృదయ మార్పు సంభవించకపోతే అట్టివాని ఆత్మ రక్షింపబడనేరదు. అసాధ్యము కాకపోయినా, అట్టి హృదయము మెత్తపరచబడవచ్చును. "నీతిఫలించునట్లు మీరు విత్తనము వేయుడి. ప్రేమ యనుకోతకోయుడి.

యెహోవాను వెదకుటకు ఇదే సమయముగనుక ఆయన ప్రత్యక్షమై మీమీద నీతివర్షము కురిపించునట్లు ఇదివరకెన్నడును దున్నని బీడుభూమి దున్నుడి" (హోషేయ 10:12).

"కొన్ని చాలమన్నులేని రాతి నేలను పడెను; అక్కడ మన్నులోతుగా ఉండనందున అవి వెంటనే మొలిచెనుగాని సూర్యుడు ఉదయించినప్పుడు అవిమాడి వేరులేనందున ఎండిపోయెను" (మత్తయి 13:5-6). "రాతినేలను విత్తబడినవాడు వాక్యము విని సంతోషముతో దాని నంగీకరించువాడు. అయితే అతనిలో వేరులేనందున అతడు కొంతకాలము నిలుచునుగాని, వాక్యము నిమిత్తము శ్రమ యైనను హింసయైనను కలుగగానే అభ్యంతరపడును" (మత్త 13:20-21).

రాతినేలపై నున్న పలుచటి మంటి పొర ఇక్కడ ఉదహరించబడినది. అది విత్తనము ఫలించుటకు సరిపడినంత మన్ను లేనిది. ఇక్కడ పడిన విత్తనము మొలకెత్తునుగాని మన్నులోతుగా లేనందున సూర్యుని వేడిమికి ఎండిపోవును. వేరు లోతుగా యున్న మొక్క అయితే నిలబడును.

ఈరకమైన నేలను పోలిన హృదయము గలవాడు సంతోషముతో దేవుని వాక్యము నంగీకరిస్తాడు గాని త్వరలోనే అభ్యంతరపడి వెనుదిరుగును. శ్రమయైనను, హింసయైనను కలుగగానే విశ్వాసభ్రష్టుడగును. రాతినేలను పోలినవాడు సువార్తకు వెంటనే స్పందించును గాని విశ్వాసములో నాటబడిన వాడు కాడు. అతడు శిష్యత్వమూల్యమును గూర్చి ఆలోచించినవాడు కాదు (లూకా 14:27-33). అతని ఆసక్తి కుంటుపడినందున హింస కలుగగానే, బలముపొందుటకు బదులు బలహీనుడగును (యాకోబు 1:2-4), క్రైస్తవుడగుట సులువేగాని, క్రైస్తవ్యమును పాటించుట కష్టము.

లోతుగా నాటబడితేనే గాని ఏ మొక్కయు బ్రదుకదు. ఒకడు క్రీస్తులో లోతుగా నాటబడాలి (కొలస్స 2:7; ఎఫెసీ 3:17)

"కొన్ని ముండ్లపొదలలో పడెను; ముండ్లపొదలు ఎదిగి వాటిని అణచి వేసెను" (మత్తయి 13:7)."ముళ్ళపొదలలో విత్తబడినవాడు వాక్యము వినువాడేగాని ఐహిక విచారమును ధనమోసమును ఆవాక్యమును అణచి వేయును గనుక వాడు నిష్ఫలుడగును" (మత్త 13:22).

ముండ్ల పొదల నడుమ పడిన విత్తనము, ముండ్లపొదలతో కూడ పెరుగును. అవిపడిన నేల సారవంతమైనదే. గాని మంచి విత్తనము మొలకెత్తగా ముండ్ల పొదలతో పోటీ పడవలసి వచ్చెను. ముండ్లపొదలు మంచి మొక్కను అణగద్రొక్కును. అందువలన కొంత కాలమునకు అదియు నిష్ఫలమాయెను.

ముండ్లపొదల నడుమ విత్తబడిన హృదయముగలవాడు సువార్త వాక్యము నంగీకరించును. గాని ఈలోక విచారము, ధన సంపాదన అనువాటితో నాటబడిన వాక్యమును అణచివేయును. మన జీవితంలో నుండి యేసును బయటకు పంపించేదేదయినా ముండ్లపొదవంటిదే. అది సుఖము, భోగము, ధనము, పలుకుబడి, విద్య, ఆస్థి, వినోదము, ఆటపాటలు మొ॥గునవి కావచ్చును. అదుపులో పెట్టబడని ఏ అలవాటైనను క్రీస్తుకు ఆటంకముగా మారును. ముళ్లపొదలను పోలిన హృదయముగలవారు నులివెచ్చని క్రైస్తవులు (ప్రక 3:15-16). వారు తమ మొదటి ప్రేమను విడిచిపెట్టినవారు (ప్రక 3:2). వారు నిత్యత్వాన్ని నిర్లక్ష్యము చేయుదురు. తదుపరి జీవితంకొరకు సిద్ధపడరు. సుఖభోగముల కొరకు ధనార్జన కొరకు సమయమును వెచ్చింతురు. (హెబ్రీ 11:24-25). మానవుడు దేవునికిని సిరికిని దాసుడుగా యుండనేరడు (మత్తయి 6:24). క్రైస్తవులు తమ కేవి ముఖ్యమో వాటిని సరియైన క్రమములో ఎంచుకోవాలి (మత్తయి 6:33).

"అందుకాయన నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణాత్మతోను నీపూర్ణమనస్సుతోను నీదేవుడైన ప్రభువును ప్రేమింపవలెనననుదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీపొరుగువానిని

ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దాని వంటిదే. ఈరెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవని అతనితో చెప్పెను" (మత్తయి 22:37-40).

ముండ్ల పొదల వంటి హృదయము విశ్వాసభ్రష్టత్వము సంభవించే అవకాశమున్నదని తెలియజేయుచున్నది. దేవుని బిడ్డయైన వాడు పాపము చేసి నాశనమగుట సాధ్యమేయని బైబిలు బోధించుచున్నది. దీనిని బోధించు అనేక లేఖనములున్నవి (2 పేతురు 2:20-22).

"కొన్ని మంచి నేలను పడి ఒకటి నూరంతలుగాను ఒకటి అరువదంతులుగాను ఒకటి ముప్పదంతులుగాను ఫలించెను" (మత్తయి 13:8). "మంచి నేలను విత్తబడినవాడు వాక్యమును విని గ్రహించువాడు; అట్టివారు సఫలులై యొకడు నూరంతలుగాను ఒకడు అరువదంతులుగాను ఒకడు ముప్పదంతులుగాను ఫలించును" (మత్త 13:23). మంచి నేల మంచి విత్తనము ఫలించునట్లు చేయును. కోతకాలము వచ్చువరకు పంట ఏపుగా పెరిగెను. మంచినేల, మంచి విత్తనము కలిసి మంచి పంట నిచ్చెను.

మంచి నేల వంటి హృదయముగలవాడు వాక్యమునువిని దానిని గ్రహించుకొనును (మత్త 13:23), వాక్యమును విని దానిని అంగీకరించును (మార్కు 4:20), మంచి మనస్సుతో వాక్యము విని దానిని అవలంబించి, ఓపికతో ఫలించును (లూకా 8:15). ఇట్టివారిపై దేవుడు ఆధారపడును. యేసువారి రక్షణకు కర్తయు, కారకుడును (హెబ్రీ 2:10; 5:8-9), వారు అజ్ఞానులు గాక, బోధింపసమర్థులైనవారు (హెబ్రీ 5:11-6:2 2తిమోతి 2:2, 24), మంచి హృదయముగల క్రైస్తవులు విశ్వాస పరీక్షలన్నిటిలో విజయవంతముగా నిలుచువారు (అపొ.కా. 8:1-4), లోకమునకు సువార్త చాటువారు (మార్కు 16:15-16), నీతితో భక్తితో జీవించువారు (తీతు 2:12), సంతోషముతో కలిసి ఆరాధించువారు (హెబ్రీ 10:25). తాము విమోచింపబడిన వారమని వారెరుగుదురు ((Iయోహాను 2:1-3). వీరికొరకు మాత్రమే యేసు మేఘారూఢుడై మరల వచ్చును ((Iథెస్స4:13-18; యోహాను

3:29, ప్రక 21:2; 22:17).

"చెవులు గల వాడు వినునుగాక" (మత్త 13:9). ఎవడును నశించనవుసరము లేదు. వయసస్సు వచ్చిన ప్రతివాడు వినగలడు, గ్రహించుకొనగలడు, అవలంబించగలడు, ఓపికతో ఫలించగలడు. ప్రతిపురుషుడు, స్త్రీ తన జీవితములో అవుసరమైన మార్పులను చేసికొనవలెను.

## ముగింపు:

1. దేవుని వాక్యము యొక్క శక్తిని సాతాను ఎరుగును. దానిని మననుండి ఎత్తికొనుపోవుటకు ప్రయత్నించును. 2). వాక్యమును విత్తు బోధకులు తమపని కష్టముతో కూడినదని ఎరగాలి. కొన్నిసార్లు తమ పని నిష్ఫలమైన దనిపించవచ్చును. వారి కష్టము వ్యర్థమైపోయినట్లగు పడును. 3) అయితే యాకోబు 3:1 మరియు రోమా 16:17-18 బోధకుల యొక్క బాధ్యతలను గుర్తు చేయుచున్నను, విత్తువాని ఉపమానము వినువాని యొక్క బాధ్యతను కూడ తెలియుజేయుచున్నది. 4) చిన్న విత్తనము వలె దేవుని వాక్యము శక్తివంతమైనది 5) విత్తనము వలె దేవుని వాక్యము ఫలించును. 6) విత్తనము వలె దేవుని వాక్యము విత్తబడాలి, నాటబడాలి నీరు పోయబడాలి, భద్రపరచబడాలి 7) బోధకులు, ఉపదేశకులను నిందించుట కంటే వినువారు మందచెవులను బట్టి ఆత్మీయ ఎదుగుదల కుంటుబడును 8) I సమాయేలు 3:10లో చెప్పబడిన స్వభావము మనకుండాలి. "యెహోవా ప్రత్యక్షమై నిలిచి ఆరీతిగా సమూయేలూ, సమూయేలూ అనిపిలువగా, సమూయేలు-నీదాసుడు ఆలకించుచున్నాడు, అజ్ఞయిమ్మనెను". 9) ఒకడు వినాలి, యేమివినుచున్నాడో కూడ ప్రాముఖ్యము, ఎట్లు వినుచున్నామో కూడ ప్రాముఖ్యము 10) దేవుని వాక్యము ఎల్లవేళలా విత్తబడాలి. 11) దేవుని వాక్యము నిత్యము శక్తివంతమైనదే. 12) సత్యము ప్రకటింపబడగా దానికి లోబడనివాని హృదయము యోగ్యమైనదికాదు, మంచిది కాదు.

# 3. గోధుమలు-గురుగులు

## (The Wheat and the Tares)

మత్తయి 13:24-30, 36-43

### పరిచయము:

యేసు భావార్థము చెప్పిన రెండవ ఉపమానము గురుగులను గూర్చినది. మొదటిది విత్తువాని గూర్చినది. యేసుమాటలను వినుచున్నవారందరికీ ఈ ఉపమానములలో యున్న వృత్తాంతము ఎరుకే. ఈ రెండింటిలోను ఒక విత్తువాడు, మంచి విత్తనము కనబడును. విత్తువాని ఉపమానములో, క్రీస్తుతో సహా నీతిమంతుడెవడైనను విత్తువాడే. గురుగులను గూర్చిన దాని విషయములో మంచి విత్తనము విత్తిన యజమాని యేసుక్రీస్తు మాత్రమే. విత్తువాని ఉపమానములో దేవుని వాక్యము విత్తనమని చెప్పబడినది. అయితే గురుగుల ఉపమానములో మంచి విత్తనము నీతిమంతులను సూచించు చున్నది. గురుగులు అనీతిమంతులకు రూపకముగా యున్నది.

తదుపరి రాజ్యము అనుమాట వేర్వేరుగా ఈ రెండు ఉపమానములలో వాడబడినది. బైబిలులో 'రాజ్యము' అనుమాట ఆత్మీయ సందర్భములో దేవుని రాజ్యాధికారమును సూచించుచున్నది, అది సంఘమును సూచించును. విత్తువాని ఉపమానములో ఈ భావముతో అది వినియోగించబడెను (మత్త 13:19; లూకా 8:1). గురుగులను గూర్చిన ఉపమానములోను, మీనాలను గూర్చిన ఉపమానములోను (లూకా 19:11-27), రాజ్యము అనుమాట ఈ లోకమును సూచించును. అందులో నీతిమంతులు, అనీతిమంతులు యుందురు. గురుగులను గూర్చిన ఉపమానములో రెండు ప్రశ్నలుద్భవించును, రెండు జవాబులీయబడెను.

## ఉపమానము:

"మరియు ఆయన మరియొక ఉపమానము చెప్పెను, ఏమనగా పరలోక రాజ్యము తన పొలములో మంచి విత్తనము విత్తిన యొక మనుష్యుని పోలియున్నది. మనుష్యులు నిద్రించుచుండగా అతని శత్రువు వచ్చి గోధుమల మధ్య గురుగులు విత్తిపోయెను. మొలకలు పెరిగి గింజ పట్టినప్పుడు గురుగులు కూడ అగుపడెను. అప్పుడు ఇంటి యజమానుని దాసులు అతని యొద్దకు వచ్చి–అయ్యా నీవు నీపొలములో మంచి విత్తనము విత్తితివిగదా, అందులో గురుగులెక్కడనుండి వచ్చినవని యడిగిరి. ఇది శత్రువు చేసిన పని అని అతడు వారితో చెప్పగా, ఆదాసులు మేము వెళ్లి వాటిని పెరికి కూర్చుట నీకిష్టమా? అని అతనినడిగిరి. అందుకతడు, వద్దు గురుగులను పెరుకుచుండగా, వాటితో కూడ ఒక వేళ గోధుమలను పెల్లగింతురు. కోతకాలము వరకు రెంటిని కలిసి యెదుగ నియ్యుడి. కోతకాలమందు గురుగులను ముందుగా కూర్చి వాటిని కాల్చివేయుటకు కట్టలు కట్టి, గోధుమలను నాకొట్టులో చేర్చిపెట్టుడని కోతగాండ్రతో చెప్పమనెను" (మత్తయి 13:24–30).

"అప్పుడా యన జనసమూహములను పంపివేసి యింటిలోనికి వెళ్లగా ఆయన శిష్యులాయన యొద్దకు వచ్చి–పొలములోని గురుగులను గూర్చిన ఉపమాన భావము మాకు తెలియజెప్పుమనిరి. అందుకాయన ఇట్లనెను– మంచి విత్తనము విత్తువాడు మనుష్యకుమారుడు; పొలము లోకము; మంచి విత్తనములు రాజ్య సంబంధులు; గురుగులు దుష్టుని సంబంధులు; వాటిని విత్తిన శత్రువు అపవాది; కోతయుగసమాప్తి; కోతకోయువారు దేవ దూతలు. గురుగులు ఏలాగు కూర్చబడి అగ్నిలో కాల్చివేయబడునో ఆలాగే యుగ సమాప్తియందు జరుగును. మనుష్య కుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములోనుండి ఆటంకములగు సకలమైనవాటిని, దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును

పండ్లు కొరుకుటయు ఉండును. అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యుని వలె తేజరిల్లుదురు. చెవులు గల వాడు వినునుగాక" (మత్తయి 13:36–43).

పొలము లోకమని యేసువివరించెను. మంచి విత్తనము దేవుని రాజ్య సంబంధులు, గురుగులు దుష్టుని సంబంధులు, శత్రువు సాతాను. కోతయుగ సమాప్తి. కోతకోయువారు దేవుని దూతలు. విత్తువాడు మనుష్యకుమారుడు (యేసే) యని యేసువివరించారు. మనుష్యకుమారుడనుమాట క్రొత్త నిబంధనలో ఇంచుమించు 80సార్లు మనకు కనబడతాది. (అపొ.కా.7:56).

గోధుమలు విత్తబడిన పొలము (లోకము) ప్రభువుకు చెందినది. ఆ యాస్థితికి తానే యజమానినని యేసు ఇక్కడ చెప్పుచున్నారు. "ఆకాశమునీదే, భూమినీదే. లోకమును దాని పరిపూర్ణతను నీవే స్థాపించితివి" (కీర్తన 89:11). ఈ భౌతిక విశ్వము, భూమి, దానిమీదనున్న సమస్త సృష్టి, మన శరీరాత్మలు అన్నీ సృష్టికర్తయైన దేవునికే చెందును. "భూమియు దాని సంపూర్ణతయు లోకమును దాని నివాసులను యెహోవావే" (కీర్తన 24:1).

మంచి విత్తనము, తద్వారా లభించిన పంట క్రైస్తవులు. గోధుమ పొలములో గోధుమ మొక్కలు కానివేమైనను గురుగులే. ఈ రెండికీ మధ్యస్థలము యేదీలేదు. క్రైస్తవులు సహజంగా ఈ లోకములో యుంటారు. గాని వారు ఈ లోక సంబంధులు కారు (యోహాను 15:18–19; 17:9–18). క్రైస్తవులు ఈ లోకమునను కరించరాదు (రోమా 12:1–2; యాకోబు 4:4).

గోధుమల మధ్య గురుగులు మొలకెత్తడం విచారమే, ఆశ్చర్యమే. విత్తన రూపములోను, మొలకల రూపములోను గురుగులకు గోధుమలకు వ్యత్యాసము బహుశ కనబడదేమో. అయితే పంటకు వచ్చిన తరువాత ఆ వ్యత్యాసము మరింత స్పష్టముగా కనబడును. "కాబట్టి వారి ఫలముల వలన వారిని తెలిసికొందురు" అని అందుకే యేసు చెప్పారు (మత్తయి 7:20).

గోధుమల మధ్య గురుగులు మొలకెత్తడం వలన సమృద్ధియైన పంటకు ఆటంకము కలుగును. వాటివలన నకిలీ పంట తయారగును. అదే రీతిగా ఈలోకమతములు, మతశాఖలు దేవునితో నేరుగా సంబంధము కలిగియున్నామని చెప్పుకొనుచు, చవుకబారు రక్షణను, వేర్వేరు ఆకర్షణలను ప్రజలకు కల్పించుచున్నారు. కొన్ని మతశాఖలవారు ఆదిమక్రైస్తవ్యమును చాలదగ్గరగా అనుకరిస్తారు. తదుపరి క్రీస్తు సంఘములో కూడ మారుమనస్సు పొందనివారు పాపములో జీవిస్తుయున్న వారుండవచ్చును. వారిని గూర్చి మిగతా వారికి తెలియక పోవచ్చును. వారు నశించినవారు. పాపములో యున్న వారిని మానవులు గుర్తించలేకపోవచ్చును. గాని దేవునివారు మోసగించలేరు. ఆయన నీతిమంతులను దుష్టులను వేరు చేయును (మత్తయి 25:31-46).

మనుష్యులు నిద్రించుచుండగా ఈ గురుగులు విత్తబడెను. అంటే ఈ దుష్క్రియ రహస్యముగా, చీకటిలో చేయబడెను. అందువలన నిద్రించుచున్న మనుష్యులను నిందించ వలసిన పనిలేదు. మంచి పనివారు రాత్రులందు సహజంగా నిద్రపోవుదురుగదా. అపవాది, వాని అనుచరులకు భిన్నముగా యేసుక్రీస్తు, ఆయనపని వారు వెలుగులో పనిచేతురు (యోహాను 3:18-21). మనుష్యుల ఆత్మలను చీకటిలోనుండి వెలుగులోనికి మరల్చుటయే ప్రభువు యొక్కయు, ఆయన అనుచరుల యొక్కయు పనియై యున్నది (మత్తయి 5:14-16; అపొ.కా. 26:16-18).

క్రీస్తు పనిని పాడుచేయడం అపవాదికి సంతోషం. సాతానుడు క్రీస్తుకు, ఆయన సంఘముకు శత్రువు. మనము చేయు ఆత్మీయ పోరాటము ఊహించ లేనంత గొప్పది. అది ఇప్పటివరకు జరిగిన ప్రపంచ యుద్ధాలన్నిటికంటె గొప్పది.

గురుగుల ఉపమానములో రెండవ విత్తువాడు శత్రువు, దుష్టుడు, అపవాదియని చెప్పబడినది (మత్తయి 13:25, 28, 38-39). ఈ

కోణములలో చూస్తే శత్రువు గురుగులను విత్తి నప్పుడు దురాక్రమణ చేయుచున్నాడు. గృహయజమాని ఆస్థిలో రహస్యముగా ప్రవేశించి అతడు అతిక్రమించాడు, హానికలిగించు ఉద్దేశ్యముతో యజమాని ఆస్థిలో ప్రవేశించాడు గనుక వాడు శత్రువు. మరియు ముఖ్యముగా వాడు శత్రువు గనుక సహజముగా వానికి ప్రవేశము లేదు. ఈ శత్రువు పిరికి వాడుకూడ.

కొంతకాలము పెరిగిన తరువాత గురుగులు మంచి పంటకు అభ్యంతరములని వెంటనే గుర్తించబడెను. శత్రువు యొక్క అసహ్యస్వభావాన్ని వెళ్లగక్కుటకే గురుగులు విత్తబడెను. గోధుమల మధ్య గురుగులు విత్తబడినందున ఎవరికీ లాభము చేకూరదు. కోతకాలమందు గురుగులను వేరు చేయుటకు గృహయజమాని సంకల్పించెను. గోధుమల నుండి గురుగులను కోతకాలమందు వేరుచేయడం, కష్టతరమైన, దుఃఖకరమైనపని.

ఈ ఉపమానములో కోత యుగసమాప్తిని, తీర్పును సూచించుచున్నది. గనుక యిది తీర్పును గూర్చిన ఉపమానము, అంతిమ తీర్పు తప్పక వచ్చును. నీతిమంతులు అనీతిమంతులు వేరుచేయబడుదురు (2పేతురు 3:10,12; ప్రక 20:11-15; మత్త 24:31, 46). కోతయైన తీర్పు ఎప్పుడు వచ్చునో మనం ఎరుగక పోయినను, దేవుడు నిర్ణయించిన కాలమందు అది తప్పక సంభవించును (అపొ.కా. 17:31).

కోతకోయువారు దేవుని దూతలు (మత్తయి 13:41; 25:31; యూదా:14-15). గురుగుల అంతిమస్థితి నరకము (మత్తయి 5:22; హెబ్రీ 10:27; మార్కు 9:43, 48). గురుగులకు గురుతుగా యున్న ఆత్మలు అగ్నిగుండములో పడవేయబడును. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును (మత్త 13:42). ఈ పదములు నరకము యొక్క యాతనను వర్ణించుచున్నవి. అది భయంకరమైన నిస్సహాయ ప్రదేశము (లూకా 10:19-31; ప్రకటన 20:11-15; మత్త 25:31-46).

సంతోషదాయకం యేమంటే మంచి విత్తనమైన గోధుమలను పోలిన

ఆత్మలకు నిత్య బహుమానము లభించును (మత్త 13:43). చెవులు గలవాడు వినును గాక యను మాటలు, గురుగులను పోలిన ఆత్మగలవారు వాక్యమును విని మార్పు జెందవచ్చునని హెచ్చరిక చేయుచున్నవి. క్రీస్తుయొక్క బోధనను సరించుటద్వారా నరకము నుండి తప్పించుకొనవచ్చును (రోమా6:17-18; (I కొరింథీ 6:9-11).

## ముగింపు:

ఈ లోకంలో మంచి, చెడుగు ఒక దాని ప్రక్కన ఒకటి ఉంటాయి. గాని చివరకు ఒకానొక దినమందు అవి వేరుచేయబడ్డాయి. ఇప్పటి మట్టుకైతే ఈ లోకం గోధుమలు గురుగులను పోలిన పొలమువలె యున్నది.

అంతిమ తీర్పు ఒకటి యున్నదని యేసుబోధించారు. పంట పెరిగిన తరువాత సంభవించుకోత దానికి గురుతుగాయున్నది. ప్రభువు మరల వచ్చువరకు అవి పెరుగుతు యుండును. మనదేవుని కలసి కొనడానికి మనము సిద్ధపడాలి (ఆమోసు 4:12).

అపవాది ఒకడున్నాడు, వాడు ఉనికి కలిగియున్నాడని ప్రభువు బోధించారు. అపవాది ఉనికి ఎంతయదార్థమో, నరకమును అంతే యదార్థమని ఆయన బోధించారు. మనం కాంక్షించుచున్న పరలోకం ఎంత యదార్థమో, నరకముకూడ అంతే యదార్థము. దానిని మనం తప్పించుకోవాలి.

గురుగులను గూర్చిన ఉపమానము సంఘ క్రమ శిక్షణను గూర్చి బోధించుట లేదు. సంఘ క్రమశిక్షణ ఈ ఉపమానములో బోధించ బడలేదు (రోమా 16:17-18; తీతు 3:10). అవుసరం వచ్చినప్పుడు సంఘము క్రమశిక్షణను అమలుపర్చాలి ((I కొరింథీ 5).

చివరిగా 'వెయ్యేండ్ల పాలన సిద్ధాంతము'ను ఈ ఉపమానము ఖండించుచున్నది. గురుగుల ఉపమానము వెయ్యేండ్ల పాలన సిద్ధాంతము పరస్పర విరుద్ధములు.

# 4. ఆవగింజ ఉపమానము

మత్తయి 13:31-32; మార్కు 4:30-32
లూకా 13:18-19

## పరిచయము:

తీరిక లేకుండా యేసు ఆ రోజు ఉపన్యసించుచునే యున్నారు. ఆయన మరికొన్ని ఉపమానములను ప్రజలకు వినిపించారు. ఆవగింజను గూర్చిన ఉపమానము, పులిపిండిని గూర్చిన ఉపమానము రెండు వెనువెంటనే చెప్పబడిన ఉపమానములు.

ఆవగింజను గూర్చిన ఉపమానము పరపూర్ణమైనది. దానికి ఆయన వివరణ ఇయ్యలేదు. యేసు తాను చెప్పిన రెండు ఉపమానములకు మాత్రమే భావార్థము చెప్పెను, విత్తువానిని గూర్చినది, గురుగులను గూర్చినది.

ఆవగింజను గూర్చిన ఉపమానము బహుసంక్షిప్తమైనది గనుక అది ప్రత్యేకమైనది. మత్తయి, మార్కు సువార్తలలో రెండు వచనములలోను లూకా సువార్తలో మూడు వచనములలోను అది చెప్పబడెను. అయినను అందులో లోపించిన పదములు యేమీలేవు. అది మన ప్రభువుచే బోధింపబడినది గనుక, అది ఉన్న రీతిగానే పరిపూర్ణమైనది.

భావార్థము చెప్పేటప్పుడు కొందరు సూక్ష్మముగా యున్న ఉపమానములను గూర్చి తొట్రిల్లుదురు. మన ప్రభువుచెప్పిన ప్రతి ఉపమానములోను ఒక ముఖ్య భావముండును. గాని తరుచు బోధకులు వాటిని వక్రీకరించి అబద్ధ బోధకు దోహదపడుదురు.

గనుక ప్రతి బైబిలు విద్యార్థికూడ ఆదైవిక వర్తమానము యొక్క ఆదిమ భావార్థము ఏమిటో, దానిని వినిన వారెట్లు గ్రహించుకొని యుండిరో తెలిసికొనుటకు ప్రయత్నించాలి. ఏదైనా వచనము బోధించని దానిని సత్యమని బోధించుటకు ప్రయత్నం చేయరాదు. అది అసత్యమగును. లేఖనములు

బోధించుసత్యమునే మనము బోధించాలి. అసత్యమును ఎన్నడు బోధించరాదు.

## ఉపమానము:

("ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను–పరలోక రాజ్యము)

ఒకడు తీసికొని తన పొలములో విత్తిన ఆవగింజను పోలియున్నది. అది విత్తనములన్నిటిలో చిన్నదేగాని పెరిగినప్పుడు కూరమొక్కలన్నిటిలో పెద్దదై ఆకాశపక్షులు వచ్చి దాని కొమ్మలయందు నివసించునంత చెట్టగును" (మత్తయి 13:31–32).

పరలోక రాజ్యము చాల చిన్నదిగా ఆరంభమగునని చెప్పుట ఈ ఉపమానము యొక్క ఉద్దేశ్యమని ఒక లేఖకుడు చెప్పాడు. అది సూక్ష్మముగా ఆరంభమై గొప్ప సంస్థగా పెరుగుననుట దీని ఉద్దేశ్యము. అది స్వల్పముగా ఆరంభమై గంభీరముగా అభివృద్ధి జెందునని మరియొక సహోదరుడు చెప్పాడు.

గొప్ప సంగతులు సాధిస్తే దానిని ఆధునిక మానవుడు విజయముగా పరిగణిస్తాడు. అందువలన మనము మెగాస్టోర్స్, మెగామాల్స్, సూపర్ బజార్లు, సూపర్ టేంకర్లు మొదలగు వాటిని చూచి గర్విస్తాము. అయితే ఉపమానములో యేసు చాల చిన్నదానిని, పరిగణింపవీలులేనిదానిని ఉదహరించారు. ప్రభువు రాజ్యము ఆరంభదశలో చిన్నగా, గమినంచదగనిదిగా, చిన్నగింజవలె ఆరంభమయ్యింది. లోకస్థులకు అది చాల చిన్న సంగతి వలె కన్పడింది. గాని ఆవగింజనుండి వచ్చిన మొక్క వలె అది చిన్నగా ఆరంభించినా, దాని అభివృద్ధి గొప్పదాయెను. ఎన్నతరమాయెను.

ఉపమానములోని ముఖ్యాంశమును విడిచిపెట్టి దానిలోని చిన్న చిన్న అంశములకు సొంత భావార్థములు కొందరు చెప్పుదురు. అది ప్రమాదకరము. ఉదాహరణకు ఈ ఉపమానములో కొమ్మలు, పక్షులు మొ॥గు వాటికి ప్రత్యేక భావముయేమీలేదు. ఆరంభము చిన్నదైనా రాజ్యము యొక్క అభివృద్ధి గొప్పదనుటకు ఈ చిన్న సంగతులను గూర్చి ఉపమానములో చెప్పబడెను.

వాటియొక్క ప్రత్యేకత యేమీలేదు.

యేసు మాటలను వినుచున్న వారందరు ఎరిగిన సందర్భములనే ఉపమానములలో ఆయన వాడెను. ఆయన మాటలను వినుచున్న వారందరు వాటిని బట్టి గొప్పగా లాభపడిరి. వాటిని సులభముగా గ్రహించు కొనగల్గిరి. ప్రకటన గ్రంథములోని అలంకార భాషయొక్క అర్థమును మొదటి శతాబ్ధపు క్రైస్తవులు మనకంటే బాగుగా గ్రహించుకొనియుండిరి.

ఈ ఉపమానములో చెప్పబడిన ఆవగింజను గూర్చి మనకు పెద్దగా అవగాహనలేదు. ఆ విత్తనములు లభించే ప్రదేశము, అది మొలకెత్తే ప్రదేశము నుండి మనము దూరముగా యున్నాము. అది పెరిగే వాతావరణముకూడా వేరు. అయితే ఆయాగ్రంథాలు వెదికితే అట్టి విత్తనము, మొక్కలు వున్నట్లు మనం గ్రహించుకోగలము.

బాగుగా పెరిగిన ఆవమొక్క 5నుండి 20 అడుగుల సైజువరకు యుండును. మన ప్రభువు చెప్పిన మొక్క ఒక తోటలో నాటబడితే గొప్పగా పెరుగును. పరలోకరాజ్యము "ఒక మనుష్యుడు తీసికొనిపోయి తన తోటలో వేసిన ఆవగింజను పోలియున్నదని" అందుకే ప్రభువు చెప్పెను (లూకా 13:19). ఈ ఆవమొక్క ఒక చెట్టువలె కనబడినను, ఒక వృక్షమునకుండ వలసిన కాండము బలము దానికి లేకపోవును. అది ఒక కాలము మట్టుకే బ్రదికియుండును. పువ్వులు, విత్తనములు రాగా అది వాడిపోవును.

ఆవగింజ అన్నిటికంటే చిన్న విత్తనము కాదని కొందరు చెబుతారు. కూరమొక్కలలో అది విత్తనము అన్నిటికంటె చిన్నదని కొందరు చెబుతారు. యేసు కూడ అట్లే దానిని గూర్చి చెప్పారు (మత్త 13:32). ఆవగింజ అనుమాట యూదులలో ఒక సామెత వలె వాడుకలో యుండేది. ఆవగింజంత విశ్వాసమును గూర్చి ప్రభువు చెప్పారు (మత్తయి 17:20). తదుపరి ప్రభువు మాటలను వినుచున్న వారెరెగిన చిన్న విత్తనము ఆవగింజయే.

ఆవగింజకును దానిమొక్కకును సైజులో యున్న వ్యత్యాసమును ప్రభువు

మాటలు వినుచున్న వారు బాగుగా ఎదిగియుండిరి. ఈ మార్పు త్వరితముగా సంభవించునని కూడ వారెరిగి యుండిరి. అందువలన యేసు తాను స్థాపించుటకు వచ్చిన రాజ్యమును ఆవగింజతో పోల్చుట సరియే. ఆవగింజ, క్రీస్తు రాజ్యము కూడ ఆరంభములో స్వల్పముగానే కనబడెను. అది నాటబడి మొలకెత్తగా రెండు కూడ గొప్పగా అభివృద్ధి జెందెను. తదుపరి ఆరంభముకును, అభివృద్ధికిని యున్న వ్యత్యాసము చాల గంభీరముగా యుండెను.

## ముగింపు

అప్పటి కింకను స్థాపించబడకపోయినను యేసు తన రాజ్యాభివృద్ధిని ప్రవచనాత్మకముగా సజీవమైన ఒక దానితో పోల్చెను. క్రీస్తు రాజ్యము (సంఘము) ఆరంభ దినమున మూడువేలమంది దానితో చేర్చబడిరి (మత్తయి 16:18-19; అపొ.కా. 2:41,47). తదుపరి కొన్ని దినముల తరువాత 5వేలమంది చేర్చబడిరి (అపొ.కా. 4:4). కాలము గడచుకొలది రాజ్య పౌరుల సంఖ్య బహుగా విస్తరించెను (అపొ.కా. 6:1-20, 7-8). ప్రతిదినము వారి సంఖ్య బహుగా విస్తరించెను (అపొ.కా. 16:5).

రాజ్యము యొక్క అభివృద్ధి నేరుగా కనబడుచుండెను. దానిపైకి వచ్చిన హింస ఎక్కడినుండి వచ్చినా (యూదులు, అన్యులనుండి) క్రీస్తు రాజ్యాభివృద్ధిని ఆపుచేయలేక పోయెను (అపొ.కా. 8:1,4). క్రైస్తవులను బహుఘోరముగా హింసించినను దాని అభివృద్ధిని ఆటంకపరచుటలో విఫలమాయెను. హతసాక్షుల రక్తము రాజ్యము యొక్క విత్తనమాయెను. కాన్‌స్టాంటిన్ చక్రవర్తి కాలములో రోమా సామ్రాజ్య విధానములు దాని అభివృద్ధిని ఆపుచేయులేకపోయినందున, క్రైస్తవ్యమునకు అనుకూలముగను, ప్రోత్సహించునట్లుగను తయారయ్యెను. క్రైస్తవ్యమును రోమా రాజ్యము తన లాభముకొరకు వాడు కొనునట్లు దాని విధానములో మార్పుజెందెను. హింసకంటే ఈ రాజకీయ విధాన మార్పువలన దేవుని రాజ్య విస్తరణకు గొప్ప విఘాతము కలిగెను.

తీవ్ర ఒత్తిడిలో కూడ క్రీస్తు శిష్యులు తమ్మును తాము ఉపేక్షించుకొనుటలో రాజ్యము యొక్క విత్తనమైన దేవుని వాక్యములో గల శక్తి గొప్పగా ప్రస్ఫుటమాయెను (లూకా 8:11; రోమా 1:16). ఆవగింజవలె ఆశక్తి నాటబడువరకు జీవము దాల్చదు. యోగ్యమైన మంచి మనస్సు గలవారిలో సువార్త వాక్యము నాటబడాలి (I పేతురు 1:23). నాటుటలోను, నీరుపోయుటలోను, కోతకోయుటలోను మానవుని యొక్క ప్రమేయముండాలనునది దేవుని సంకల్పము (రోమా 10:13-17;I కొరింథీ 3:6-9)., ఎన్ని కష్టములొచ్చినా దేవుని రాజ్య విత్తనము నాటుట సాధ్యమే (మత్తయి 24:14; కొలస్స 1:13).

నిజముగా ప్రవక్త అలంకార రీతిగా చెప్పిన చిన్నరాయి భూతలమంత పెద్దదిగా తయారయ్యెను (దానియేలు 2:31-45).

"కార్యములు అల్పములైయున్న కాలమును తృణీకరించినవాడెవడు? (జెకర్యా 4:10). ప్రభువు యొక్క గంభీరమైన సార్వజనిక రాజ్యము యొక్క పరిచయము బహుదీనముగా అగుపడును. 1) . ఆయన బహుదీనునిగా జన్మించి పశువుల తొట్టెలో పరుండబెట్టబడెను 2). ఆయన బాల్య దశ యూదులలో అల్పమైన గ్రామములో కొనసాగెను. 3). ఆయన రబ్బీగా ఎక్కడా తర్ఫీదుపొందలేదు 5) రాజులకుండవలసిన భౌతిక సంపద యేసుకులేదు. 6) తానే ప్రభుత్వము వలన వధింపబడెను.

ఇట్టి సందర్భములలో దేవుడు సంకల్పించినది తప్ప మరియే ఉద్యమమైనను నాశనమగును. క్రీస్తు రాజ్యమేర్పడిన తరువాత అది యూదులవలనను, ప్రభుత్వము వలనను తీవ్రమైన ప్రతిఘటనలను, హింసను ఎదుర్కొనెను. ఈ నూతన రాజ్యము యొక్క ముఖ్యులు, సభ్యులు కూడ చెరసాలలో బంధింపబడిరి, కొట్టబడిరి, చంపబడిరి. ఈ రాజ్యము విజయము సాధించి ప్రపంచవ్యాప్తి జెంది, వేలకొలది సంవత్సరముల మట్టుకు నిలిచి యున్నదంటే అది మానవులకు కాదుగాని దేవుని శక్తికే గొప్ప నిదర్శనమై యున్నది. కొన్ని చోట్ల సంఘము చిన్నదిగా యున్నందున ప్రజలు దానికి

వెలుపల యుండరాదు. అది చిన్నదేయని క్రీస్తు సంఘమును నిరాకరించువారు పెడ్రదోవ పెట్టబడినవారు.

ఆవగింజయొక్క ఉపమానమును ప్రభువు ఎందుకు చెప్పినట్లు? మొదటి నుండీ కూడ ప్రతివాడు యేసు బోధను అనుకరించువాడు కాదని శిష్యులు ఎరిగే యుందురు (మత్తయి 10:1-25). తిరస్కారము సంతోషదాయకము కాదు. దేవుని ప్రవక్తలు, వారి వర్తమానము కూడ తరుచు తిరస్కరించబడేది (రోమా 10:13-21).

"అయినను అందరు సువార్తకు లోబడలేదు. ప్రభువా, మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను? అని యెషయా చెప్పుచున్నాడు గదా?" (రోమా 10:16).

తదుపరి ఆయన సిలువ వేయబడగానే యేసుక్రీస్తుయొక్క భూలోక సువార్త సంచారము అకస్మికముగా ఆగిపోయెను. యేసు తిరిగిలేచునని నమ్మలేక, భయాందోళనలలో శిష్యులు పారిపోయిరి (మార్కు 14:24, 50). ప్రభువు తిరిగి లేచిన తరువాత కూడ శిష్యులు వారి పాత వృత్తికి తిరిగి వెళ్లిరి (యోహాను 21:3-14).

అపొస్తలులకు తరచు ప్రోత్సాహమవుసరమయ్యేది. వారి నిరుత్సాహముకు తోడుగా ప్రభువు చెప్పిన కొన్ని ఉపమానములు కూడ వారిని నిరుత్సాహపరచినవి. విత్తువాని ఉపమానములో నాలుగవ వంతు మాత్రమే ఫలితమిచ్చునని వారు విన్నారు. గురుగులను గూర్చిన ఉపమానములో నిలకడగా ఉన్నవారు ఎదుర్కొనే ఆటంకములను గూర్చి తెలిసికొన్నారు. వారు నిరుత్సాహపడకుండునట్లు ప్రభువు ఆవగింజను గూర్చియు, పులిపిండిని గూర్చియు నైన ఉపమానములు చెప్పారు.

ఆవగింజను గూర్చిన ఉపమానము చిన్నదే అయినను ప్రతి తరములోను యున్న దేవుని రాజ్య సంబంధుల గొప్ప భావముతో కూడినదై యున్నది.

# 5. పుల్లని పిండిని గూర్చిన ఉపమానము

## (The Parable of Leaven)

మత్తయి 13:33; లూకా 13:20-21

### పరిచయము:

పుల్లని పిండిని గూర్చిన ఉపమానము జతగా చెప్పబడిన రెండు ఉపమానములలో ఒకటి. మొదటి దానిని గత పాఠములో గమనించాము. మత్తయి సువార్త 13వ అధ్యాయములో రాజ్యమును గూర్చి యేసు చెప్పిన ఏడు ఉపమానములలో అది ఒకటి.

### ఉపమానము:

"ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను-పరలోక రాజ్యము ఒక స్త్రీ తీసికొని పిండి అంతయు పులిసి పొంగు వరకు మూడు కుంచముల పిండిలో దాచిపెట్టిన పుల్లని పిండిని పోలియున్నది" (మత్త 13:33).

పులి (leaven) అనగా పులిసిన పిండి. అదిముందేయున్న పిండిగాని, నిల్వ ఉండుటవలన పుల్లగా తయారయ్యేను. పూర్వకాలము ఈ 'పులి' ప్రత్యేకముగా లభ్యమయ్యేది కాదు. గనుక రొట్టెలు తయారు చేయునప్పుడు ఆ పిండిలో పాతదైన పులిసిన పిండిని కొంత కలిపేవారు. అప్పుడు ఆముద్ద అంతయు పులిసెను. బజారులో లభించే రొట్టెలు పులిపిండి ద్వారా పొంగినవే. గాని ప్రభురాత్రి భోజనములో మనమువాడే రొట్టె మాత్రము పులిపిండి లేనట్టిది. అది పొంగిన రొట్టె కాదు.

యేసు ఈ పులిపుండిని తన రాజ్య విస్తరణకు ఉదాహరణగా ఈ ఉపమానములో వినియోగించారు. కొన్ని సమానాంతరములు: 1) చిన్నమొత్తము వలన పెద్ద మొత్తమంతయు ప్రభావితమగును 2) ఈ మార్పు

క్రమ క్రమముగా జరుగును. అది స్థిరమైనది 3) పెరుగుదల అభివృద్ధి వక్కాణించబడెను. 4) స్వల్పారంభముతో గొప్ప ఫలితములు 5) ఈ మార్పు, ఫలితము నిశ్శబ్దముగా, అలజడి లేకుండా జరుగును 6) అపదార్థము దానికదే అభివృద్ధి జెందును. 7) చివరకు దాని విస్తీర్ణత దృగ్గోచరమగును.

పులిపిండిని గూర్చిన లక్షణములను ఒక వ్యాఖ్యాన కర్త ఇట్లు వివరించాడు. 1). దాని అంతరంగిక ప్రభావము-పులిపిండి లోపలినుండి పనిచేయును. 2). మార్పుచేయు దాని లక్షణము. పులిపిండి ముద్ద అంత పులియు వరకు (అంటు రోగము వలె) తీవ్రముగా పనిచేయును, వ్యాపించును.

పులిపిండిని గూర్చి పాత క్రొత్త నిబంధనలు రెండింటిలోనూ రిఫరెన్సులు కనబడును. పాత నిబంధనలో పులిపిండిన గూర్చి అక్షరార్థముగానే గాని అలంకార రీతిగ ఎన్నడు చెప్పబడలేదు. దహన బలులన్నిటిలోనుండి పులిపిండి నిషేధించబడెను. బలిపీఠము మీదగాక యాజకుడు సేవించు ఏ అర్పణలో నైనను దానిని వినియోగించ వచ్చును. ఒక సందర్భములో తప్ప క్రొత్తనిబంధనలో పులిపిండిని గూర్చి ఎల్లవేళలా అలంకారరీతిగానే చెప్పబడెను (మత్తయి 16:12). యేసు అలంకార రీతిగా మాట్లాడితే, శిష్యులు ఆయన నిజంగా రొట్టెలను గూర్చియే చెప్పెననుకొనిరి.

పులిపిండిని గూర్చిన సందర్భములో అది ఏదో ఒక మంచిని సూచించుటకు వాడబడినదని తలంచుదురు. అయితే యూదులలో పులిపిండి సందర్భము ఎల్లప్పుడు చెడుగునే సూచించెను. అది దుష్టత్వాన్నే ఎల్లవేళలా సూచించెను. లేఖనములలో పులిపిండి చెడుగును సూచించుటకే వాడబడెననుట నిర్వివాదము (I కొరింథీ 5:7; లూకా 12:1).

క్రొత్త నిబంధనలో మంచికి, చెడుగుకు కూడ సూచనగా 'పులిపిండి' వాడబడెను. పులియ బెట్టుట (Fermentation) కుళ్ళ బెట్టుటతో సమానమని యూదులు తలంచేవారు. అందువలన దుష్ప్రభావమునకు గురుతుగా వారు పులిపిండిని ఎంచేవారు. అందువలన యేసు పరిసయ్యుల పులిసిన పిండిని

గూర్చియు, హేరోదు పులిసిన పిండిని గూర్చియు జాగ్రత్త పడుడని తన శిష్యులను హెచ్చరించెను (మార్కు 8:15). పౌలు కూడ కొన్ని సందర్భాలలో ఇట్లు హెచ్చరించెను. "పులిసిన పిండి కొంచెమైనను ముద్దంతయు పులియ జేయునని మీరెరుగరా?" (I కొరింథీ 5:6; గలతీ 5:9). అట్లే పులిపిండిని మంచి ప్రభావముకు గురుతుగా కూడ యూదులు వాడేవారు. మంచికైనను, చెడుగుకైనను సరే పులిసిన పిండి శక్తివంతమైన ప్రభావముగల పదార్ధముగా పరిగణించబడెను.

క్రొత్త నిబంధనలో పులిసిన పిండిని గూర్చిన సందర్భము చెడుగుకు సూచనగానే వాడబడెను. 'మీరు అతిశయపడుట మంచిదికాదు. పులిసిన పిండి కొంచెమైనను ముద్ద అంతయు పులియజేయునని మీరెరుగరా? మీరు పులిపిండిని తీసిపారవేయుడి. అంతేకాక క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను. గనుక పాతదైన పులిపిండితోనైనను దుర్మార్గతయు, దుష్టత్వమునకు పులిపిండితో నైనను కాకుండ నిష్కా పటమును సత్యమునను పులియని రొట్టెతో పండుగ ఆచరింతము'(I కొరింథీ 5:6–8).

యేసు చెప్పిన ఉపమానములో పులిపిండిని గూర్చిన సందర్భము మంచికే ఉదహరించబడితే బైబిలులో అదొక్క సందర్భము మాత్రమే యున్నది. ఈ ఉపమానములో పులిపిండి చెడుగును సూచించుటకు వాడబడలేదు. అది సదుద్దేశ్యముతోనే ఈ ఉపమానములో వాడబడెను. ఇక్కడ పులిపిండి దేవుని వాక్యముతో సమానము. అది దేవుని రాజ్య విత్తనము (లూకా 8:11), యెహోవా ధర్మశాస్త్రము (కీర్తన 119:11). అది సువార్త, రక్షించుటకు దేవుని శక్తియై యున్న సువార్త (రోమా 1:16). పిండిముద్దలో వేయబడిన పులిదానినంతటిని ఎట్లు ప్రభావితము చేయునో అట్లే మంచి మనస్సుగలవాని జీవితంను సువార్త కూడ ప్రభావితం చేయును.

పాపముతో మసక బారిన ఈలోకంలో దేవుని రాజ్యాభివృద్ధిని, దాన్ని వ్యాప్తిని సూచించుటకుగాను ఈ ఉపమానములో పులిపిండిని గూర్చి

చెప్పబడెను. సువార్త వలన మన జీవితములు దైవికముగా ఎంతగా మార్చబడెనో అంతగా ఈలోకంలో మన ప్రభావముండును. ప్రతి క్రైస్తవుడు ఇతరులకు బోధించుటద్వారా పులిపిండివలె పనిచేయుచు దేవుని రాజ్య వ్యాప్తి కొరకు కృషిచేయాలనునది దేవుని సంకల్పము (2 తిమోతి 2:2, 24).

ప్రపంచ వ్యాప్తమైన ఈ రాజ్యము యొక్క ప్రత్యేక లక్షణం యేమంటే, పులిపిండివలె అది దానికదే వ్యాపించును. ఆదిమ సంఘము (రాజ్యము) నిజానికి దానికదే అతిత్వరితముగా వ్యాప్తి జెందెను (అపో.కా. 2:41, 47; 4:4; 5:14, 6:1, 7; 9:31; 11:23-24; 12:24; 16:5; 19:20).

ఈ ఉపమానములో చెప్పబడిన స్త్రీని గూర్చి, మూడు కుంచముల పిండిని గూర్చి వ్యాఖ్యాన కర్తలు వేర్వేరుగ చెబుతారు. వాటిలో ప్రత్యేకత యేమీ లేకపోయినా సాధారణంగా రొట్టెలు చేయుటకు కనీసం మూడు కుంచముల పిండిని వాడేవారు (ఆదికా 18:6). అదే రీతిగ ఈ ఉపమానములో యున్న స్త్రీ యొక్క ప్రత్యేకత యేమీ లేదు. ప్రతి యింటిలోను స్త్రీలు ఎట్లు పిండిని పిసికి ముద్ద చేయుదురో ఆ సందర్భమునే యేసు ఇక్కడ వినియోగించెను. యూదుల ఆహారములో రొట్టెలు ముఖ్యభాగము. ఈ దృశ్యాన్ని యేసు మాటలు వినేవారందరు చూచినదే, ఎరిగినదే.

ఒకటి మాత్రము మనము గమనించాలి. అదేమంటే దేవుని రాజ్యము వ్యాపించాలంటే దానిలో మానవుని పాత్ర కూడ యున్నదనే భావాన్ని ఈ స్త్రీ ఇక్కడ మనకు సూచించుచున్నది. బైబిలులో యున్న యితర లేఖన భాగాలలో ఈభావార్థము సరిపడుచున్నది (అపో.కా. 2:14, 37-47; 8:5, 8, 12, 26-40; 9; 22:-16; 10; 11:14). పిండిముద్దలో పులిసిన పిండి ఉద్దేశ్యపూర్వకముగా చేతులతో ఉంచబడును. అదేరీతిగా మనుష్యుల హృదయాలలో సువార్త వాక్యము నాటబడుటకు మానవ కృషి అవుసరము. మంటి ఘటములలో సువార్త ఐశ్వర్యము ఉంచబడినట్లు పౌలు చెప్పాడు (2 కొరింథీ 4:7). రక్షించు సువార్త వాక్యము మానవుల ద్వారా ప్రకటించబడాలని

దేవుడు నిశ్చయించారు ( I కొరింథీ 1:18-21).

"ఎందుకనగా ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయు వాడెవడో వాడు రక్షింపబడును. వారు విశ్వసింపనివానికి ఎట్లు ప్రార్థన చేయుదురు! వినని వానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు? ప్రకటించువారు పంపబడని యెడల ఎట్లు ప్రకటించుదురు? ఇందు విషయమై ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి అని వ్రాయబడి యున్నది. అయినను అందరు సువార్తకులోబడలేదు. ప్రభువా మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను? అని యెషయా చెప్పుచున్నాడు గదా? కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చినమాట వలన కలుగును" (రోమా 10:13-17).

బాల్యదశలో యున్న సంఘము (రాజ్యము) యొక్క అభివృద్ధిలో ప్రకటించుట ప్రాముఖ్యమై యుండెను. ఈ లోకమునకు దేవుడు అందించు సువార్తలో వాడబడు నోరు, చేతులు, కాళ్లు క్రైస్తవుని నోరు, చేతులు, కాళ్లు (మార్కు 16:15-16). క్రొత్త ముద్దలో దాచిన, యుంచిన పులిపిండి మొదలగునవి సువార్త వాక్యము పరలోకమునుండి తీసికొని రాబడి నశించిన ఈ లోకములో యుంచబడు సందర్భమును సూచించుచున్నవి (యోహాను 1:17). ఆ సువార్త లోకములో మార్పు కలుగజేయును (అపొ.కా. 3:19; I కొరింథీ 6:9-11; కొలస్స 1:13). ఈ లోకమునుండి గాక దానికి వేరైయున్న ఆత్మీయ రాజ్యము అట్లు స్థాపించబడెను (యోహాను 18:36).

"పిండి అంతయు పులిసి పొంగువరకు" అను మాటలు విజయ వంతమైన రాజ్యమును గూర్చి చెప్పబడిన ప్రవచనాత్మక మాటలు (మత్తయి 16:18). ఈ లోకమంతటి కొరకు యేసు మరణించారు (యోహాను 3:16). రక్షణ కొరకు సువార్త యిచ్చు షరతులకు అనేక ఆత్మలు లోబడుచున్నారు (మత్తయి 24:14; కొలస్స 1:13). విచారం యేమంటే విచక్షణ జ్ఞానం

కలిగిన అనేకమంది నశింతురు (మత్తయి 7:13-14), సంతోషం ఏమంటే అసంఖ్యాక మైన ఆత్మలు పరలోక బహుమతిని పొందుదురు (ప్రకటన 7:9).

## ముగింపు

ఆవగింజ ఉపమానమువలె పులిసిన పిండిని గూర్చిన ఉపమానము సంఘాభివృద్ధిని గూర్చి ప్రవచనాత్మకముగా చెప్పబడిన ఉపమానము. యేసు ఈ ఉపమానములు చెప్పుసరికి తన రాజ్యమైన సంఘము ఇంకా స్థాపించబడలేదు.

# ౬. దాచబడిన ధనమును గూర్చిన ఉపమానము

## (The Parable of the Hidden Treasure)

మత్తయి 13:44

**పరిచయము:**

దాచబడిన ధనము, గొప్ప విలువైన ముత్యములను గూర్చిన ఉపమానములు కవలలవలె మనకగుపడును. ఈ రెండును రాజ్యము యొక్క విలువను తెలియ జేయుచున్నవి. హెబ్రీయుల సాంప్రదాయమగు సమానాంతరములను యివి తెలియజేయు చున్నవి. ఈ రెండు ఉపమానములు, పెక్కు చేపలతో నిండిన వల, గృహయజమాని యొక్క ఉపమానము కూడ యేసు జనసమూహములను పంపివేసిన తరువాత కపెర్నహూములో ఒక యింటి లోనికి వచ్చి తన శిష్యులకు చెప్పినటువంటివి (మత్తయి 13:36).

దాచబడిన ధనమును గూర్చిన ఉపమానములో కొన్ని సంగతులు మన ఆసక్తిని రేకెత్తించును. ఈ ఉపమానములో నైతిక సమస్య తలెత్తునని కొందరు చెబుతారు. ఉదాహరణకు దాచబడిన ధనమును కనుగొనినవాడు దాని కనుగొన్న తరువాత దాని యజమానికి తెలియజేయకుండా, ఆ పొలమును కొనుట అనైతికము కాదా?

ఈ ఉపమానము దాచబడిన ధనమును కనుగొనిన వాని నైతికను గూర్చి చెప్పబడలేదు. ఈ మనుష్యుని యొక్క ఉద్దేశ్యములను, క్రియలను యేసు ఖండించలేదు, వాటిని ఆమోదించలేదు కూడ. విసుగక నిత్యము ప్రార్థన చేయవలెనని చెప్పిన సందర్భములో కూడ దేవుడు కఠినమైన తీర్పరిగా

చిత్రీకరించబడ్డారని కొందరు చెబుతారు(లూకా 18:1-8). అయితే ఉపమానములో చెప్పబడిన ప్రతి సంగతి అనుకరించబడాలని చెప్పబడలేదు. ఉపమానము ద్వారా యేసు బోధింపదలచిన ముఖ్యాంశముకు మించి భావార్థము చెప్పకూడదు. అట్లు జరుగుకుండా జాగ్రత్త వహించాలి. దాచబడిన ధనమును గూర్చిన ఉపమానములో ఒక వ్యక్తి దేవుని రాజ్యమును సంపాదించుట కొరకు చూపు చురుకైన ఆసక్తి ముఖ్యముగా చెప్పబడినది.

ఆ పొలము యొక్క యజమాని తన ధనమును ఎందుకు తిరిగి తనదిగా చేసికొనలేదు? దానినతడు ఎందుకు అమ్మతలంచాడు? కొనుగోలు చేయువాడు తనది గాని ఆస్థిలో ఎందుకు త్రవ్వకాలు జరిగించాడు అనునవి పనికిమాలిన ప్రశ్నలు. యేసు బోధింపదలచిన ఆత్మీయ పాఠమునకు అవి పనికిరావు. "రహస్యములు మన దేవుడైన యోహోవాకు చెందును. అయితే మనము ఈ ధర్మ శాస్త్ర వాక్యము లన్నిటిని అనుసరించి నడుచుకొనునట్లు బయలు పరచబడినవి యెల్లప్పుడు మనవియు మన సంతతి వారి వియునగును" (ద్వితి 29:29).

పురాతన పాలస్తీనా గృహములు కేవలము నిద్రపోవుటకు పనికివచ్చే నివాసములు మాత్రమే. ప్రశస్తమైన చరాస్థులను భద్రపరచుటకు అవి కేవలము ఉపయోగ పడవు. ఆయింటిలో ఎవరు వుండకపోతే దొంగలు పడకుండా చేయుటకు వాటికి కల్పించబడిన భద్రత శూన్యము (మత్తయి 6:19). మరియు ఒకని వ్యక్తిగత చరాస్థిని కూడ మోసుకొనిపోవుట మంచిది కాదు (లూకా 10:30). గనుక ప్రశస్థ ఆభరణములు వగయిరా భూమిలో దాచిపెట్టబడేవి (యోబు 3:21; సామె 2:4).

తూర్పు దేశ గ్రంధ కర్త ఒకడు ఇట్లు వ్రాసాడు: "వంశములలో తరచు కలుగు మార్పుల వలనను, విప్లవముల వలనను ధనవంతులైనవారు తమ ఆస్థిని మూడు భాగములుగా చేయుదురు. దానిలో కొంత వ్యాపారములో వెచ్చింతురు, లేదా తమ పోషణ కొరకు వాడుదురు, ఒక భాగము సులభముగా

తరలించగల ఆభరణములపై వెచ్చింతురు, మూడవ భాగమును భూమిలో పాతిపెట్టి దాచుదురు".

ఆ రోజులలో తమ చరాస్థులను భద్రపరచుటకు బేంకులు లేనందున ప్రజలు తరుచు వాటిని భూమిలో పాతిపెట్టేవారు. అయితే అట్లు దాచిపెట్టిన యజమాని అకస్మికముగా చనిపోయి, దాని వివరములను ఇతరులకెవరికీ తెలియజేయకపోతే అట్టి ఆస్థిని తిరిగి పొందుట కష్టమే (మత్త 2:11; 6:19; 12:35; 15:21). తలాంతులను గూర్చిన ఉపమానములో ఒక్క తలాంతు పొందినవాడు దానిని భూమిలో దాచిపెట్టెను (మత్త 25:18). కొందరు యూదులు ఇట్లు దాచిపెట్టబడిన ధనమును వెదికే అలవాటు కలవారు (యోబు 3:21; సామె 2:4).

ఈ ఉపమానములో ఆసంపదను కనుగొన్నవాడు దానిని అనుకొనని విధంగా అకస్మాత్తుగా కనుగొన్నాడని చెబుతారు. అయితే ఈ మనుష్యుడు దాచిపెట్టబడిన ధనమును ఎట్లు కనుగొన్నాడో యేసు చెప్పలేదు. అయితే ఇట్లు దాచిపెట్టబడిన ధనమును వెదికే వారుండేవారని యిదివరలోనే మనము తెలిసికొన్నాము.

కొన్నిసార్లు అనుకోకుండా మనకు కొన్ని విలువైన వస్తువులు దొరుకుతాయి. రాజ్యమును గూర్చిన ఈ ఉపమానములో, పరలోక రాజ్యము దాచబడిన ధనమును (అనుకొనకుండా) కనుగొనుటను గూర్చి చెప్పబడినది. దానిని గూర్చి అతడు వెదుకకపోయినా, అది కనబడినప్పుడు, కనుగొనినవాడు దానిని పొందుటకు ఆశతో అపేక్షించాడు. నతనయేలు, బావిదగ్గర సమరయస్త్రీ కూడ తాము అనుకొనని ప్రశస్తమైన సంగతులను కనుగొనుట మనము చూస్తాము (యోహాను 1: 43-49; యోహాను 4: 4-30).

## ఉపమానము:

"పరలోక రాజ్యము పొలములో దాచబడిన ధనమును పోలియున్నది. ఒక మనుష్యుడు దాని కనుగొని దాచిపెట్టి, అది దొరికిన సంతోషముతో

వెళ్లి తనకు కలిగినదంతయు అమ్మి ఆ పొలమును కొనును" (మత్తయి 13:44).

దాచబడిన ధనమును గూర్చిన ఈ ఉపమానములో పొలము ఈ లోకమునకు సాదృశ్యముగా యున్నది. గాని దానిలో ధనము మాత్రము ప్రాముఖ్యముగా పరలోక రాజ్యమునకు సాదృశ్యముగా కనబడుచున్నది. ఈ ఉపమానములో భౌతిక సంపదకు ఆత్మీయ సంపదకు గొప్ప తారతమ్యమున్నది.

"భూమిమీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును, దొంగలు కన్నము వేసి దొంగిలించెదరు. పరలోకమందు మీకొరకు ధనము కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెట యైనను, తుప్పైనను దాని తిని వేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధనమెక్కడఉండునో అక్కడనే నీ హృదయముండును" (మత్తయి6:19-21).

భూసంపద యొక్క విలువ ఆయా కారణముల వలన తడబడ చుండవచ్చును. ఆత్మీయ సందప యొక్క విలువ మార్పులేనిది, అమూల్యమైనది.

భూసంపదకంటే పరలోక సంపద అమూల్యము ఎందువలననగా: 1) అది అన్నిటికంటే ప్రశస్తమైనది, దాని కొరకు చేసే ప్రయత్నాలన్నీ చేయాలి. 2) ఎక్కువ పెట్టుబడి పెట్టినా అంతకంటే ఎక్కువ పొందగలము 3) గొప్ప త్యాగములు దాని కొరకు చేయవలసి వచ్చును 4) వ్యక్తిగతంగా పొందాలనే కాంక్ష అవుసరము 5) కాంక్షించుచున్న సంపదతో ఇప్పుడున్న సంపదకు పొందిక లేదు 6) ఈ సంపద కొరకు చేయవలసిన ప్రయత్నము లన్నీ చేయాలి 7) దీనిని పొందుటకు ఒకడు సంతోషంతో తనకున్నవన్నీ వెచ్చించాలి.

ఆత్మీయ సంపదను గూర్చి పరలోక రాజ్యము కొరకు 1) అవుసరమైన త్యాగము లన్నీ చేయాలి. 2) నిజముగా మార్పు జెందినవాడు తనగతాన్ని విసర్జించుటలో సణుగుకొనడు. 3) శిష్యత్వపు మూల్యము చెల్లించుటకు

నిశ్చయించుకొనినవాడే రాజ్యములో ప్రవేశించును (లూకా 14: 25-33). 4) ఈ ఆత్మీయ రాజ్య సంపదను పొందుటకు తన్ను తాను సంపూర్తిగా సమర్పించుకోవాలి. 5) ఈ ఆత్మీయ సంపద ఈలోకంలో బీదలైన వారికి కూడా లభించును.

దేవుడు దాని కొరకై వెచ్చించిన దానిని బట్టి ఈ రాజ్యము అమూల్య మైనది. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు తన్ను తాను తగ్గించుకొని మానవావతారియై సిలువ మరణమును సయితము సహించారు (ఫిలిప్పీ 2:5-8; హెబ్రీ 12:2-3). దేవుని కుమారుడైన యేసుక్రీస్తు యొక్క రక్తము దీనికొరకు వెచ్చించబడినది (అపో.కా. 20:28; ఎఫెసీ 5:25).

దేవుని రాజ్యము యొక్క మూల్యమును అపొ.పౌలు గుర్తించాడు. అందువలన ఈ లోకములో తనకేమేమి ప్రీతికరములో వాటన్నిటిని రాజ్యము కొరకు ఇష్టపూర్వకముగా విసర్జించాడు (ఫిలిప్పీ 3:4-8). దానికొరకు అతడు అనేకశ్రమలను కూడ భరించాడు (2 కొరింథీ 11:23-28).

## ముగింపు:

యోగ్యమైన మంచి మనస్సుగల ప్రతివాడు రాజ్యము యొక్క విలువను గుర్తిస్తాడు, సువార్తకు లోబడ్తాడు. తద్వారా దేవుడతనికి షరతులతోకూడిన ప్రవేశమును కల్పించుదును (అపొ.కా. 2:37-38; 41, 47). దానిలోని ఆశీర్వాదములకు రాజ్యపు పౌరులే అర్హులు (ఎఫెసీ 1:3). రాజ్యములో పౌరసత్వము పాపక్షమాపణతో ముడివడి యున్నది (2 తిమోతి 2:10).

సంఘము యొక్క విలువను సరిగా అంచనా వేసినవారు దానిని గూర్చి అమితాసక్తిని వ్యక్తపరుచుదురు. రాజ్యములో జీవితము సంపూర్ణముగా నూతనమైనది (రోమా 6:3-4; అపొ.కా. 22:4; 22:14, 22). రాజ్య విస్తరణ కొరకు వీరిపై క్రీస్తు, సంఘము ఆధారపడి యుండును.

అయితే ఒకడు రాజ్యము యొక్క విలువను గుర్తించక పోయినను అది

విలువైనదే. క్రైస్తవులు అమర్యాదగా నడుచుకొనుట వలన వారు సంఘమును కించపరచుదురు. ఇష్టపూర్వకముగా కూటములకు హాజరు కాకపోవుటవలనను (హెబ్రీ 10:25-27) వారు వెడలి వచ్చిన పాపములోనికి మరలుటవలనను సంఘమునకు వారు చెడ్డపేరు తెస్తారు (రోమా 6:2; 6:13). అట్టివారు మారుమనస్సు పొందాలి (లూకా 3:5; అపొ.కా. 2:38; మత్త 3:8).

దాచబడిన ధనము యొక్క ఉపమానము పరలోక రాజ్యము యొక్క అమూల్యమైన విలువను మనకు వక్కాణించు చున్నది. దానియొక్క విలువను, రాజ్యము యొక్క అంతిమ విజయమును ఈ పాఠం ద్వారా మనము గుర్తుంచుకోవాలి.

# 7. అమూల్యమైన ముత్యము ఉపమానము

## (The Parable of the Pearl of Great Price)

మత్తయి 13:45-46

### పరిచయము:

ఈ ఉపమానము రెండు వచనములలోనే చెప్పబడినా దీనికి రకరకాల భావార్థములు చెబుతారు. వర్తకుని గూర్చి, అమూల్యమైన ముత్యమును గూర్చి వ్యాఖ్యాన కర్తలు రకరకాలుగా చెబుతారు. అయితే ఈ ఉపమానము దీనికి ముందు చెప్పబడిన ఉపమానమునకు సమానాంతరముగా యున్నది. ఈ రెంటి ముఖ్యోద్దేశము ఒక్కటే.

ముత్యములను గూర్చి పాతనిబంధనలో చెప్పబడలేదు. యూదులకు వాటి విలువ అంతగా తెలియదు. గాని క్రొత్త నిబంధనలో ముత్యములను గూర్చి పలు మారులు చెప్పబడి యున్నది.

దాచబడిన ధనము, అమూల్యమైన ముత్యముల ఉపమానములు రాజ్యమును గూర్చి చెప్పబడిన జోడి ఉపమానములు. గత పాఠంలో వాటిని కవల ఉపమానములన్నాము. ఈ ఉపమానములు ఒక్కొక్కటి అంచనా వేయలేని పరలోక రాజ్యము యొక్క విలువను గూర్చి తెలియజేయుచున్నవి. సంఘము యొక్క వర్ణనాతీతమైన ప్రాముఖ్యతను ఈ ఉపమానములు తెలియ జేయుచున్నవి.

### ఉపమానము:

"మరియు పరలోక రాజ్యము మంచి ముత్యములను కొన వెదకు చున్న

వర్తకుని పోలియున్నది. అతడు అమూల్యమైన యొక మూత్యమును కనుగొని పోయి తనకు కలిగినంతయు అమ్మి దానికనుగొనును" (మత్తయి 13:45-46)

ఈ రెండు ఉపమానములలోను కనుగొన్నవాడు తనకు కలిగిన దంతయు అమ్మి వాటిని కొన్నట్లు చూడగలము. అయితే దాచబడిన ధనమును కనుగొన్న వాడు దానిని అనుకొనని రీతిగా కనుగొన్నాడు, గాని ఈ అమూల్యమైన ముత్యమునైతే ఒకడు దానిని వెదకి వెదకి కనుగొన్నాడు.

వర్తకుడు వ్యాపారి. అతడు అమూల్యమైన వస్తువులను వెదకి కొనేవాడు. అది అతని వినోదము లేక హాబీ కాదు. మరియు అమూల్యమైన ముత్యమును కొనుటలో అతడు లోభి కూడ కాదు. అదొక వ్యాపారసంబంధమైన పని, అతని వృత్తిలో ఒక భాగము. దానిని చివరికి వాడుకొనే వారు ఒక రాజుగాని, రాణిగాని కావచ్చును. లేదా ఎవరైనా ధనవంతుడు కావచ్చును.

ఈ వర్తకుడు ముత్యముల యొక్క విలువను అంచనా వేయుటలో సిద్ధహస్తుడు. ముత్యముల యొక్క విలువను తెలిసికొనడం అతని వ్యాపారం. అతడొక ముఖ్య ఉద్దేశ్యము గలవాడు. అతడు దేనికొరకు వెదుకు చున్నాడో బాగుగా ఎరిగిన వాడు. ఆ ముత్యము యొక్క విలువను గ్రహించిన వాడై, దాని ఖరీదును యిచ్చుటకు ఇష్టపడ్డాడు. అతని వ్యాపార లావాదేవీలలో అపార్థమునకు తావు లేదు.

గత పాఠంలో దాచబడిన ధనమున్న పొలమును కొన్నా వానికి ఇతనికి పోలిక యున్నది. ఈ మనుష్యుడు దేవుని రాజ్యమును, లేదా సంఘమును వెదుకుచున్నాడు. అతడు దానిని ఖచ్చితముగా అంచనావేసి కనుగొన్నాడు. అందువలన సంపూర్తిగా సమర్పించుకొనిన వానిని గూర్చి ఈ ఉపమానము చెప్పుచున్నది. అతడు వెదుకుచున్న దానిని పొందుటకు ఎంతైనా వెచ్చించ గలడు, వెచ్చించాడు.

ఈ అమూల్యమైన ముత్యమే క్రీస్తు సంఘము, రాజ్యము. అది అంత అమూల్యమైనది ఎందుకంటే, దేవుడే తన కుమారుడైన క్రీస్తు రక్తమును దాని కొరకు యిచ్చారు (యోహాను 3:16; అపొ.కా. 20:28). అదే రీతిగా ప్రతితరములోను సత్యమును వెదకువారు క్రీస్తు సంఘమును లేదా క్రీస్తు రాజ్యమును గుర్తించగలరు.

"అడుగుడి మీ కియ్యబడును. వెదకుడి మీకు దొరకును. తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును వెదకువానికి దొరుకును, తట్టువానికి తీయబడును" (మత్త 7:7-8).

రాజ్యము యొక్క విలువ తెలిసినదే, అందువలన అతడు ఇష్ట పూర్వకముగా దానియొక్క మూల్యమును చెల్లించాడు. సత్యమును వెదకు ప్రతివాడు రాజ్యమును సంపాదించుకొనుటకు సంపూర్తిగా సమర్పించు కొంటాడు. వ్యక్తిగతముగా ఎంతైనా అతడు దాని కొరకు మూల్యమును చెల్లించుకొంటాడు.

మూల్యము చాల హెచ్చుగానే యుండవచ్చును. పరలోక రాజ్య పౌరుడగుటకు ఒకడు మానవ కల్పిత మత రాజ్యములను, అనగా డినామినేషన్లను మతములను విసర్జించాలి. తన కుటుంబము అతడు వాటితో పెరిగియుండవచ్చును గనుక వాటిని విసర్జించుట కష్టమవ వచ్చును (గలతీ 1:13-14). ఒకడు తన కుటుంబ సభ్యులను, మిత్రులను కూడ విడనాడ వలసివచ్చును (మత్తయి 10:35-39). ఈ రాజ్య పౌరుడగుటకు ఒకడు తన వృత్తిని మార్చుకోవలసి వచ్చును, కుటుంబ వృత్తిని విసర్జించవలసి వచ్చును (అపొ.కా. 19:19). మరియు రాజ్యమును వెకువారు గతంలో వారు అలవాటు పడిన లోక భోగములను విసర్జింప వలయును (హెబ్రీ 11:25).

క్రొత్త నిబంధనలో రాజ్యమును ఈ రీతిగ వెదకినవారిలో నీ కోదేము (యోహాను3), నపుంసకుడు (అపొ.కా. 8), కొర్నేలి (అపొ.కా. 10), బెరయవారు (అపొ.కా. 17:11) ఉదాహరణగాయున్నారు. అపొస్తలులు తమ

వృత్తి వ్యాపారములను విసర్జించి సువార్త చాటుటకు సమర్పించుకొన్నారు.

"పేతురు–ఇదిగో మేము సమస్తమును విడిచిపెట్టి నిన్ను వెంబడించితిమి గనుక మాకేమి దొరుకునని ఆయననడుగగా యేసువారితో ఇట్లనెను– ప్రపంచ పునర్జననమందు మనుష్య కుమారుడు తన మహిమగల సింహాసనము మీద ఆసీనులై యుండునపుడు నన్ను వెంబడించిన మీరును పండ్రెండు సింహాసనముల మీద ఆసీనులై ఇశ్రాయేలు పండ్రెండు గోత్రముల వారికి తీర్పు తీర్చుదురు. నానామము నిమిత్తము అన్నదమ్ములనైనను అక్క చెల్లెండ్రనైనను తండ్రినైనను తల్లినైనను పిల్లలనైనను భూములనైనను ఇండ్లనైనను విడిచిపెట్టిన ప్రతివాడును నూరురెట్లు పొందును. ఇదియుగాక నిత్యజీవమును స్వతంత్రించుకొనును. మొదటివారు అనేకులు కడపటి వారగుదురు, కడపటివారు మొదటి వారగుదురు" (మత్తయి 19: 27–30). కొన్నిసార్లు మనం ఈలోక సంబంధ సంగతులను కోల్పోవుట జరుగును (మార్కు 10:17–22).

## ముగింపు:

మనం ఈ జీవితంలో పెట్టుబడులు పెట్టుదేనికైనా అత్యంత విలువైనది దేవుని రాజ్యము, లేదా క్రీస్తుసంఘము. సంఘమైన రాజ్యము కొరకు యేసు తన్నుతాను అప్పగించుకొనెను (ఎఫెసీ 5:25). క్రీస్తు ద్వారా మాత్రమే మనము రాజ్య పౌరసత్వమును పొందగలము (ఎఫెసీ 1:3). మనుష్యులు సత్యమును తెలిసికొనగలరు. అది సత్యమని వారు గ్రహించుకొనగలరు.

# 8. వలను గూర్చిన ఉపమానము

## (The Parable of the Net)

మత్తయి 13:47-50

### పరిచయము:

యేసు ఈ ఉపమానములో చెప్పిన ఉదాహరణ చేపలుపట్టు జాలరుల యొక్క వృత్తిని జ్ఞాపకము చేయుచున్నది. జాలరుల పనినిగూర్చి అక్కడ అందరు ఎరిగియున్నవారే. గలిలయ సముద్ర తీరమున నున్న కపెర్న హూము పట్టణములో యేసు ఈ ఉపమానము చెప్పారు. ఈ ఉపమానముల సముదాయములలోని మొదటి నాలుగింటిని యేసు ఒక దోనెలో నిలుచుండి చెప్పారు. జనసమూహము మాత్రము సరస్సు ఒడ్డుననిలిచి యేసుమాటలు వినుచుండిరి. వలను గూర్చిన ఉపమానము యేసు తన అపొస్తలులకు చెప్పెను. వారిలో పెక్కుమంది జాలరులే (లూకా 5:1-11). వారు తమ దోనెలలో యుండి చేపలు పట్టుచుండగా యేసువారిని పిలిచెను. "ఇప్పటినుండి మీరు మనుష్యులను పట్టువారై యుందురని" ఆయన వారికి చెప్పెను (లూకా 5:10).

యేసు చెప్పిన వల ఒక పెద్దవల. అంచుల చివర అది బరువుగా యుండును. నీటిలో వేయబడగానే ఆ బరువుతో అది నీటిలో త్వరగా మునుగును. ఆ వలపై భాగములో నీటిలో తేలునట్లు బెండ్లు ఉండును. అది నీటిలో వేయబడగా బహుశా ఒక అరమైలు మట్టుకు వ్యాపించియుండును. దాని చివరలు దగ్గరకు చేర్చగా ఆ విస్తీర్ణములో యున్న చేపలు దానిలో పట్టుబడును. దానిలో అన్ని రకముల చేపలు పట్టుబడును. గనుక వలను దరికి చేర్చగానే పనికి వచ్చే చేపలను ఎంచుకొని మిగతా వాటిని విసర్జించేవారు.

**ఉపమానము:**

వలను గూర్చిన ఉపమానము గురుగులను గూర్చిన ఉపమానము యొక్క వరుసలో చేర్చవచ్చును. ఈ రెంటికి కొన్నిసార్లు సారూప్యములున్నవి.

**గురుగులు:** యేసు శిష్యులు గురుగులను గూర్చిన ఉపమానభావము నడుగగా యేసు, "మంచివిత్తనము విత్తువాడు మనుష్య కుమారుడు, పొలము లోకము,; మంచి విత్తనములు రాజ్యసంబంధులు, గురుగులు దుష్టుని సంబంధులు; వాటిని విత్తిన శత్రువు అపవాది; కోత యుగసమాప్తి; కోతకోయువారు దేవదూతలు. గురుగులు ఏలాగు కూర్చబడి అగ్నిలో కాల్చి వేయబడునో ఆలాగే యుగ సమాప్తి యందు జరుగును. మనుష్య కుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైన వాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్ని గుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును" అని చెప్పెను (మత్తయి 13:37-42).

చేపల పెద్దవల: "మరియు పరలోక సముద్రములో వేయబడి నానా విధములైన చేపలను పట్టిన వలను పోలియున్నది. అదినిండి నప్పుడు దానిని దరికి లాగి, కూర్చుండి, మంచివాటిని గంపలలో చేర్చి చెడ్డవాటిని బయట పారవేయుదురు. ఆలాగే యుగసమాప్తి యందు జరుగును. దేవదూతలు వచ్చి నీతిమంతులలోనుండి దుష్టులను వేరుపరచి వీరిని అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును" (మత్తయి 13:47-50).

యివి రెండును రాజ్య ఉపమానములు మాత్రమే కాదు అవి తీర్పు ఉపమానములు కూడాను. గురుగులను గూర్చిన దానిలో యేసు దుష్టులను గూర్చియు, వారి నిత్య నాశనమును గూర్చియు వక్కాణించెను. ఈ రెండు ఉపమానములలోను దూతలు దుష్టుల విషయములోనే వినియోగింపబడిరి. యేసు చెప్పిన ఉపమానములలో వాటియొక్క భావాన్ని గూర్చి కొంత

అవగాహన కల్పించారు. దానిలోని ప్రతి అంశమును ఆయన వక్కాణించలేదు. గాని ఆ ఉపమానము యొక్క ప్రయోజనాన్ని నొక్కి చెప్పారు. మనం కూడ అట్లే చేయాలి.

వలను గూర్చిన ఉపమానములో మంచి వారిని చెడుగువారిని వేరు చేయుట జరుగును. దీనిలో రాజీపడే స్థితియేదీలేదు. యేసు చెప్పిన అనేక ఉపమానములలో ఈ రెండు స్థాయిల వేర్పాటు కనబడును.

గురుగులను గూర్చిన దానిలో గోధుమలు గురుగులు వేరు చేయబడును. వల విషయంలో మంచి చేపలు చెడ్డచేపలు వేరుచేయబడెను. పెండ్లివిందును గూర్చిన ఉపమానములో పెళ్లి వస్త్రము ధరించు కొననివాడు మిగతా అతిథులతో వేరుచేయబడెను. గృహయజమానిని గూర్చిన ఉపమానములలో మంచి, చెడ్డదాసుల మధ్య వేర్పాటు సంభవించెను. పదికన్యకల ఉపమానములో తెలివిగలవారినుండి తెలివిలేని కన్య కలు వేరుచేయబడిరి. తలాంతుల విషయంలో లాభము సంపాదించిన దాసులనుండి, నష్టము చేసిన వాడు వేరుచేయబడెను. గొర్రెలు మేకలను గూర్చిన ఉపమానములో వేటికవే వేరు చేయబడెను.

వలను గూర్చిన ఉపమానము పెండ్లి విందును గూర్చిన ఉపమానము వలె యున్నది. మత్తయి 22:10లో "ఆదాసులు రాజమార్గములకు పోయి చెడ్డవారినేమి మంచివారినేమి తమకు కనబడినవారి నందరిని పోగుచేసిరి". వలవేసిన వారు తమవలలో పడిన మంచి చేపలను, పనికిరాని చేపలను కూడా పోగుచేయుదురు. అన్నిరకాలైన మనుష్యులకు సువార్త బోధింపబడుచున్నది. వారు మనయెదుట నున్న సంఘములలో దర్శనమిత్తురు.

మంచి చేపలు, చెడ్డ చేపలవలె సంఘములో సభ్యులుగా మంచివారు, చెడ్డవారు కూడ యుందురు. గోధుమలు గురుగులతో ఈ చేపలు పోల్చబడవచ్చును. ఒకానొక సమయమందు వారు వేరు చేయ బడుదురు.

వల వేయబడిన సముద్రము లోకమునకు సాదృశ్యముగా యున్నది. వల అయితే క్రీస్తు రాజ్యమైన సంఘమునకు గురుతుగా యున్నది. మంచి, చెడు చేపలు క్రైస్తవులు. వలలు వేయువారు ఆత్మలను సంపాదించు క్రైస్తవులు. ఒడ్డు తీర్పునకు సాదృశ్యము. చేపలను వేరుచేయువారు దేవుని దూతలు. మంచి చేపలుంచబడిన గంప పరలోకము. పనికిమాలిన చేపలు పడవేయబడిన ప్రదేశము నరకము.

పెద్దవల సువార్త వ్యాప్తి కొరకు మానవుని ప్రయత్నమై యున్నది. సంఘాభివృద్ధి విషయంలో మానవుని పాత్రను అపొస్తలుల కార్యముల గ్రంథము చారిత్రాత్మకముగా వివరించుచున్నది. మానవులకు దేవుని వర్తమానము నందించు విషయంలో, నేరుగా దేవుడేగాక బోధకులు, ఉపదేశకుల ద్వారా అది జరుగవలెనని సంకల్పించారు (రోమా 10:13-18; 2 పేతురు 1:20-21). ఈ ఉపమానములో వలవేయుజాలరులు క్రైస్తవులు: క్షమాపణ నొందినవారందరు మనుష్యులను పట్టు జాలరులుగా యుండవలెను, ఆత్మలను దేవుని కొరకు సంపాదించవలెను.

తనలోపడే చేపలను గూర్చి వల ఎట్లు వివక్షత చూపదో అట్లే సువార్త చాటుటలో మనం ఎవరికీ వివక్షత చూపరాదు. భూమిమీదయున్న క్రీస్తు సంఘములో నీతిమంతులు, నమ్మకముగా లేని క్రైస్తవులు కూడ యుంటారు. దేవుడే తన రాజ్యమునుండి అనీతిమంతులను వేరుచేయును.

అవును, సంఘములో వేషధారులున్నారు. ఒకడు క్రైస్తవుడైన తరువాత పాపములోబడి నాశనమవవచ్చును. అక్రమంగా నడుచుకొనువారిని గూర్చి లేఖనముల ప్రకారము సంఘము క్షమ శిక్షను అమలుచేయు బాధ్యత గలది (2 థెస్స3:6, 14).

దేవుడు తీర్పుసమయంలో యేమీ పొరబాట్లు చేయరు. ఒకడు కూర్చొని ఆయా గంపలలోనికి చేపలను ఎట్లు వేరుచేయునో దేవుడు కూడ జనులను అట్లు వేరు చేయును. అనాలోచితముగా ఆయన యేమీచేయరు (మత్తయి

7:21-23). వేర్వేరు గంపలు పరలోకము, నరకాన్ని ఎట్లు సూచించునో, పరలోకము గోధుమలు కూర్చబడు కొట్టువలె (మత్తయి 13:30), అనేక నివాసములవలె (యోహాను 14:2) నిత్య నివాసము వలె (లూకా 16:9), పట్టణము వలె (హెబ్రీ 11:10; 12:22; ప్రక 3:12; 21:22) వర్ణించబడినది.

అదే రీతిగా నరకాన్ని వర్ణించు అనేక పదములు లేఖనములలో మనకు కనబడును: అగ్నిగుండము (మత్తయి 13:50), నిత్యశిక్ష (మత్తయి 25:46), నిత్యాగ్ని (మత్త 26:41; ప్రక 21:8) అగ్ని ఆరని పురుగుచావని స్థలము (మార్కు 9:43-48), వెలుపటి చీకటి (మత్త 25:30), నిత్యనింద (దానియేలు 12:2), నిత్య ఎడబాటు స్థలము (2 థెస్స 1:6-9, అపవాదికిని వాని దూతలకును సిద్ధపరబడిన స్థలము (మత్త 25:41).

## ముగింపు:

ఉపమానములు క్రొత్త సిద్ధాంతమునేదీ బోధించవు. బైబిలులో కనబడు బోధనే అవి చిత్రీకరించి విశదీకరించును. ప్రభువు యొక్క రాజ్యమునందు మనము సరిగ అర్థము చేసికొనుటకు ఈ ఉపమానములు మనకు సహాయపడును. సువార్త, క్రీస్తు రాజ్యము మానవులందరికీ వర్తించును. అయినను దానిలో ప్రవేశించువారు కొందరే. రాజ్యములో యున్నవారు యితరులను దానిలోనికి ఆకర్షించవలెను. తీర్పు వచ్చుచున్నది. కొందరు రక్షించబడుదురు. మరికొందరు నశింతురు.

# 9. ఇంటి యజమానుని గూర్చిన ఉపమానము

## (The Parable of the Householder)

మత్తయి 13:51-52

### పరిచయము:

ఉపమానమనగా పరలోక భావార్ధములను చెప్పు భూలోక కథయని మనము సూక్ష్మముగా చెప్పుకొనవచ్చును. బైబిలు రకరకాల అలంకార భాషతో యున్న సందర్భములతో నిండియున్నది. అందువలన ఉపమానమేదో అలంకారభాషయేదో యను వాటిపై అందరు ఏకాభిప్రాయమును కలిగి లేరు. కావున యేసు చెప్పిన మొత్తం ఎన్ని ఉపమానములున్నాయో, ఎన్ని అలంకారరీతిగా చెప్పబడ్డాయో అను సంఖ్యపై ఏకాభిప్రాయములేదు.

అందువలన మత్తయి 13లో కొందరు యేసుచెప్పినవి 7 ఉపమానములని లెక్కింతురు. మరికొందరు 8 అందురు. అలంకార భాషతో చెప్పబడిన మొదటి ఏడు సందర్భాలు ఉపమానములని చాలమంది ఉపదేశకులు లెక్కిస్తారు. వారు ఇంటి యజమానుని గూర్చి చెప్పిన ఉపమానము ఆసందర్భములో యేసు చెప్పిన ఉపమానములలో ఆఖరిదిగ మనం చెప్పుకొనవచ్చును (మత్తయి 13:3, 53).

"యేసు ఈ ఉపమానములు చెప్పి చాలించిన తరువాత ఆయన అక్కడనుండి వెళ్లి స్వదేశమునకు వచ్చి సమాజమందిరములలో వారికి బోధించు చుండెను"

### ఉపమానము:

యేసు మత్తయి 13లో చెప్పిన 7లేక 8 ఉపమానముల భావమును ఆయన శిష్యులు గ్రహించుకొన్నారనియే ఆయన తలంచెను. "వీటినన్నిటిని

మీరు గ్రహించితిరా అని వారిని అడుగగా వారు గ్రహించితిమనిరి" (మత్తయి 13:51).

మొదటి ఏడు ఉపమానములలోని దైవిక వర్తమానమును వారు బహుశా గ్రహించేయుందురు. ప్రభువు వర్తమానమును వారు గ్రహించియుండకపోతే దానిని గూర్చి వారాయనను యిదివరలోవలెనే అడిగియుందురు. వారికి తెలియకపోతే "ఆయన శిష్యులు–ఈ ఉపమానభావమేమియని వారాయనను" అడిగేవారు (లూకా8:9). అయినను సరే యేసుశిష్యులు రాజ్యమును గూర్చి పెద్దగా గ్రహించుకొని యుండలేదనునది వాస్తవము (యోహాను 6:15; లూకా 24:21). "కాబట్టి వారు కూడి వచ్చినపుడు–ప్రభువా యీకాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?" అని ఆయన నడిగిరి (అపొ.కా. 1:6).

రాజ్యమును గూర్చి వారెరిగిన దానిని సమర్థించుచు దానిని గూర్చిన వారి జ్ఞానమును ఇతరులకు తెలియజేయవలెననెడి బాధ్యతను ఆయన వారికి తెలియజేసారు. రాజ్యమును గూర్చిన జ్ఞానము, తరుణములతో బాటు రాజ్యములో బాధ్యతలు కూడ యుండును. మన ప్రభువుకును ఆయన శిష్యులకును మధ్య జరిగిన సంభాషణ మూలముగా ప్రభువు ఈ ఎనిమిదవ ఉపమానమును వారికి చెప్పారు.

"వీటినన్నిటిని మీరు గ్రహించితిరా అని వారిని అడుగగా వారు–గ్రహించితిమనిరి. ఆయన అందువలన పరలోక రాజ్యములో శిష్యుడుగా చేరిన ప్రతి శాస్త్రియు తన ధన నిధిలోనుండి క్రొత్త పదార్థములను పాత పదార్థములను వెలికి తెచ్చు ఇంటియజమానుని పోలియున్నాడని వారితో చెప్పెను" (మత్తయి 13:51–52).

ఇంటి యజమానుని గూర్చిన ఈ ఉపమానము మిగతా వాటివలె రాజ్యమును గూర్చిన ఉపమానము. ఈ ఎనిమిది ఉపమానములలోను ముఖ్యాంశము ఒక్కటే. అయినా దాని చిత్రీకరణ వేరు.

యేసు తన అపొస్తలులకు పరలోక రాజ్యములో శాస్త్రులని పేరు పెట్టారు. యూదామతములో యున్న శాస్త్రులు లేఖనములలోను, వారి పారంపర్యములలోను శిక్షణ పొందినవారే అయినను, పరలోక రాజ్యములో అస్థానము కలిగి యుండుటకు సరిపోరు. తన కాలము నాటి శాస్త్రులు, పరిసయ్యులను యేసు బహునిశితముగా ఖండించారు (మత్తయి 23).

దీనికి మారుగా క్రీస్తుయొక్క అపొస్తలులకు రబ్బీల తర్ఫీతు ఏమీ లేదు. గలిలయులు గనుక వారు విద్య, సంస్కృతి మొదలగు వాటియందు ఆరితేరినవారు కారు. అయితే యేసుతో వారు గడిపిన సమయము పరలోక రాజ్యములో తమ బాధ్యతలు నిర్వర్తించుటకు అన్నిటికంటె ప్రశస్తమైన అనుభవాన్ని కల్పించినది (అపొ.కా. 4:13).

తమకాలమందున్న శాస్త్రులకంటె అపొస్తలులు పరలోకరాజ్యమును గూర్చి మరింత విపులముగా బోధింపబడినవారు. శాస్త్రులవలె అపొస్తలులు కూడ రాజ్యమును గూర్చి అపార్థము చేసికొనినను, అపొస్తలులు మాత్రము పరలోక రాజ్యము యొక్క రాజును నిరాకరించలేదు. అపొస్తలులు పరిశుద్ధాత్మను, తండ్రియైన దేవుని కృపావరమును తిరస్కరించలేదు. బోధింపబడుటకు అపొస్తలులు ఆసక్తికలిగినవారు. అయితే ఒక గుంపుగా క్రీస్తు కాలమునాటి శాస్త్రులు మాత్రము ప్రభువుచే బోధింపబడుటకు అయిష్టత గలవారు.

తన్ను వెంబడించువారిని శాస్త్రులని పిలుచుట ద్వారా రాజ్యమును గూర్చిన మర్మమును, వర్తమానమును అజ్ఞానములోయున్న లోకమునకు తెలియజేయాలని యేసు వారిని హెచ్చరించారు. ఆయన శాస్త్రులవలె యేసు తన ఒక్కొక్క అపొస్తలుని ఒక గృహయజమానిగా పోల్చారు. ఈ గృహ యజమాని తన కప్పగించబడిన యావదాస్థిమీద అధికారము కలిగియున్నాడు. బహుశ ఆ యావదాస్థి తనదే అయ్యుండవచ్చును. తన అధీనములోయున్న దానంతటిమీద సర్వాధికారము కలిగియుండి అందరికీ గొప్పమేలు కలుగునట్లు

దానిని నిర్వహించాడు.

గృహయజమాని ఆధారపడినది ధననిధియని చెప్పబడినది. ఆధన నిధి పాతది క్రొత్తదియనికూడ చెప్పబడినది. యిది అపొస్తలులకు వర్తింపజేయబడగా యేసుయొక్క శిష్యరికములో వారు సంపాదించిన జ్ఞానము అది. పాతది, కొత్తది యన్నప్పుడు అవి పాత కొత్త నిబంధనకు వర్తించును. ఏభవనమైనా సరే ఎత్తులోను, వెడల్పులోను పాతపునాది మీద ఆధారపడును. క్రొత్తది పాద దానిపై నిలిచి యుండును.

ధర్మశాస్త్రము పాతది, సువార్త క్రొత్తది. అయినను క్రొత్తది పాతదాని మూలమున వచ్చినది. వేరు పురాతనం, ఫలము నూతనం. ఈ లేఖనములో పాత, క్రొత్త అనుమాటను మనం ఎట్లు అర్థము చేసికొనాలి? మత్తయి యూదులకు తన సువార్త వ్రాసాడని జ్ఞాపకముంచుకొందాము. ఆలోచనపరుడైన యూదుడు ఎట్లు స్పందిస్తాడు? పాతది, పాతనిబంధనలోని ధనము, క్రొత్తది నజరేయుడైన యేసు యొక్క బోధలు.

## ముగింపు:

అపొస్తలులకు చెందిన (2 కొరింథీ 4:7) మొదటి బాధ్యత క్రైస్తవులది కూడాను (మార్కు 16:15–16; 2 తిమో 2:2). మనము యితరులకు యేసుక్రీస్తు సువార్తను బోధించాలి.

# 10. ద్రాక్ష తోటలో పనివారి ఉపమానము

## (The Parable of the Labourers in the Vineyard)

మత్తయి 20:1-16

### పరిచయము:

మత్తయి 20: 1-16 లో చెప్పబడిన సందర్భము దానికిముందు యేసు యితరులతో చేసిన రెండు సంభాషణలతో ముడివడియున్నది. మొదటి సంభాషణ మత్తయి 19:16-22లో రికార్డు చేయబడియున్నది. అక్కడ ధనవంతుడైన యౌవ్వనుడొకడు వచ్చి నిత్యజీవమునకు వారసుడనగుటకు యేమిచేయాలని యేసునడుగుతాడు. అతడు పాతనిబంధనలోని ఆజ్ఞలను పాటించుచున్నను, తనకుకలిగిన వన్నీ అమ్మి బీదలకియ్యాలని యేసు చెప్పినప్పుడు దుఃఖముతో తిరిగి వెళ్ళిపోయాడు.

అందువలన యేసు ధనము వలన కలుగు అపాయమును గూర్చి తన శిష్యులను హెచ్చరించారు (మత్త 19:23-26). ఆయన బోధవలన వారు గజిబిజి అయ్యారని అపొస్తలులు అంగీకరించారు. పై సందర్భములన్నీ పురస్కరించుకొని "పేతురు-ఇదిగో మేము సమస్తమును విడిచిపెట్టి నిన్ను వెంబడించితిమి గనుక మాకేమి దొరుకును?" అని యేసును ప్రశ్నించాడు.

ధనవంతుడైన యువకుడు సమస్తాన్ని విడిచిపెట్టుటకు నిరాకరించాడు గాని అపొస్తలులైతే సమస్తాన్నీ, తమజీవనోపాధిని విడిచిపెట్టేసారు (మత్తయి 4:18-22; 9:9). బహుశ పేతురు ధనవంతులకు బీదలకు యున్న తారతమ్యాన్ని గర్వంతో చూపించదలచాడు. తాను, మిగతా అపొస్తలులు కూడ బీదలేయని అతని ఉద్దేశ్యం. కొన్ని సంవత్సరాల తరువాత కొరింథీ సంఘస్థులు ఒకరితోఒకరు పోల్చుకొనకూడదని పౌలు హెచ్చరించాడు: "తమ్మును తామే మెచ్చుకొను కొందరితో జతపరచుకొనుటకైనను, వారితో

సరిచూచుకొనుటకైనను మేము తెగింపజాలము గాని వారు తమలోనే యొకరిని బట్టి యొకరు ఎన్నిక చేసికొని యొకరితోనొకరు సరిచూచుకొనుచున్నందున గ్రహింపులేక యున్నారు" (2 కొరింథీ 10:12). పరిసయ్యుడొకడు సుంకరితో పోల్చుకొనుచు తన గొప్పను దేవునికి చెప్పుకొనుట యేసు గమనించారు (లూకా 18:9-14). తన్నుతాను తగ్గించుకొనిన సుంకరిని ఆయన శ్లాఘించారు, పరిసయ్యుని నిందించారు.

యేసుమాటలను వినిన తరువాత పేతురు చెప్పినమాటలు ఆమోదయోగ్యముకాని అతని స్వభావమును తెలియజేయుచున్నది. అజ్ఞానము వలన ఒక్కోసారి మనము కూడ అట్లడుగుట జరుగును. తాను చేసిన త్యాగమువలన పేతురు, మిగతా అపొస్తలులు కూడ ఏదో ఒక బహుమతికి అర్హులమని పేతురు తలంచి యుండవచ్చును.

అదే సమయానికి యాకోబు, యోహానులు రాజ్యములో ప్రముఖ స్థానము కొరకు అభ్యర్థించారు (మత్తయి 20:20-28; మార్కు 10:35-45). అపొస్తలులు కూడ ప్రభువు రాజ్యములో ప్రాముఖ్యతను కాంక్షించారు (మార్కు 9:33-37). తగ్గించు కొను విషయంలో చిన్నబిడ్డల వలె యుండాలని బోధిస్తూ యేసు ఒక బిడ్డను వారికి మాదిరిగా చూపించెను (లూకా 9:46-48).

పేతురును, అపొస్తలులును ప్రదర్శించిన తత్వము ప్రమాదకరమైనది. అది సులభముగా అసంతృప్తికి దారితీయును. త్యాగము చేయువారు దేనికొరకైతే త్యాగము చేయుచున్నారో, అది వారు చెల్లించు మూల్యము కంటె గొప్పదై యున్నట్లు తెలిసికొనగోరుదురు. యాకోబు, యోహానులు ప్రతిపాదించినట్లు భౌతిక సంబంధమైన ఇహలోక రాజ్యములో ముఖ్య స్థానములే అపొస్తలుల యొక్క బహుమతి యగునా? ధనవంతుడైన యువకుడు కాంక్షించినట్లు వారి బహుమతి నిత్యజీవమై యుండునా? యితరుల త్యాగము కంటె అపొస్తలుల త్యాగము శ్రేష్టమైనదగునా? వారి పరిస్థితిని బాగుగా ఎరిగినవాడై పేతురు ఆప్రశ్నను అడిగెను. నిజానికి ఒక

జీతగాని ఆత్మగలిగి ఆ ప్రశ్నవేయబడెను. గాని అట్టి జీతగాని ఆత్మను ఖండించడానికే యేసు ఆ ఉపమానము చెప్పెను.

**ఉపమానము:**

"ఏలయనగా పరలోక రాజ్యము ఒక ఇంటి యజమానుని పోలియున్నది. అతడు తన ద్రాక్షతోటలో పనివారిని కూలికిపెట్టుకొనుటకు ప్రొద్దున బయలుదేరి దినమునకు ఒక దేనారము చొప్పున తన పనివారితో ఒడబడి, తన ద్రాక్షతోటలోనికి వారిని పంపెను" (మత్తయి 20:1–2).

యిది రాజ్యమును గూర్చిన వారి యొక ఉపమానము. ముఖ్యముగా అపొస్తలుల నుద్దేశించి అది చెప్పబడెను. ఈ ఉపమానము లోని వ్యక్తులందరు మొదటి వచనములోనే చెప్పబడెను. మానవావతారియైన యేసుక్రీస్తు గృహయజమానివలె యున్నారు. ద్రాక్షతోటలో పనిచేయు వారు క్రైస్తవులు. గృహయజమాని యొక్క ద్రాక్షతోట సంఘము.

ఒక గృహ యజమాని తన సంపదను అభివృద్ధి చేసికొనుటలో నిమగ్నుడై యుండును. అతడు తన సమస్తాధికారముతో కుటుంబ వ్యాపారమును అభివృద్ధి చేయదలచును. గృహయజమానియే వ్యక్తిగతముగా ద్రాక్ష తోటలో పనివారిని నియమించుట గమనించదగినది. తద్వారా వారిపై తన్నుతానే పర్యవేక్షకునిగా నియమించుకొనెను. తెల్లవారకముందే పనివారిని నియమించుటకొరకు అతడు ఆరంభించియుండెను.

అతడు నియమించిన మొదటి పనివారితో నోటిమాటతో ఒప్పందము కుదుర్చుకొనెను. దినమునకు ఒక దేనారము చొప్పున వారును పనిచేయుటకు ఒప్పుకొనిరి. దేనారమనగా రోమా ప్రభుత్వపు ఒక వెండినాణెము. అది సైనికునికి ఒక రోజున కిచ్చే జీతము, లేదా పనివానికి రోజుకు యిచ్చే కూలీ అని చెప్పుకొనవచ్చును. దైనికపని వారు మాత్రమే తమ కూలీ బేరమాడేవారు.

"తరువాత అతడు దాదాపు తొమ్మిది గంటలకు వెళ్ళి సంతవీధిలో

ఊరక నిలిచియున్న మరికొందరిని చూచి మీరును నా ద్రాక్షతోటలోనికి వెళ్లుడి. యేమిన్యాయమో అది మీకిత్తునని వారితో చెప్పగా వారును వెళ్లిరి. దాదాపు పండ్రెండు గంటలకును, మూడు గంటలకును అతడు మరల వెళ్లి ఆలాగే చేసెను. తిరిగి దాదాపు అయిదు గంటలకు వెళ్లి మరికొందరు నిలిచి యుండగా చూచి ఇక్కడ దినమంతయు మీరెందుకు ఊరక నిలిచియున్నారని వారిని అడుగగా వారు ఎవడును మమ్మును కూలికి పెట్టుకొన లేదనిరి. అందుకతడు మీరును నాద్రాక్షతోటలోనికి వెళ్ళుడనెను"(మత్తయి 20:37).

గృహ యజమాని 9 గంటలకు, 12 గంటలకు, 3 గంటలకు, సాయంత్రం 5 గంటలకు వెళ్లి తన ద్రాక్షతోటలో పనిచేయుటకు పనివారిని పంపెను. వీరిలో ప్రతి పనివానితోను అతడు నోటిమాటతో జీతముకైన ఒప్పందము కుదుర్చుకొనెను. ప్రతివాడు దానికి ఒప్పుకొనెను. మీరు నాద్రాక్ష తోటలోనికి వెళ్లుడి యేది న్యాయమో అది మీకిత్తునని" అతడు చెప్పెను (మత్తయి 20:4).

పనివారు ద్రాక్షతోటలో ప్రవేశించిన వివిధ సమయములు, ఆత్మలు ఆయాసమయములలో మార్పుజెందిన సమయాన్ని సూచించును. సంతవీధి ఈ లోకము. సంతవీధిలో ఊరకనేయున్న పనివారు రక్షింపబడనివారు. ద్రాక్షతోటలో పనిచేయువారు క్రైస్తవులు. ఎంత కష్టపడి పనిచేయువాడైనా యజమాని తోటలోగాక వేరొక చోట పనిచేసినయెడల అతనికి యేమీ లభించదు (మత్తయి 7:21-23). ఈఉపమానములో యజమానుడు తనకు కనబడిన వారందరినీ పనికొరకు నియమించాడు. ఎవడును ఆయనకు పనిచేయుటకు నిరాకరించలేదు.

"సాయంకాలమైనప్పుడు ఆ ద్రాక్షతోట యజమానుడు తన గృహనిర్వాహకుని చూచి-పనివారిని పిలిచి చివరవచ్చిన వాని మొదలు కొని మొదట వచ్చినవారి వరకు వారికి కూలి ఇమ్మని చెప్పెను. దాదాపు అయిదుగంటలకు కూలికి కుదిరిన వారు వచ్చి ఒక్కొక్క దేనారము చొప్పున

తీసికొనిరి. మొదటివారు వచ్చి తమకు ఎక్కువ దొరకుననుకొనిరి గాని వారికిని ఒక్కొక్క దేనారము చొప్పుననే దొరికెను" (మత్తయి 20:8-10).

ఆరుగంటల తరువాత కూలివారు జీతము పుచ్చుకొనుటకు వచ్చిరి. తన పంటను కోసిన వారికి కూలి ఇయ్యకుండాయున్న అక్రమ యజమాని వలె గాక (యాకోబు 5:1-4), ఈ యజమానుడు తనకు పనిచేసిన వారికి పూర్ణముగా జీతము యిచ్చెను. మోషేధర్మశాస్త్రము కూడ అట్లు చెప్పుచున్నది (లేవీ 19:13; ద్వితీ 24:15). ఇక్కడ జీతము, లేక కూలీ రక్షణకు సాదృశ్యముగా యున్నది.

8-10 వచనములు పనివారికి జీతము ఇచ్చుటను చెప్పుచున్నది. వేర్వేరు సమయాలలో పనికికుదిరినా, ప్రతిపనివానికి ఒకేరకమైన జీతము ఇయ్యబడెను. మొదట కూలికి ఒడబడిన వారితో చేసికొనిన ఒప్పందము ప్రకారము యజమానుడు వారికి జీతమిచ్చెను. అదే రీతిగా మిగతావారితో కూడ అతడట్లు చేసెను. యజమానుడు దాతృత్వము గలవాడు గనుక ఆఖరున వచ్చిన వారికి కూడ ఒక్కొక్క దేనారము చొప్పున యిచ్చెను. యిది వారు సణుగుకొనుటకు కారణమాయెను.

"వారది తీసికొని చివరవచ్చిన వీరు ఒక్కగంట మాత్రమే పనిచేసినను, పగలంతయు కష్టపడి యెండ బాధ సహించిన మాతో వారిని సమానము చేసితివే అని ఆయింటి యజమానుని మీద సణుగుకొనిరి. అందుకతడు వారిలో ఒకనిచూచి-స్నేహితుడుగా నేను నీకు అన్యాయము చేయలేదే; నీవు నా యొద్ద ఒక దేనారమునకు ఒకబడలేదా? నీ సొమ్ము నీవు తీసికొని పొమ్ము" అనెను (మత్తయి 20:11-13).

గృహ యజమాని యొక్క దాతృత్వాన్ని చూచి ముందువచ్చిన పనివారు సణుగుకొనిరి. వారు చేసికొనిన ఒప్పందమును బట్టి ముందు సంతుష్టిగానే యుండిరి. గాని ఇప్పుడైతే ఆ ఒప్పందమును బట్టి వారు గృహయజమానుని ద్వేషించిరి. ఈ అసమాన చెల్లింపులు అన్యాయము కాదుగాని అవి యజమాని

యొక్క కృప, ధాత్రుత్వమునకు సూచన.

యితరులతోను, వారి సంపాదనతోను పోల్చుకొనుట లోభత్వమునకు నాందియగును. సణుగుకొనుచున్న వారికి కీడు చేయబడలేదు. వారు అసూయతో నిండినవారు. యితరక్రైస్తవులు అనుభవించు దీవెనలను గూర్చి మిగతా క్రైస్తవులు అసూయపడుట మంచిదికాదు. రక్షణ అందరికీ కలిగిన దీవెన (యూదా:3). క్రైస్తవులు మరికొందరి క్రైస్తవులను ఘనపరచుట ఒక దీవెన.

సణుగుకొనుచున్న వారిలో ఒకని చూచి ఆ గృహయజమానుడు, "స్నేహితుడా నేను నీకు అన్యాయము చేయలేదే; నీవు నా యొద్ద ఒక దేనారమునకు ఒడబడలేదా? నీవు నీ సొమ్ము తీసికొని పొమ్ము; నీకిచ్చినట్టే కడపట వచ్చిన వీరికిచ్చుటకును నా కిష్టమైనది.; నాకిష్టముచ్చినట్టు నా సొంత సొమ్ముతో చేయుట న్యాయము కాదా? నేను మంచివాడనైనందుకు నీకు కడుపు మంటగా యున్నదా? అని చెప్పెను" (మత్తయి 20:13-15).

ఈ యజమానుడు తనకున్న సహజ హక్కును అధికారమును వినియోగించెను. దేవునిలో యున్న న్యాయము, సర్వాధికారము, సార్వభౌమత్వము, కృప మొ॥నవి ఈ ఉపమానములో మనకు వ్యక్తమగుచున్నవి.

ద్రాక్షతోట యజమానివలె (మత్త 20:15), తన సొంత వ్యవహారాలలో తన యిష్టమొచ్చినట్లు చేసుకునే సార్వభౌమ హక్కును ఆయన ఉద్ఘాటించారు. ఈ సార్వభౌమత్వము ఆయన కృపన్యాయములకు భిన్నముగా వినియోగించ బడదు. గృహయజమానుడు సణుగుకొనుచున్న ఒకనితో సంబోధించాడు. అతనితో విభేధిస్తున్నవానిని యజమానుడు మర్యాదపూర్వకంగానే పిలిచాడు. అతనికి తన క్రియను వివరించాడు. 1) అతనితో చేసుకొన్న ఒడంబడికను న్యాయముగానే నెరవేర్చాడు. 2) వారు చేసుకొన్న ఒప్పందములో వారు కూడ సంతృప్తిని జెంది యుండాలి. 3) గృహయజమాని తన సొమ్మును తన

యిష్టము వచ్చినట్లు ఇచ్చుటకు హక్కు కలిగియున్నాడు. 4) తాను అన్యాయస్థుడను కానని నిర్ధారించాడు 5) అసూయ, లోభత్వము యజమానిపై విసరిన సణుగుల కాధారము.

"ఆప్రకారమే కడపటివారు మొది వారగుదురు.
మొదటివారు కడపటివారగుదురు" (మత్తయి 20:16).

ఉపమాన రీతిగా బోధించిన తరువాత యేసుదానిని అపొస్తలులకు వర్తింప జేస్తూ ముగించారు. మత్తయి 20:16 ద్వారా యేసు పేతురడిగిన ప్రశ్నకు జవాబిచ్చారు. "మొదటివారు అనేకులు కడపటి వారగుదురు, కడపటి వారు మొదటి వారగుదురు" (మత్తయి 19:30).

ఇక్కడ నేర్చుకొనవలసిన పాఠం యేమంటే ముఖ్యపనివారుగా కనబడేవారు, క్రియలవలన గాక కృపయను బహుమానమును మరచిన యెడల వారు సాధించిన దానిని కోల్పోవుదురు. దేవుని కృపను పొందుటకు దేవుని రాజ్యములో సీనియారి'టీ ఆధారము కానేకాదు. దేవుని పనివానిగా గతంలో ఉపయోగపడినను పాపమువలన పనికిమాలిన వాడగును (యెహెజ్కేలు 3:17-21). పాపము చేసిన దేవుని బిడ్డలు మారుమనస్సు పొందని యెడల జీవ గ్రంథమునుండి దేవుడు వారి పేరులు తుడిచివేయును (ప్రక 3:5; 22:19; నిర్గమ 32:33).

ఈ ఉపమానము ద్వారా యేసు అపొస్తలుల స్వభావములో యున్న దోషమును గూర్చి వారిని హెచ్చ రించారు. వారు పొరుగువారిని గూర్చి మానవుల యెడల దేవుని కృపను గూర్చి ఇంకా తెలిసికొన వలసి యున్నది. తన కృప వలన అర్హులు కాకపోయినను ఆయన శిష్యులకు కావలసినది దేవుడు అనుగ్రహించుచున్నారు. 12 గంటలకు, 3గంటలకు, 5గంటలకు వచ్చినవారికి ఆయన కృపవలన అనుగ్రహించారు. కొందరు వ్యక్తిగతముగా ఎక్కువ కష్టపడినా, యితరుల యెడలవారి స్వభావము మెరుగవ్వాలి.

సువార్త యుగములో మొదటివారు, కడపటివారి యొక్క సంబంధములు

వర్ణించబడ్డాయి. మొదటివారగు యూదులకు సువార్తముందు అందించ బడినది. వారు అన్యులకంటె ఒక దశాబ్దము ముందుగా సువార్తకు లోబడినవారు. యూదులు అన్యులు కలసి సహజీవనము చేయుచోట్ల కూడా, యూదులే మొదట సువార్త వినిరి (రోమా 1:16; అపో.కా. 13:46–48). గాని ఒక జాతిగా యూదులు యితరులను గూర్చియు క్రీస్తుద్వారా దేవుడను గ్రహించిన కృపారక్షణను గూర్చియు దోషపూరిత స్వభావమును కలిగియుండిరి.

దేవుని రాజ్యములోనికి• చివరిగా వచ్చిన అన్యజనులు, వారి పరిచర్యవలన మొదటివారగుదురు. ఒకప్పుడు మొదట వచ్చిన యూదులు యితరులను గూర్చిన తమ ద్వేషము వలన కడపటి వారగుదురు.

## ముగింపు:

దేవుని ద్రాక్షతోటలో నేడున్న పనివారు గృహయజమాని యగు క్రీసు అధికారమును సవాలు చేయకూడదు. ఆయన ద్రాక్షతోటలో పనిచేయుమని ఆహ్వానము వచ్చినవెంటనే దానిని మనం అంగీకరించాలి. క్రీస్తు ద్రాక్షతోటకు వెలుపలయున్నదేదయినను నిష్ప్రయోజనమే. ఆయన ద్రాక్ష తోటలో పనిచేసిన వారికే యేసు జీతమిచ్చును. ఆయన తోటకు ప్రక్కనున్న వాటిలో పనిచేసినా ఆయన ఒప్పుకొనరు, అంగీకరించరు. మానవుని కున్న అర్హతకంటే, అతని ఊహలకంటే దేవుని కృప ఎంతో విస్తారమైనది. మన పొరుగు వారినిగూర్చి గాని, దేవుని కృపను గూర్చిగాని సరియైన అవగాహన లేకపోతే, ఆయన రాజ్యములో మనము నిష్ప్రయోజనకులమవుదుము. చివరకు నిత్య బహుమానమును కోల్పోవుదుము.

# 11. దుర్మార్గులైన తోట కాపులు

## (The Wicked Husbandmen)

మత్తయి 21:33-46; మార్కు 12:1-12 లూకా 20:9-19

### పరిచయము:

యేసు విజయోత్సహముతో యెరూషలేములో ప్రవేశించిన తరువాత దేవాలయములో దుర్మార్గులైన తోట కాపులను గూర్చిన ఉపమానము చెప్పెను (మత్తయి 21:1-18). అక్కడ యేసు ప్రజలకు బోధించుచుండగా యాజకులు, శాస్త్రులు, యూదుల పెద్దలు ఆయనను ఆటంకపరచిరి (మత్త 21:23; మార్కు 11:27-28; లూకా 20:1). ఆయన ఏ అధికారము చొప్పున బోధించు చున్నాడో వారు తెలిసికొనగోరిరి (మత్త 21:23; మార్కు 11:28; లూకా 20:2). ఆయన అధికారముపై వారు దాడిచేయగా ఆయన తన్ను తాను సమర్థించుకొంటారని నిశ్చయముగా వారనుకొన్నారు. అయితే యేసు యిచ్చిన జవాబునుబట్టి వారాశ్చర్యపడడమేకాకుండా, ఆ మతనాయకులు తమ్మునుతామే సమర్థించుకోవలసిన పరిస్థితి యేర్పడినది (మత్త 21:24-27).

వారు యేసును "నీ ఏ అధికారము వలన ఈ కార్యము చేయుచున్నావో, యీ అధికారము యెవడు నీకిచ్చెనోమా చెప్పుమనిరి. అందుకాయన నేనును మిమ్మును ఒక మాట అడుగుదును. అది నాతో చెప్పుడి. యోహాను ఇచ్చిన బాప్తిస్మము పరలోకమునుండి కలిగినదా మనుష్యుల నుండి కలిగినదా? అని వారినడుగగా వారు మనము పరలోకమునుండి కలిగినదని చెప్పిన యెడల-ఆలాగైతే మీరెందుకు అతని నమ్మలేదని ఆయన మనలను అడుగును. మనుష్యుల వలన కలిగినదని చెప్పిన యెడల ప్రజలందరు మనలను రాళ్లతో కొట్టుదురు. ఏలయనగా యోహాను ప్రవక్తయని అందరు రూఢిగా నమ్ముచున్నారని తమలో తాము ఆలోచించుకొని అది ఎక్కడ నుండి కలిగినదో

మాకు తెలియదని ఆయనకు ఉత్తరమిచ్చిరి. అందుకు యేసు ఏ అధికారము వలన ఈ కార్యములు చేయుచున్నానో నేనును మీతో చెప్పనని వారితోననెను" (లూకా 20:2-9).

ఘర్షణ పూర్వకమైన ఈ సంభాషణ సందర్భముగా యేసు రెండు ఉపమానములు చెప్పెను. వాటిని ఆయన ఆమతనాయకులకు వర్తింప జేసెను. ఇద్దరు కుమారులను గూర్చిన ఉపమానము చెబుతు, యేసు "సుంకరులును, వేశ్యలును మీకంటె ముందుగా దేవుని రాజ్యములో ప్రవేశించువారని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (మత్త 21:31). దాని వెనువెంటనే ఆయన దుర్మార్గులైన తోట కాపులను గూర్చిన ఉపమానము చెప్పెను.

## ఉపమానము:

"ఇంటి యజమానుడొకడుండెను. అతడు ద్రాక్షతోట నాటించి దానిచుట్టు కంచెవేయించి అందులో ద్రాక్షల తొట్టి తొలిపించి గోపురము కట్టించి కాపులకు దాని గుత్తకిచ్చి దేశాంతరము పోయెను. పండ్లకాలము సమీపించి నప్పుడు పండ్లలో తన భాగము తీసికొని వచ్చుటకు ఆకాపుల యొద్దకు తన దాసులనంపగా ఆకాపులు అతని దాసులను పట్టుకొని, యొకని కొట్టిరి. యొకని చంపిరి, మరి యొకని మీద రాళ్లు రువ్విరి. మరల అతడు మునుపటికంటె ఎక్కువమంది ఇతరదాసులనంపగా వారు వీరిని ఆ ప్రకారమే చేసరి. తుదకు-నాకుమారుని సన్మానించెదరనుకొని తన కుమారుని వారియొద్దకు పంపెను. అయినను ఆకాపులు కుమారుని చూచి-ఇతడు వారసుడు ఇతని చంపి ఇతని స్వాస్థ్యము తీసికొందము రండనా తమలో తాము చెప్పుకొని అతని పట్టుకొని ద్రాక్షతోట వెలుపల పడవేసి చంపిరి. కాబట్టి ఆ ద్రాక్షతోట యజమానుడు వచ్చినప్పుడు ఆ కాపుల నేమి చేయవలెననెను, అందుకువారు ఆ దుర్మార్గులను కఠినముగా సంహరించి, వాటి వాటి కాలములయందు తనకు పండ్లను చెల్లించునట్టి ఇతర కాపులకు ఆ ద్రాక్షతోట గుత్తకిచ్చునని ఆయనతో చెప్పిరి. మరియు యేసు వారినిచూచి

ఇల్లుకట్టువారు నిషేధించిన రాయి మూలకు తలరాయి ఆయెను. ఇది ప్రభువు వలన కలిగెను. ఇది మన కన్నులకు ఆశ్చర్యము అను మాట మీరు లేఖనములలో ఎన్నడు చదువలేదా? కాబట్టి దేవుని రాజ్యము మీ యొద్దనుండి తొలగింపబడి, దాని ఫలమిచ్చు జనుల కియ్యబడునని మీతో చెప్పుచున్నాను. మరియు ఈ రాతి మీదపడువాడు తునకలై పోవును గాని అది ఎవనిమీద పడునో వానిని నలి చేయుననెను. ప్రధాన యాజకులును పరిసయ్యులును ఆయన చెప్పిన ఉపమానములను విని, తమ్మును గూర్చియే చెప్పెనని గ్రహించి ఆయనను పట్టుకొన సమయము చూచుచుండిరి గాని జనులందరు ఆయనను ప్రవక్తయని యెంచిరి గనుక వారికి భయపడిరి" (మత్తయి 21:33-46).

యేసు చెప్పిన ఉపమానములో పాలస్తీన ప్రజలందరు ఎరిగిన వ్యవసాయ పనిని గూర్చి చెప్పారు. ఆ ప్రాంతములో మరియే పంటలు లేకపోయినా, ద్రాక్షతోటలు మాత్రము విస్తారముగా యుండేవి. యేసు చెప్పిన ద్రాక్షతోట మిగతా వాటి కంటే ఫలభరితమైనది. దానిని గృహయజమాని యే స్వయంగా నాటించాడు. దానిచుట్టూ కంచె వేయించాడు (యెషయా 5:1-7). దానిలో ద్రాక్షలతొట్టి తొలిపించి గోపురముకూడ కట్టించాడు (మత్త 21:33). పెద్ద తొట్టెలు తొలిపించి అందులో ద్రాక్ష పండ్లు వేసి వాటిని తొక్కించే వారు (న్యాయా 9:27; యెషయా 63:3). ఆ తొట్టి ప్రక్కను వున్న చిన్న రంధ్రము ద్వారా ద్రాక్ష పండ్ల రసము మరియొక తొట్టిలోనికి సేకరించబడేది.

ద్రాక్ష తోటలో యున్న గోపురముపై నుండి కావలివాడు తోటయంతటిని పర్యవేక్షించేవాడు. ద్రాక్షతోట లోనికి దొంగలు, పశువులు ప్రవేశించకుండా చూచుటకు ఈ గోపురము ఉపయోగపడేది. ఈ ద్రాక్షతోటకు అన్ని సదుపాయములు సమకూర్చబడ్డాయి. మంచి వ్యాపారము దాని వలన జరుగుచుండెను.

ద్రాక్షతోట యజమానుడు కాపులకు దానిని గుత్తకిచ్చి దేశాంతరము

పోయెను (మత్త 21:33). పంటలో కొంత భాగము కౌలుగా వారు యజమానికి చెల్లింప బాధ్యులు. పండ్లకాలము సమీపించినప్పుడు తన భాగమును తీసికొని వచ్చుటకు ఆ కాపుల యొద్దకు యింటి యజమానుడు తన దాసులను పంపెను (21:34). అయితే ఆ కాపులు అతని దాసులను పట్టుకొని యొకని కొట్టిరి. యొకని చంపిరి. చివరిగా ఆ యజమానుడు తన కుమారునే పంపెను. వారతని హత్యచేసి ఆ ద్రాక్షతోటను స్వాధీనపరచుకొన ప్రయత్నించిరి (మత్త 21:37-39).

ఒక్క క్షణము యేసు ఆగి, "ఆద్రాక్షతోట యజమానుడు వచ్చినప్పుడు ఆ కాపులనేమిచేయునని" వారినడిగెను (మత్త 21:40). ఆ మతనాయకులు ఆ ఉపమానము తమకే వర్తించునని గ్రహించకుండగనే ఆ ప్రశ్నకు సరియైన జవాబిచ్చిరి.

దేవుడు యూదులను ఇదివరకే ఒక ద్రాక్షతోటగా పోల్చి చెప్పినట్లు గమనించాము (యెషయా 5:1-7). ఉపమానమును వినుచున్నవారు దానిభారము వారికేవర్తించు చున్నదని గ్రహింపక మునుపే చెప్పబడెను (2 సమూ 12:1-9). యేసు దుర్మార్గులైన కాపులను గూర్చినది, దానికిముందు చెప్పబడినది కూడ సరిగ్గా యిదే విధముగా వినియోగించెను.

ఈ ఉపమానములో యింటి యజమాని దేవుడు. ద్రాక్షతోట సంఘము. ప్రవచనాత్మకముగా అది ఇశ్రాయేలీయులకు ముందు వర్తించెను. తదుపరి అది వారినుండి తీసివేయబడి ఆత్మీయ ఇశ్రాయేలుకు అప్పగించబడెను. రోమా 11:15-24లో పౌలు యొక్క బోధను గమనించుము. క్రీస్తు రాక కొరకు, సంఘావిష్కరణ కొరకు దేవుడు యూదులను బాగుగా సిద్ధపరచెను. గాని వారు దేవుని కుమారుడైన క్రీస్తును సిలువ వేసి చంపారు. ఆయన సంఘాన్ని హింసించారు.

ఆ ఉపమానములో కాపులు పురాతన భౌతిక ఇశ్రాయేలీయులు. యజమానుడు దేశాంతరముకుపోవుట పాత కొత్త నిబంధనల మధ్యనున్న

నిశ్శబ్ద కాలము. పంపబడిన దాసులు దేదవుని ప్రవక్తలు. వారు హింసించబడిరి, చంపబడిరి (మత్తయి 23:34-35; I రాజులు 18:13; 19:10; 2 రాజులు 16:31; 22:24; 2 దినవృ 36:16; యిర్మియా 20:1-2 అపొ.కా. 12:1-2; హెబ్రీ 11:36-38). క్రొత్త కాపులు అన్యజనులు (రోమా 11:15-24).

కుమారుడు, వారసుడు యేసుక్రీస్తు. ఆయన దేవుని ప్రియ కుమారుడని మార్కు వ్రాసాడు (మార్కు 12:6). ద్రాక్షతోటకు వారసుడు తోట వెలుపల ఎట్లు చంపబడ్డాడో అట్లే యేసు క్రీస్తుకూడ యెరూషలేము వెలుపల చంపబడ్డారు. ఈ ఉపమానములో యేసు తన మరణమును గూర్చి ప్రవచించారు (మత్త 16:21).

వారసునికి ముందు దాసులు ఎట్లు పంపబడ్డారో, అట్లే యేసుకు ముందుగా ప్రవక్తలు పంపబడ్డారు. దాసులకంటే వారసుడు ఎంతశ్రేష్టుడో, అట్లే ప్రవక్తల కంటే యేసు ఎంతో శ్రేష్టుడు, వారసుడు చివరిగా పంపబడినట్లు యేసు చివరిగా పంపబడ్డారు.

మానవజాతికి విమోచన కర్త యేసుక్రీస్తు ఒక్కడు మాత్రమే. ఆ విమోచన కర్తను నిరాకరించిన యూదులకు వారు విన్నవించు కొనే వేరొక విమోచన కర్తయెవడును లేడు (హెబ్రీ 10:26). యూదుల మతనాయకులు యేసుయొక్క దైవత్వాన్ని గూర్చి పూర్తిగా ఎరుగనివారు కారు గాని వారాయనను చంపించారు (యోహాను 3:1-2). వారసుడైన కుమారుని వారు చంపించారు. కాబట్టి యూదుల క్రీస్తును చంపించుటలో అజ్ఞానులు కారు. (లూకా 23:34; అపొ.కా. 3:17).

దుర్మార్గులైన కాపులను గూర్చి వ్రాయబడిన మూడుచోట్ల ప్రధాన యాజకులు, శాస్త్రులు, పెద్దలు కూడ ఆ ఉపమానము తమ్మును గూర్చియే చెప్పబడెనని అంగీకరించారు (మత్త 21:46, మార్కు 12:12; లూకా 20:19). అందువలన వారు యేసును పట్టుకొని హింసింపగోరారు. గాని ప్రజలందరు యేసు దేవుని నుండి వచ్చిన ప్రవక్తయని ఎంచుచున్నందున వారు తమ్మును

తాము నిరోధించుకొనిరి. యేసే క్రీస్తని, మెస్సీయయని ప్రజలు అంగీకరించునట్లు ఈమతనాయకులు సహాయపడి యుండవలసినది. ఈ నాయకులు ప్రజలనుండియైనా నేర్చుకొని యుండవలసినది. ఈ నాయకుల దుర్మార్గత ద్వారా దేవుడు తన కృపను బట్టి క్రీస్తు ద్వారా విమోచనను గ్రహించునని వారు గ్రహింపనే గ్రహింపలేదు (యోహాను 11:47-53; అపొ.కా. 2:23-36).

యేసు ప్రభువు ఈ సంభాషణను పాతనిబంధన లేఖనములను తనకు అన్వయింప జేసికొనుచు ముగించెను. ప్రవచనములో రాయి ఎట్లు తిరస్కరించ బడెనో, యేసును కూడ యూదామతనాయకులు తిరస్కరించారు. తిరస్కరింప బడిన రాయి మూలకు తలరాయిగా ఎట్లు విజయం సాధించెనో, అట్లే యూదులపై యేసుకూడ విజేయుడగును. దిగువ వచనముల తారతమ్యమును చూడుము.

"ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తలరాయి ఆయెను" (కీర్తన 118:22).

"మరియు యేసు వారిని చూచి ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తల రాయి ఆయెను. ఇది ప్రభువు వలననే కలిగెను. ఇది మన కన్నులకు ఆశ్చర్యము అనుమాట మీరు లేఖనములలో ఎన్నడు చదువలేదా? కాబట్టి దేవుని రాజ్యము మీయొద్దనుండి తొలగింపబడి దానిఫలమిచ్చు జనులకియ్య బడునని మీతో చెప్పుచున్నాను. మరియు ఈ రాతిమీద పడువాడు తునకలైపోవును గాని అది ఎవనిమీద పడునో వానిని నలి చేయుననెను" (మత్తయి 21:42-44).

"ప్రభువగు యెహోవా ఈలాగున సెలవిచ్చుచున్నాడు-సీయోనులో పునాదిగా రాతిని వేసినవాడను నేనే. అది పరిశోధింపబడిన రాయి, మూలకు తలరాయియై యున్నది. విశ్వసించువాడు కలవరపడడు" (యెషయా 28:16).

"మరియు చేతిసహాయములేక తీయబడిన ఒక రాయి యినుమును

మట్టియు కలిసిన ఆప్రతిమ యొక్క పాదముల మీదపడి దానిపాదములను తుత్తునియలుగా విరుగగొట్టినట్లు తమకు కనబడెను"(దానియేలు2:34-35)

"మనుష్యుల చేత విసర్జింపబడినను, దేవుని దృష్టికి ఏర్పరచ బడినదియు అమూల్యమును సజీవమైన రాయియగు ప్రభువునొద్దకు వచ్చిన వారై యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలులు అర్పించుటకు పరిశుద్ధయాజకులుగా నుండునట్లు మీరును సజీవమైన రాళ్ల వలె నుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టు బడుచున్నారు. ఏలయనగా ఇదిగో నేను ముఖ్యమును ఏర్పరచబడినదియు అమూల్యమునగు మూలరాతిని సీయోనులో స్థాపించు చున్నాను; ఆయన యందు విశ్వాసముంచువాడు ఏమాత్రమును సిగ్గుపడడు అనుమాట లేఖనములయందు వ్రాయబడి యున్నది. విశ్వసించు చున్న మీకు, ఆయన అమూల్యమైన వాడు; విశ్వసింపని వానికైతే-ఇల్లు కట్టువారు ఏ రాతిని నిషేధించిరో అదే మూలకు తలరాయి ఆయెను. మరియు అడ్డురాయియు, అడ్డు బండయు ఆయెను". కట్టువారు వాక్యమునక విధేయులై తొట్రిల్లు చున్నారు. దానికే వారు నియమింపబడిరి" (Iపేతురు 2:48). I కొరింథి 1:23; 10:4 కూడ చూడుము.

పైన చెప్పబడిన రాయి, బండ యేసుక్రీస్తే. మూలరాయి రెండు గోడలను కలుపును, బలపరచును. ప్రవచనము ద్వారా యేసు క్రీస్తు పాత కొత్త నిబంధనలను జతపరచుచున్నారు, యూదులను అన్యులను ఏకము చేయుచున్నారు.

**ముగింపు:**

ప్రజలకు బోధించు అధికారము యేసుకలిగి యుండెనా? నిశ్చయముగా కలిగియుండెను. అది యదార్థమని మంచి మనస్సుగల వారంగీకరిస్తారు. ఆయనకు ఇప్పటికీ ఆయధికారమున్నది. నీవు నేను కూడ అంత్యదినమందు ఆయన చెప్పిన మాట చొప్పున తీర్పు తీర్చబడుదుము.

# 12. పదిమంది కన్యకలను గూర్చిన ఉపమానము

## (The Parable of the Ten Virgins)

మత్తయి 25:1-3

### పరిచయము:

యేసు ప్రభువు అపొస్తులలకు పదిమంది కన్యకలను గూర్చిన ఉపమానము చెప్పెను (మత్తయి 24:3). ఎంతో ఘనముగా అగుపడుచున్న యెరూషలేము దేవాలయము నాశనమగునని యేసు చెప్పగా అపొస్తలులు ఆయననడిగిన ప్రశ్నలకు జవాబుగా ఈ ఉపమానము చెప్పబడెను (మత్తయి 24:2).

అపొస్తలులు నిజానికి యేసును మూడు ప్రశ్నలడిగిరి. అవి తెలిసికొనడానికి అడిగిన తేలిక ప్రశ్నలని అపొస్తలులు తలంచారు (మత్త 24:3). గాని వారడిగిన రెండు ప్రశ్నలకు ప్రభువు తగురీతిగా సూటిగా జవాబిచ్చారు. అవి: 1) యెరూషలేము ఎప్పుడు నాశనమగును? (మత్తయి 24:4-35). 2) ఆయన రెండవ రాకడ ఎప్పుడు సంభవించును? (24:36-41). మెస్సీయ తిరిగి వచ్చినప్పుడు ఈ లోక నాశనముతోబాటు యెరూషలేము నాశనమై పోవునని అపొస్తలులు ఎన్నడు ఊహించలేదు.

యేసువారిని విడిచి తిరిగివెళ్లిపోతారని వారెన్నడు గ్రహించలేక పోయారు. ఆయన ఎట్లు వెళ్తారు? దేనిగుండా ఆగమనమవుతారు? తదుపరి క్రైస్తవులైన వారివలె అపొస్తలులు కూడ ఆయన రెండవరాకడను గూర్చి గజిబిజి అయ్యారు. ఆదిమ క్రైస్తవులు క్రీస్తు రెండవసారి త్వరలో వస్తారని కాంక్షించారు, ఊహించారు (తీతు 2:13; I థెస్స 4:13-18; 2 థెస్స

2:1–3). అబద్ధ క్రీస్తులను గూర్చి, రెండవ రాకడను గూర్చి మోసపోవద్దని యేసు అపొస్తలులను హెచ్చరించారు (మత్తయి 24:4–5; 23–26).

అపొస్తలుల ప్రశ్నలకు జవాబిచ్చిన వెంటనే ఆయన అయిదు ఉపమానముల ద్వారా తన బోధను బలపర్చారు. 1). ఇంటి యజమాని-దొంగను గూర్చి (మత్త 24:42–44) 2) నమ్మకమైన గృహనిర్వాహకుడు, దుష్టుడైన దాసుడు. 3) పదిమంది కన్యకలు (మత్త 25:1–13). 4) తలాంతులనుగూపర్చి (25:41–30). 5) గొప్ప అంత్యతీర్పు (మత్త 25:31–46). గనుక మత్తయి 24, 25 అధ్యాయములు ఒకే సందర్భములో యేసు చేసిన బోధల రికార్డు. ఎవ్విధమైన సూచన లేకుండా సంభవించు లోకాంతమును గూర్చి సిద్ధపడి యుండవలెనని, దానితో నిత్యత్వము ఆరంభమగునని యేసు తన శిష్యులను హెచ్చరించారు.

గ్రేడ్‌మిల్లర్ అనుసహోదరుడు ఈ ఉపమానము యొక్క సందర్భాన్ని గూర్చి ఇట్లు వ్రాసారు. యేసు ప్రభువు సిలువమీద మరణించక ముందున్న వారములో ఈ ఉపమానము చెప్పబడెను. మత్తయి 21లో ఆయన యెరూషలేములో ఊరేగింపుగా ప్రవేశించుటను గూర్చి మత్తయి లిఖించాడు. తరువాత దినాల్లో ఆయన రూకలు మార్చు వారని దేవాలయమునుండి త్రోలివేయుట చూస్తాము (మత్త 21:12–13), ఆయన విరోధులలో తర్కించారు (22:15–23, 39). బోధించుటకు ఆయనకున్న అధికారమును సమర్థించుకొన్నారు (21:23–27), ప్రజలకు ఉపమానరీతిగా బోధించారు (21:28–41; 22:1–14).

ప్రభువు తన జీవితకాలంలో ఆఖరిగ మంగళవారమునాడు దేవాలయమునుండి బయలుదేరారు (24:1). ఆయన తన శిష్యులు కూడ కడవరిసారి ఆ దేవాలయమును సందర్శించగా యేసు "మీరు ఇవన్నియు చూచుచున్నారు గదా; రాతిమీద రాయి యొకటి యైనను ఇక్కడ నిలిచియుండకుండా పడద్రోయబడునని వారితో చెప్పెను" (24:2). అటు

తరువాత ప్రభువును, ఆయన శిష్యులును ఒలీవకొండకు వెళ్లి అక్కడ కూర్చొనిరి. అక్కడనుండి వారు యెరూషలేము పట్టణ వైశాల్యమును, గంభీరమైన దేవాలయమును చూచుచుండిరి. ఆయన శిష్యులగు పేతురు, యాకోబు, యోహాను, అంద్రెయ అనువారు ఆయన యొద్దకు ఏకాంతముగా వచ్చి, "ఇవి ఎప్పుడు జరుగును? నీ రాకడకును ఈ యుగ సమాప్తికిని సూచనలేవి? మాతో చెప్పుమనిరి" (24:3).

## ఉపమానము:

"పరలోక రాజ్యము తమ దివిటీలు పట్టుకొని పెండ్లికుమారుని ఎదుర్కొనుటకు బయలదేరిన పదిమంది కన్యకలను పోలియున్నది. వీరిలో అయిదుగురు బుద్ధిలేనివారు, అయిదుగురు బుద్ధిగలవారు. బుద్ధిలేనివారు తమ దివిటీలతో కూడ సిద్దెలలో నూనె తీసికొని పోయిరి. పెండ్లి కుమారుడు ఆలస్యము చేయగా వారందరు కునికి నిద్రించుచుండిరి. అర్ధరాత్రివేళ-ఇదిగో పెండ్లికుమారుడు, అతనిని ఎదుర్కొనరండి అనుకేక వినబడెను. అప్పుడు ఆకన్యకలందరు లేచి తమ దివిటీలను చక్కపరచిరి గాని బుద్ధి లేని ఆ కన్యకలు-మాదివిటీలు ఆరిపోవుచున్నవి గనుక మీ నూనెలో కొంచెము మాకియ్యుడని బుద్ధిగలవారినడిగిరి. అందుకు బుద్ధిగల కన్యకలు-మాకును మీకును ఇదిచాలదేమో, మీరు అమ్మువారి యొద్దకు పోయి కొనుక్కొనుడని చెప్పిరి. వారు కొనబోవుచుండగా పెండ్లికుమారుడు వచ్చెను, అప్పుడు సిద్ధపడి యున్నవారు అతనితో కూడ పెండ్లివిందుకు లోపలకి పోయిరి; అంతట తలుపువేయబడెను. ఆతరువాత తక్కిన కన్యకలు వచ్చి-అయ్యా, అయ్యా మాకు తలుపు తీయుమని అడుగగా అతడు-మిమ్మును ఎరుగనని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. ఆ దినమైనను గడియయైనను మీకు తెలియదు గనుక మెలకువగా ఉండుడి" (మత్తయి 25:1-13).

పదిమంది కన్యకలు ఉపమానము యూదులందరు ఆచరించు సామాన్యమైన ఆహ్లాదకరమైన వివాహవిందుసమయాన్ని వివరించు చున్నది.

అనుదిన సంఘటనలనే ఉపమానములుగా వినియోగించి గొప్ప ఆత్మీయ పాఠములు నేర్పుటలో యేసుకు సాటియైన వారెవరు లేరు. అట్లు ఆయన బోధించిన ఆత్మీయ సంగతులు జనసమూహముల హృదయములో చెరగని ముద్రవేసెను. పెండ్లి విందులకు ఒక అతిథిగానో, హెచ్చరిక చేయువానిగానో వెళ్లుట యేసుకు క్రొత్తయేమీకాదు (యోహాను 2; మత్త 9:15; 22:1-14; యోహాను 3:29).

కాబోయే వధూవరులు ఇంకా చిన్నగా యున్నప్పుడే యూదులలో పెండ్లి సహజంగా నిశ్చయించబడేది. యిది జరిగిన కొన్నాళ్లకు ప్రదాన కార్యక్రమము జరిగేది. పెండ్లి జరుగక కొన్ని నెలల ముందు ప్రదానము జరిగేది. ప్రదాన కార్యక్రమములో పెండ్లి కుమారుడు పెండ్లికుమార్తె తలిదండ్రులకు కట్నము యిచ్చేవాడు. ప్రదాన కార్యక్రమముజరిగిన తరువాత, వారింకా సహజీవనము చేయకుండినను, వారి వివాహము రద్దుచేయబడాలంటే విడాకులు అవుసరము. ఈ ఒడంబడికలో అపవిత్ర పరచబడిన భాగస్వామికి మరణ శిక్షవిధించ బడేది (ద్వితీ 22:23; మత్తయి 1:19).

సంప్రదాయ ప్రకారము పెండ్లి రోజున పెండ్లి కుమారుడు తన వధువును తన తండ్రి యింటినుండి తన యింటికి తోడుకొని వెళ్లేవాడు. మార్గములో పెండ్లికుమారుని యొక్కయు, పెండ్లికుమార్తె యొక్కయు మిత్రులు వారితో చేరేవారు. మిగతావారు విందు జరుగు పెండ్లికుమారుని గృహము దగ్గర వేచి యుండేవారు. ఆ విందులో సంతోష సంబరములో పవిత్రమైన కన్యకలు కూడ పాల్గొనుట కద్దు. నేటి మన సమాజములో పెండ్లి కుమార్తెతో కూడ అట్టి కొందరు వెళ్లుచు యుంటారు.

ఇట్టి పదిమంది కన్యకలు వివాహ పరివారముకొరకు కనిపెట్టుచు యుండిరి. పెండ్లికుమారుడు వచ్చుసరికి చాల రాత్రి యగునని వారు తలంచిరి. అతని రాక ఆలస్యమగును గాని ఎంత ఆలస్యమగునో వారెరుగరు. అతని రాక ఆలస్యమైనను పెండ్లికుమారుని ఎదుర్కొనుటకు అయిదుగురు

కన్యకలు మాత్రము సరియైన విధముగా సిద్ధపడి యుండిరి. ఈ అయిదుగురు కన్యకలు తమ సిద్దెలలో నూనెతో సిద్ధపడివచ్చిరి. చాల ఆలస్యముకాగా, ఆ పదిమంది కన్యకలు నిద్రించుచుండగా పెండ్లికుమారుడు వచ్చెను. గానినూనె లేనందున తమ దివిటీలు ఆరిపోయిన 5గురు కన్యకలు, నూనెతో సిద్ధపడివచ్చిన అయిదుగురు బుద్ధిగల వారిని నూనె అడుగగా అది వారికి దొరకలేదు. అదనపునూనెకొరకు వారు ప్రయత్నించుచుండగా, మిగతా వారందరు పెండ్లికుమారునితో లోపలికి పోయిరి. వెంటనే తలుపు మూయబడెను. కొంత సమయానికి సిద్ధపడని వీరు కూడ వచ్చి తలుపుతట్టగా, వారికి ప్రవేశము నిరాకరించబడెను. ఈ అయిదుగురు ఇట్టి ఆలస్యమగునని గాని, వారికి ప్రవేశము నిరాకరించబడునని గాని ఎన్నడు తలంచలేదు.

ఈ ఉపమానములో పెండ్లికుమారుడు క్రీస్తు. 2 కొరింథీ 11:2లో యేసుక్రీస్తు పెండ్లికుమారుడు, సంఘము పెండ్లికుమార్తె. ఈ ఉపమానములో పెండ్లికుమార్తెను గూర్చి చెప్పబడలేదు. యేసు చేయు బోధకు ఆమె ఇక్కడ ప్రాముఖ్యము కాదు. క్రీస్తు సంఘసభ్యులు కన్యకలకు గురుతుగా యున్నారు. సంపూర్ణసంఖ్యకు గురుతుగా యూదులు 10 సంఖ్యను వాడేవారు (ఉదా I సమూయేలు 1:8లో పదిమంది కుమారులు). పెండ్లి కుమారునిరాక ఆలస్యము యేసుక్రీస్తు రెండవ రాకడలో ప్రకటించబడని ఆలస్యము. మూయబడిన ద్వారము-క్రీస్తు రాజ్యములో ప్రవేశించుటకు ఒకానొక ఘడియ లో ద్వారము ఆకస్మాత్తుగా మూయబడుట సూచించుచున్నది. ద్వారము మూయబడిన తరువాత ఏరకమైన సిద్ధపాటు అనవసరము. బుద్ధిలేని కన్యకలకు ప్రవేశముఎట్లు నిరాకరించబడెనో అట్లే అవిధేయులైన వారికి ప్రభువు ప్రవేశము నిరాకరించును (మత్తయి 7:21-23).

అన్ని కోణములనుండి ఈ పదిమంది కన్యకలు పవిత్రులే, నైతికంగా మంచివారే. అందులో అయిదుగురు సిద్ధపడియుండిరి, వారు మెలకువగా యుండి కనిపెట్టుచుండిరి. అందువలన వారు బుద్ధిగలవారనబడిరి. మిగతా

వారు బుద్ధిలేని వారనబడిరి.

ప్రభువు రాజ్యమైన సంఘములో యుంటేనే సరిపోదు. ఏ తరములో యుండినవారైనా, సిద్ధపాటులేని వారికి ఈ ఉపమానము వర్తించదు. దేవుని ప్రజలు ఎల్లవేళలా సిద్ధపాటు కలిగి యుండాలని ఈ ఉపమానము ప్రోత్సహించుచున్నది. ఈ ఉపమానము ద్వారా ఆయన రాకడ విషయమై మనకు యేమీ తెలియదు గనుక ఎల్లప్పుడు సిద్ధపడియుండాలనే మనము హెచ్చరింపబడుచున్నాము. క్రీస్తు రావడం తథ్యము. ఆయన రాకడ సమయం మాత్రం అనిశ్చయం.

## ముగింపు:

వ్యక్తిగత బాధ్యతను గూర్చి, భ్రష్టత్వ అవకాశమును గూర్చి ప్రభువు విశదీకరించారు. బుద్ధిగలవారు బుద్ధిలేనివారితో తను నూనెను పంచుకొనలేక పోయిరి. అట్లు చేస్తే అది వారికి, వీరికి కూడ సరిపడకపోవును. తదుపరి తీర్పు వ్యక్తిగత పరీక్షయని కూడ మనము గమనించాలి. తీర్పు సింహాసనము దగ్గర నశించిన వారి దరపున వాదించేవారు ఎవరు ఉండరు. అక్కడ ఎవ్విధమైన అదనపు సిద్ధపాటు కూడ అసంభవము (2 కొరింథీ 5:10; హెబ్రీ 9:27). క్రీస్తు రెండవ రాకడలో అదనపు సిద్ధపాటు కొరకు సమయం యేమీ ఉండదు.

ఇంకా యేమంటే, మత్తయి 24-25 అధ్యాయాలలో యేసు చెప్పినదానిని బట్టి ఆయన ఎప్పుడు మరల వస్తారో ఎవనికి తెలియదు గనుక, ఆయనరాకడను గూర్చిన తేదీలు నిర్ణయించు వారందరు తప్పు. నిత్యప్రాముఖ్యమైన ప్రశ్న యేమంటే, "క్రీస్తు మరల వచ్చినప్పుడు నేను సిద్ధముగా యున్నానా?" అనునదియే.

# 13.తలాంతులను గూర్చిన ఉపమానము

## (The Parable of the Talents)

మత్తయి 25:14-30)

### పరిచయము:

యేసు ఇంకా ఒలీవ కొండమీద యుండగానే, పదిమంది కన్యకలను గూర్చిన ఉపమానము చెప్పిన వెంటనే అపొస్తలులకు ఆయన తలాంతులను గూర్చిన ఉపమానము చెప్పెను. మొదటి దానిలో సిద్ధపాటును గూర్చి చెబితే ఈ రెండవదానిలో ఆయన శిష్యులు కనిపెట్టుచు కష్టపడి పనిచేయాలని హెచ్చరించారు.

### ఉపమానము:

"పరలోక రాజ్యము ఒక మనుష్యుడు దేశాంతరమునకు ప్రయాణమై తన దాసులను పిలిచి తన ఆస్తిని వారి కప్పగించినట్లుండును. అతడు ఒకనికి అయిదు తలాంతులను ఒకనికి రెండు ఒకనికి ఒకటియు ఎవని సామర్థ్యము చొప్పున వానికిచ్చి వెంటనే దేశాంతరము పోయెను. అయిదు తలాంతులు తీసికొనినవాడు వెళ్లి వాటితో వ్యాపారము చేసి, మరి అయిదు తలాంతులు సంపాదించెను. ఆలాగుననే రెండు తలాంతులు తీసికొనినవాడు మరి రెండు సంపాదించెను. అయితే ఒక తలాంతు తీసికొనిన వాడు వెళ్లి భూమి త్రవ్వి తనయజమానుని సొమ్ము దాచిపెట్టెను. బహుకాలమైన తరువాత ఆ దాసుల యజమానుడు వచ్చి వారి యొద్ద లెక్క చూచుకొనెను. అప్పుడు అయిదు తలాంతులు తీసికొనిన వాడు మరి అయిదు తలాంతులు తెచ్చి-అయ్యా నీవు నాకు అయిదు తలాంతులు అప్పగించితివే! అవియు గాక మరి అయిదు తలాంతులు సంపాదించితిననెను. అతని యజమానుడు-భళా నమ్మకమైన మంచి దాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను

అనేకమైన వాటి మీదయని మించెదను. నీ యజమాని సంతోషములో పాలుపొందుమని అతనితో చెప్పెను. ఆలాగే రెండు తలాంతులు తీసికొనిన వాడు వచ్చి, అయ్యా నీవునాకు రెండు తలాంతులు అప్పగించితివే, అవియు గాక మరి రెండు తలాంతులు సంపాదించితినని చెప్పెను. అతని యజమానుడు, భళా నమ్మకమైన మంచిదాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను అనేకమైన వాటిమీద నియమించెదను, నీయజమానుని సంతోషములో పాలుపొందుమని అతనితో చెప్పెను. తరువాత ఒక తలాంతును తీసికొనిన వాడు వచ్చి-అయ్యా నీవు విత్తని చోట కోయువాడవును, చల్లని చోట పంట కూర్చుకొనువాడవునైన కఠినుడవని నేనెరుగుదును. గనుక నేనుభయపడి, వెళ్లి నీ తలాంతు భూమిలో దాచిపెట్టితిని. ఇదిగో నీది నీవు తీసికొనుమనిచెప్పెను. అందుకు అతని యజమానుడు వానిని చూచి సోమరివైన చెడ్డదాసుడా, నేను విత్తనిచోట కోయువాడను, చల్లనిచోట పంటకూర్చుకొనువాడనని నీవు ఎరుగుదువా? అట్లయితే నీవు నా సొమ్ము సాహుకారుల యొద్ద ఉంచవలసి యుండెను. నేనువచ్చి వడ్డీతో కూడ నాసొమ్ము తీసికొని యుందునే అని చెప్పి ఆ తలాంతును వాని యొద్దనుండి తీసివేసి, పది తలాంతులుగల వానికియ్యుడి. కలిగిన ప్రతివానికి ఇయ్యబడును అతనికి సమృద్ధి కలుగును. లేనివానియొద్దనుండి వానికి కలిగినదియు తీసివేయబడును. మరియు పనికిమాలిన ఆదాసుని వెలుపటి చీకటిలోనికి త్రోసి వేయుడి; అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండుననెను" (మత్తయి 25:14-30).

ఈ ఉపమానములో ఒక యజమానుడు దేశాంతరమునకు వెళ్లకముందు తన ఆస్తిని ముగ్గురు దాసులకు అప్పగించుట మనము చూడగలము. ఏవిధమైన పర్యవేక్షణ లేకపోయినను ఇద్దరు దాసులు బాగుగా పనిచేసిరి. మూడవ వాడైతే గృహనిర్వాహకునిగా సరిగా పనిచేయలేదు, నమ్మకముగా లేదు (I కొరింథీ 4:2). తన చేతికి అప్పగించిన ఆస్తిని అతడు పాడుచేయలేదు, తన యజమాని ఆస్తిని కాజేయలేదు కూడ. అయినను అతడు నమ్మకముగా

పనిచేయలేదు. తలాంతులను గూర్చిన ఈ ఉపమానము ముఖ్యముగా ఈ మూడవ వానిపై కేంద్రీకృతమైయున్నది.

గ్రీగు భాషలో దాసులు అనగా దాసత్వము చేయువారు బానిసలు అనుభావమున్నది. కొన్ని సందర్భాల్లో బానిసలు తమ యజమానుని స్థిరాస్థిపై పర్యవేక్షకులుగా యుండేవారు (ఉదా. ఆదికా. 39:4లో యోసేపు). ఈ ఉపమానములో యజమానుడు దాసులకు తన ఆస్థిని అప్పగించాడు. అవి తలాంతులు. ఇక్కడ చెప్పబడిన తలాంతు తూనికలో ఒక పరిమాణము. అది ఆయాప్రదేశాలలో వేర్వేరుగా భావించబడేది. మన ప్రభువు కాలములో ఒక తలాంతు బరువుగల వెండి ఇంచుమించు 50,000 రూ॥లు వుండేదని కొందరు వ్యాఖ్యాన కర్తలు భావిస్తారు. ఇయ్యబడిన తలాంతులు వెండిగాని, బంగారముగాని కావచ్చును.

యజమానుడు తన దాసులకున్న సామర్థ్యము చొప్పున వారికి తలాంతుల నిచ్చెను. మరియు వారినుండి ప్రతిఫలమును, లాభమును అపేక్షించును. ఒకనికి అయిదు, మరొకనికి రెండు, ఇంకొకరికి ఒక తలాంతును యిచ్చెను. అయిదు, రెండు తలాంతులు పొందినవారు వాటిని రెట్టింపుచేసి యజమానికి లెక్క అప్పగించిరి. అయితే ఒక్క తలాంతు పొందినవాడు దానిని భూమిలో దాచిపెట్టియుంచెను. అతడు సోమరియైన చెడ్డదాసుడని పిలువబడెను.

తలాంతులు యిచ్చిన యజమానుడు దేశాంతరమునుండి తిరిగి వచ్చి తన దాసుల దగ్గర లెక్క చూచుకొనెను. మొదటి ఇద్దరు దాసులను గూర్చి అతడు మిక్కిలి సంతోషించెను. వారికి పదవోన్నతి కల్పించెను. సోమరియైన చెడ్డదాసుడని గూర్చి మిక్కిలి ఆగ్రహించెను.

సోమరియైన దాసుడు తన అసామర్థ్యతను కప్పిపుచ్చుకొనుటకు ప్రయత్నించి యజమానుడు అవినీతిపరుడని చెప్పజూచెను. అట్టి విమర్శలను బట్టి యజమానుడు కృంగిపోలేదు. లక్ష్యమును కోల్పోలేదు. నిజానికి ఈ

దాసుడు తన యజమానుని స్థితిని అంచనా వేసే స్థాయిలో ఏమాత్రమును లేదు.. తన అసామర్థ్యతను యజమానిపై రుద్దుటకు ప్రయత్నించినా, అది ఫలించలేదు. యజమానుడు తన్ను తాను సమర్థించుకొనుటకు ప్రయత్నించలేదు. సరిగదా ఆదాసుని అతడు "సోమరివైన చెడ్డదాసుడా" అని సంబోధించాడు. దాసుడు చెప్పే పనికి మాలిన సాకులను తిరస్కరించి "నీవు నా సొమ్ము సాహుకారుల యొద్ద ఉంచవలసి యుండెను; నేను వచ్చి వడ్డీతో కూడ నా సొమ్మును తీసికొని యుందునే" అని అతని హెచ్చరించెను. అతని కియ్యబడిన ఆ ఒక్క తలాంతు అతని యొద్ద నుండి తీసివేయబడి వేరొకనికి ఇయ్యబడెను. పనికిమాలిన ఆ చెడ్డ దాసునికి శిక్ష విధించబడెను.

(చెడ్డదాసుని యొక్క ఆక్షేపణలను యజమానుడు నిరాకరించుటకు ప్రయత్నించలేదు! అవి వాస్తవమే! ఆ యజమానుడు మితంగా ఖర్చుపెట్టేవాడు, దుబారా చేయువాడుకాడు ఏలయనగా అతడు విత్తని చోట కోయువాడు, చల్లని చోట పంట కూర్చుకొనువాడు! అతడు విత్తుచుండగా గట్టుమీదను, పొలములో మూలలోను పడిన విత్తనముల పంటనుకూడా అతడు కోసేవాడు).

దేశాంతరమునకు ప్రయాణమైన యజమానుడు యేసుక్రీస్తు. దాసులు మొదట అపొస్తలులు, తదుపరి విశ్వవ్యాప్తంగా యున్న క్రీస్తు సంఘ సభ్యులు. ఆస్థి, తలాంతులు అందరి యెడల యున్న క్రైస్తవుని బాధ్యతలు. యజమానుడు బహుకాలము తరువాత తిరిగి వచ్చుట యేసుక్రీస్తు ఆరోహణమై నప్పటినుండి ఆయన మరల తిరిగి వచ్చేవరకు యున్న సమయం. బహుకాలము తరువాత యజమానుడు లెక్కచూచుకొనుటకు తిరిగి వచ్చుట క్రీస్తుయొక్క రెండవ రాకడయై యున్నది. యజమానుడు ఒక్కొక్కని లెక్క చూచుట కడవరి తీర్పు అయ్యున్నది. పనికి మాలిన చెడ్డ దాసుడు వెలుపలికి త్రోసివేయబడినట్లు, అపనమ్మకముగాయున్న వారు నిత్య నరకములో పడ వేయబడుదురు.

ప్రతి దాసునికి యజమానుడు తలాంతుల నెట్లు యిచ్చాడో, అట్లే సంఘములో ప్రతి క్రైస్తవునికి బాధ్యతలు అప్పగింపబడి యున్నవి. తలాంతులు

పొందని దాసుడు ఎవరులేరు. బాధ్యతలు లేని క్రైస్తవులు ఎవడు వుండరు. అయితే వారి వారి సామర్థ్యతలు, తలాంతులు, తరుణములు వేర్వేరుగా యుండును. తరుణాలతో బాధ్యతలు సమానముగా యుండును.

సామర్థ్యము కొలది తలాంతులు యిచ్చి, వారి సామర్థ్యము కొలది ఫలితముల నాశించుటలో, క్రైస్తవులు తమ సామర్థ్యము కొలదీ సంఘములో పనిచేయాలని ప్రభువు కోరుచున్నారు (I కొరింథీ 10:13; ఫిలిప్పీ 4:13). నీవు గొప్ప వాడవుగా యుండాలని గాక నమ్మకముగా యుండాలని ప్రభువు కోరుచున్నారు. తక్కువ సామర్థ్యము వలన అపనమ్మకముగా యుంటే మంచిది కాదు. దేవుడు ఎల్లవేళలా మననుండి శ్రేష్టమైన దానినే కోరును. పాక్షిక విధేయత, ఉదాసీనత మొ॥నవి అంత్యదినమందు ఉపేక్షించబడవు. తక్కువలో నేమి ఎక్కువలో నేమి దేవుడు నమ్మకత్వమునే నీ నుండి కోరుకొనును.

క్రీస్తుయొక్క రెండవ రాకడకు కనపెట్టుచు ప్రతిక్రైస్తవుడు ఆయన కొరకు పనిచేయవలెను. పరిచర్యలోను, లెక్క అప్పగించుటలోను క్రైస్తవునికి వున్న వ్యక్తిగత బాధ్యతను తలాంతులను గూర్చిన ఈ ఉపమానము తెలియజేయుచున్నది (2 కొరింథీ 5:10-11; ప్రసంగి 12:13-14; ప్రక 20:11-15). ఈ లోకంలో మనము చేయు పరిచర్య లేదా చేయలేకపోయిన పరిచర్య మన నిత్యగమ్య స్థానమును నిర్ణయించునని ప్రతి క్రైస్తవుడు ఎరిగియుండాలి (మత్త 25:31-46). ఈ ఉపమానములో యున్న యజమానివలె తీర్పునాడు క్రీస్తు క్రైస్తవులకు న్యాయ బద్ధముగానే తీర్పుతీర్చును. ఆనాడు నమ్మకముగా పనిచేసిన క్రైస్తవులు సంతోషించుదురు గాని సోమరులైన వారు తీర్పరిని చూచి భయపడుదురు.

## ముగింపు:

శక్తి సామర్థ్యములలో, తరుణములలో తమ్మును తాము తక్కువగా అంచనా వేసుకొను క్రైస్తవులు క్రైస్తవ పరిచర్యలో వెనుకాడకూడదు. అట్టివారు తమ కియ్యబడిన తలాంతులను, శక్తి సామర్థ్యాలను క్రైస్తవ పరిచర్యకొరకు వినియోగించాలి. సాకులు చెప్పుట మాని క్రైస్తవ బాధ్యతలను సంతోషముతో స్వీకరించాలి.

నిస్సందేహంగా మనందరం మన తరుణాలను కొంత వ్యర్థపరచి యుందుము. ఒక్కొక్కనికి గొప్ప ద్వారము (తరుణము) తెరువబడునట్లు మనం ప్రార్థించాలి (I కొరింథీ 16:9). అట్టి తరుణం లభించినప్పుడు దానిని సద్వినియోగం చేసుకోవాలి (అపొ.కా. 4:29). అపొ.పౌలు చెరసాలలో యున్నా, బంధకములలోయున్నా, న్యాయ విమర్శలో నిలబడినా, అన్ని సందర్భములను క్రీస్తును చాటే తరుణములుగా మార్చుకున్నాడు. ప్రతి క్రైస్తవుడు ఈలోకాన్ని తరుణము, బాధ్యత అనుకంటి అద్దాలతో చూడాలి. అట్లు చూడకపోతే క్రైస్తవులమయినను పరలోకమును చూడలేము.

# 14. కనికరము లేని దాసుడు

## (The unmerciful Servant)

మత్తయి 18:21-35

### పరిచయము:

కనికరము లేని దాసుని గూర్చిన ఉపమానమునకు అవతారికలో దిగువ సంగతులున్నవి. 1) పరలోక రాజ్యములో ముఖ్యస్థానమును గూర్చి అపొస్తలులు పోటీపడుట మత్త 18:1). 2) వినయమును, తగ్గించుకొనుటను నేర్పుటకు ప్రభువు చిన్న బిడ్డను ఉదహరించుట (మత్త 18:2-5). 3) అభ్యంతర పరచకూడదను ప్రభువుబోధ (మత్త 18:6-14) 4) దేవుని బిడ్డల మధ్య కలుగు సమస్యల పరిష్కార విధానము (మత్త 18:15-17), అపొస్తలుల మధ్య ఐక్యత యొక్క ప్రాముఖ్యత (మత్త 18:18-20) మరియు 6) క్షమాపణను గూర్చి పేతురు ప్రశ్నించుట.

కపెర్నహూముకు వెళ్లుచు శిష్యులు వారిలో ఎవడు గొప్పవాడని వాదించుకొనుచుండిరి యని మార్కు వ్రాసాడు (మార్కు 9:33-37). ఈ సంఘటన జరిగెనని లూకా కూడ ధృవీకరించుచున్నాడు (లూకా 9:46-48). తదుపరి మరియొక సందర్భములో యాకోబు, యోహానులు తమ తల్లితో కూడ వచ్చి అపొస్తలులలో వారిని ముఖ్యులుగా గుర్తించవలెనని యేసును అభ్యర్థించిరి. తమ్మును తామే హెచ్చించుకొనవలెనని వారు చేసిన ప్రయత్నమును బట్టి యాకోబు, యోహానుల మీద మిగతా అపొస్తలులు పోటీ తత్వమును పెంచుకొని యుండిరి.

ఇట్టి పోటీ తత్వమును వలన భేదములు, అసూయలు ప్రతిఫలించెను. వారికి రెండు పాఠములు బోధించుట ద్వారా యేసు ఈ దురభిమాన ద్వేషమును నిర్మూలించెను. 1) పనికిమాలిన అసూయకు విరుగుడుగా

వినయము 2) ఒండొరుల మధ్య స్నేహభావము, సహవాసము పునరుద్ధరింపబడుటకు మారుమనస్సు, క్షమాపణలు అవుసరము. అది దేవునితో వారి సహవాసమును కూడ పునరుద్ధరించును.

ఈ సంఘటన జరిగిన పిదప సంభవించిన చీలికలు సమసిపోవాలంటే, వాటిని సంతృప్తి కరముగా పరిష్కరించాలి. అపొస్తలుల శిక్షణకు అది ముఖ్యము. అపొస్తలులు యేసు యొక్క గొప్ప ఆజ్ఞను అమలుపరచునట్లును, బాల్యదశలో నున్న సంఘమును సరిగ వారు నడిపించగల్లునట్లును ఆయన వారిని సిద్ధపరచెను. ఇప్పుడు వారు విఫలులైతే ప్రవచనాత్మకముగా చెప్పబడిన దేవుని రాజ్యము ఆటంకపరచబడును. అదే రీతిగా సంఘములో అదుపులేని అసూయలు, మత్తతలు, భేదములు దాని అభివృద్ధిని ఆటంకపరచును. సజీవ ఉదాహరణగా యేసు ఒక బిడ్డను వారికి చూపించెను (మార్కు 9:36).

"ఆయన యొక చిన్నబిడ్డను తన యొద్దకు పిలిచి, వారి మధ్యకు నిలబెట్టి యిట్లనెను. మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనేగాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. కాగా ఈ బిడ్డవలె తన్ను తాను తగ్గించుకొను వాడెవడో వాడే పరలోక రాజ్యములో గొప్పవాడు" (మత్తయి 18:2-4).

అభ్యంతకరమైన తప్పిదములు జరుగకుండా ప్రయత్నించినా అవి జరుగునని యేసు తదుపరి బోధించారు (మత్త18:6-14). ఈ తప్పిదములు బహిరంగముగా గాక, లోలోపల పరిష్కరించు కొనుట శ్రేష్టమని యేసు బోధించారు. "మరియు నీ సహోదరుడు నీయెడల తప్పిదము చేసిన యెడల నీవుపోయి నీవును అతడును ఒంటరిగా నున్నపుడు అతని గద్దించుము. అతడు నీ మాట వినిన యెడల నీ సహోదరుని సంపాదించుకొంటివి" (మత్త 18:15). ఈ తప్పిదములు ప్రైవేటుగా పరిష్కరింపబడకపోయిన యెడల, దానిని గూర్చి సాధ్యమైనంత తక్కువ మందికి తెలియ జేయవలెను. "అతడు వినని యెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల నోట ప్రతిమాట స్థిరపరచబడునట్లు నీవు ఒకరిద్దరిని వెంట బెట్టుకొని పొమ్ము" (మత్తయి

18:16). సహోదరుల మధ్య వివాదము సద్దుమణగకపోతే వారిమధ్య సహవాసమును పునరుద్ధరించుట కొరకు స్థానిక సంఘము కల్పించుకొనవలెను. "అతడు వారిమాటయు వినని యెడల అతనిని నీకు అన్యునిగాను సుంకరిగాను ఎంచుకొనుము" (మత్త 18:17).

వారిమధ్య నెలకొల్పబడిన అసంతృప్తివలన అపొస్తలులను ఏపనికొరకై శిక్షణనిచ్చుచున్నారో, అది ప్రమాదములో పడే అవకాశమున్నది. అపొస్తలుల అధికారమును సూచించుటకు మనం సాధారణంగా మత్తయి 18:18-20ని వినియోగిస్తాము. అపొస్తలుల మధ్య విభేధములు వారి పనికి ఆటంకములు. వారి అధికారముకు కూడ అది ఒక సవాలు.

నాడున్న సంప్రదాయ బద్ధముగా పేతురు కొంతమట్టుకు ఓర్చుకొనువానిగా యున్నా తనకు విరుద్ధముగా పాపము చేసినవానిని, ఎన్ని మారులైనా క్షమించాలనే సంగతిని ఊహించలేకపోయాడు. "ఆ సమయమున పేతురు ఆయన యొద్దకు వచ్చి-ప్రభువా నా సహోదరుడు నాయెడల తప్పిదము చేసిన యెడల నేనెన్ని మారులు క్షమింపవలెను? ఏడుమారుల మట్టుకా? అని అడిగెను" (మత్త 18:21). యిది చాల ఉదార స్వభావము. సహోదరులను మూడు మారుల మట్టుకే క్షమించాలని నాటి రబ్బీలు బోధించేవారు.

తన సహోదరుడు తన యెడల తప్పిదము చేయునని పేతురు తలంచాడు. క్షమాపణను కొలబద్దతో కొలవాలనుకొన్నాడు. అంటే దానికొక పరిమితి విధించాలని తలంచాడు. "ఇంతవరకే, అంతకు మించి కాదు!" అయితే ప్రభువు అతని తలంపులను పటాపంచలు చేసారు. ఏడుమారుల మట్టుకే కాదు, డెబ్బది ఏళ్లమారుల మట్టుకని నీతో చెప్పుచున్నాను!" అని యేసు పలికారు(18:22). ఎవనినైనా నీవు అన్నిసార్లు క్షమించి యుంటే, క్షమించే అలవాటు నీవు కలిగి యుందువు. అది నీకు అలవాటై పోవును. గనుక క్షమాపణలను నీవిక లెక్కించవు, దానికి పరిమితి విధించవు.

పేతురు తనకొరకు కనికరము కోరుకొన్నాడు గాని యితరుల విషయంలోనైతే కనికరములేని న్యాయమును విధించగోరాడు. నిజానికి పేతురు క్షమింపగోరాడు. గాని పొరబాటు ఏమంటే అతడు దైవిక దృక్పథంలో గాక మానవ కోణంలో తన్నుతాను కొలవేసికొన్నాడు.

పశ్చాత్తాపముతో కూడిన క్షమాపణను ఎన్నడు నిరాకరించరాదు. స హోదరులు కొన్నిసార్లు క్షమించినట్లు నటిస్తారు, గాని వారి క్రియల వలన క్షమించలేదని నిరూపిస్తారు. పశ్చాత్తాపపడినవానిని క్షమించనని చెప్పేవారు అరుదుగా కన్పిస్తారు. క్షమాపణకు ముందు పశ్చాత్తాపము కనబడాలి. మారుమనస్సు కొలది క్షమాపణ కోరిన వారిని క్రైస్తవుడు ఎల్లవేళలా క్షమించాలి.

"మీ విషయమై మీరే జాగ్రత్తగా ఉండుడి. నీ సహోదరుడు తప్పిదము చేసిన యెడల అతని గద్దించుము; అతడు మారుమనస్సు పొందిన యెడల అతని క్షమించుము. అతడు ఒక దినమున ఏడుమారులు నీ యెడల తప్పిదము చేసి ఏడుమారులు నీవైపు తిరిగి–మారుమనస్సు పొందితిననిన యెడల అతని క్షమింపవలెను" (లూకా 17:3–4). మారుమనస్సు పొందిన తోటి క్రైస్తవుని క్షమించకపోతే దేవునిలాంటి సర్వజ్ఞానము కలిగియుండాలి!

దేవుని బిడ్డయైన వాడు క్షమించుటకు ఎల్లవేళలా సిద్ధపడి యుండాలని లేఖనములు బోధించుచున్నవి. "కనికరముగలవారు ధన్యులు వారు కనికరింపబడుదురు" (మత్తయి 5:7). "మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు" (మత్తయి 6:14–15). "మీరు తీర్పుతీర్పు చొప్పుననే మిమ్మును గూర్చియు తీర్పు తీర్చబడును, మీరు కొలుచు కొంత చొప్పుననే మీకును కొలువబడును" (మత్తయి 7:2). "తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మును గూర్చి తీర్పు తీర్చబడదు; నేరము మోపకుడి, అప్పుడు మీమీద

నేరము మోపబడదు" (లూకా 6:37). "మేము మాకచ్చియున్న ప్రతివానిని క్షమించుచున్నాము గనుక మా పాపములను క్షమించుము; మమ్మును శోధన లోనికి తేకుము" (లూకా 11:4). "మీరు ఒకనియెడల ఒకడు దయగలిగి కరుణా హృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి" (ఎఫెసీ 4:32). "ఎవడైనను తనకు హాని చేసెనని యొకడనుకొనిన యెడల ఒకని నొకడు సహించుచు ఒకని నొకడు క్షమించుడి. ప్రభువు మిమ్మును క్షమించిన లాగున మీరును క్షమించుడి" (కొలస్స 3:13).

ఏడుమారులు మట్టుకు క్షమించుటకు పేతురు ఇష్టము చూపించాడు గాని, యేసు అంతకన్నా పెద్ద సంఖ్యను, 77x7 అనగా 490 సార్లు క్షమించాలని చెప్పారు (మత్త 18:22). యిది అలంకార రీతిగా చెప్పబడిన సంఖ్య, అనగా అపరిమితమైన సార్లు క్షమించుటకు మనము ఎల్లవేళలా సిద్ధపడియుండాలని ఆయన చెప్పారు.

## ఉపమానము:

"ఆసమయమున పేతురు ఆయన యొద్దకు వచ్చి-ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన యెడల నేనెన్ని మారులు అతని క్షమింపవలెను? ఏడుమారులమట్టుకా? అని అడిగెను. అందుకు యేసు అతనితో ఇట్లనెను-ఏడుమారుల మట్టుకేకాదు, డెబ్బది ఏడుమారులమట్టుకని నీతో చెప్పుచున్నాను. కావున పరలోక రాజ్యము తనదాసుల యొద్ద లెక్క చూచుకొన గోరిన యొక రాజును పోలి యున్నది. అతడు లెక్క చూచుకొన మొదలుపెట్టినప్పుడు అతనికి పదివేల తలాంతులు అచ్చియున్న ఒకడు అతని యొద్దకు తేబడెను. అప్పుతీర్చుటకు వాని యొద్ద ఏమియులేనందున వాని యజమానుడు వానిని, వాని భార్యను పిల్లలను వానికి కలిగిన యావదాస్తిని అమ్మి అప్పు తీర్చవలెనని ఆజ్ఞాపించెను. కాబట్టి ఆ దాసుడు అతనియొద్ద సాగిలపడి మ్రొక్కి నా యెడల ఓర్చుకొనుము, నీకు అంతయు చెల్లింతునని

చెప్పగా ఆ దాసుని యజమానుడు కనికరపడి వానిని విడిచిపెట్టి వాని అప్పుక్షమించెను. అయితే ఆదాసుడు బయటకువెళ్లి తనకు నూరు దేనారములు అచ్చియున్న తన తోడి దాసులలో ఒకని చూచి, వానిగొంతు పట్టుకొని–నీవు అచ్చియున్నది చెల్లింపుమనెను. అందుకు వానితోడి దాసుడు సాగిలపడి నాయెడల ఓర్చుకొనుము, నీకు చెల్లించెదనని వేడుకొనెను గాని వాడు ఒప్పుకొనక అచ్చియున్నది చెల్లించు వరకు వానిని చెరసాలలో వేయించెను. కాగా వానితోడి దాసులు జరిగినది చూచి, మిక్కిలి దుఃఖపడి వచ్చి జరిగినదంతయు తమ యజమానునికి వివరముగా తెలిపిరి. అప్పుడు వాని యజమానుడు వానిని పిలిపించి చెడ్డదాసుడా, నీవు నన్ను వేడుకొంటివిగనుక నీ అప్పంతయు క్షమించితిని; నేను నిన్ను కరుణించిన ప్రకారము నీవును నీతోడి దాసుని కరుణింపవలసియుండెను గదా అని వానితో చెప్పెను. అందుచేతవాని యజమానుడు కోపపడి తనకు అచ్చియున్న దంతయు చెల్లించువరకు బాధపరచువారికి వాని నప్పగించెను. మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయపూర్వకముగా క్షమింపని యెడల నా పరలోకపు తండ్రియు ఆప్రకారమే మీ యెడల చేయుననెను" (మత్తయి 18:21-35).

దేవుడే రాజుగా మొదటిసారి ఈ ఉపమానములో చిత్రీకరించబడెను. కనికరములేని ఆదాసుని యజమానుడు చెడ్డదాసుడా అని పిలిచెను. దేవుని కృపాబాహుళ్యతను వర్ణించు ఏకైక ఉపమానమిది. దేవుని హృదయములో కరుణ, కృప ఎంతగా యున్నవో ఈ ఉపమానము వర్ణించు చున్నది.

యిది దేవుని రాజ్యసంబంధ ఉపమానమని 23వ వచనమును బట్టి గమనించగలము. దేవుడొకరాజుగా చిత్రీకరించబడ్డారు. లెక్క చూచుకొనుట సువార్తయొక్క పిలుపు. దాసులు పాపులకు గురుతుగా యున్నారు. సువార్త పిలుపుకు మొదటి జమచేయబడినా, ఆఖరి లెక్క ఒకటి యున్నది. "గనుక మనలో ప్రతివాడును తన్నుగురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను" (రోమా 14:12). అప్పుడు కూడ క్రీస్తుయొక్క మాట చొప్పుననే లెక్క అప్పగించవలెను.

నిత్య నివాసము కేటాయించబడకముందు ఎవడును ఆపరీక్షలో ఓడిపోనవుసరములేదు. మొదటి పరీక్షలో ఎవడైనను ప్రవేశించవచ్చును. తదుపరి అవుసరమైన మార్పులు, చేర్పులు చేసికొనవచ్చును. "మీరు విశ్వాసము గలవారై యున్నారో లేదో మిమ్మును మీరే శోధించుకొని చూచుకొనుడి; మిమ్మును మీరే పరీక్షించుకొనుడి, మీరు భ్రష్టకాని యెడల యేసుక్రీస్తు మీలోనున్నాడని మిమ్మును మీరే ఎరుగుదురు గదా?" ( 2కొరింథీ 13:5).

24వ వచనములో ఒక దాసుడు తన యజమానికి విస్తారముగా అచ్చియున్నాడు. అప్పటికి ఇప్పటికి తలాంతుయొక్క విలువను సరిగా అంచనా వేయవీలుపడదు. పదివేలతలాంతులు ఇప్పుడయితే 1,50,000/ రూ॥లుండును. అంటే ఆ దాసుడు అచ్చియున్నది లెక్కలేనంతగా యుండెను.

ఆదాసుడు తీర్చలేనంత అప్పు అది. యూదుల యొక్కయు రోమియుల యొక్కయు చట్టప్రకారము అచ్చియున్న వాడు అమ్మివేయబడవచ్చును. ఉదాహరణకు దొంగిలించినవాడు దాని తిరిగి ఇయ్యలేకపోతే వాడు అమ్మబడవలెను (నిర్గమ 22:3). ఒకని అప్పు అతని కుటుంబసభ్యులకును వర్తించును. దానిని తీర్చుటకు కుటుంబ సభ్యులు కూడ అమ్మబడవచ్చును (2 రాజులు 4:1).

మన పాపముల వలన దేవునికి మనము దాని అపరాధరుసుమును చెల్లించలేని స్థితిలో యున్నాము. దాసుడు, వాని కుటుంబము అమ్మివేయబడుట దేవుని నుండి మనము పాపమువలన ఎడబాటు అవుదాము. ఆదాసుడు రాజుయెదుట సాగిలపడి అతని దయకొరకు విన్నవించుకొనెను. సరిగదా అంతగొప్ప ఋణమును తీర్చుటకు అతడు కొంత సమయము కొరకు బతిమాలుకొనెను. గొప్ప దుర్గతిలో యున్న మానవుడు అసాధ్యమైన సంగతులను వాగ్దానము చేయును.

ఈ దాసుడు తన విజ్ఞాపనలను బట్టి రాజును ఒప్పించగలిగెను.

తత్ఫలితముగా రాజు అతని ఋణమును క్షమించెను. అతడు చేసిన హృదయారవింద విజ్ఞాపనము వలన మాత్రమే అతని ఋణము క్షమించబడెను. ఋణము తీర్చబడాలని న్యాయము కోరుచున్నది. కృప అయితే ఇక్కడ ఋణమును క్షమించెను. మనందరి యెడల పరలోకపు తండ్రి ఇట్టి కృపను చూపుచున్నారు ( 2 పేతురు 3:9).

ఆదాసుడు భరింపలేని ఋణమునుండి విడుదలపొందిన తరువాత అట్టి మరొక సంఘటనను 28,29 వచనములు వర్ణించుచున్నవి. ఈసారి ఆమొదటి దాసుడు తనకు కొంతసొమ్ము అచ్చియున్న మరొక దాసుని హింసించుట మనము చూడగలము. అతడు కనికరమును కోరుకొని దానిని పొందాడు, గాని రెండవవాని దగ్గర కనికరము చూడకుండా న్యాయము అమలు పరచగోరాడు. మానవుడు తన పొరుగువానిని క్షమించుటను గూర్చి ఈ ఉపమానము బోధించుచున్నది.

ఈ ఉపమానములో వారు అచ్చియున్న సొమ్ము ఒకటి విస్తారమైనది, రెండవది స్వల్పమైనది. రెండవదాసుడు మొదటివానికి వందదేనారములు అచ్చియుండెను. దేనారము రోమావారి నాణెము. దాని విలువ 20/- రూ॥లుండును. అంటే అతడు 2000/-రూ॥లు అచ్చియుండెనన్నమాట. ఆ రెండవవాడు తన జీతములో 4వ వంతు అచ్చియుండెను. గొంతుపట్టుకొని న్యాయస్థానము దగ్గరకు ఈడ్చుకొనిపోవుట గ్రీకుల యొక్కయు, రోమియుల యొక్కయు సాంప్రదాయము. మానవులు తమ పొరుగువారి యెడల చేయు తప్పిదములు, వారుదేవునికి వ్యతిరేకముగా చేయు పాపముల యొద్ద ఎన్నతగినవి కావు. గనుక దేవుడు మనలను క్షమించిన ప్రకారము ఒకరి యెడల ఒకరు క్షమింప బద్ధులమై యున్నాము.

మొదటిదాసుడు తాను యజమానికి చేసిన విజ్ఞాపనమునే రెండవవాడు తనకు చేస్తే అతని యెడల చెవిటి వానివలె ప్రవర్తించి వానిని చెరసాలలో వేయించెను. ఆ రెండవ వాడు తన ఆస్థిని అమ్మి మొదటివాని అప్పుతీర్చునను కారణముచే చెరసాలలో వేయించబడెను. అచ్చియున్న వాడు, వాని కుటుంబ

సభ్యులు అప్పిచ్చిన వానికి బానిసలుగా యుండాలని అప్పుయిచ్చినవాడు కోరుకొనును.

జరిగిన ఈ అన్యాయమును మిగతా దాసులు గమనించుటను 31వ వచనము తెలియ జేయుచున్నది. క్షమాపణ లేని తత్వమును బట్టి ఇతరులు కోపించుదురు. గనుక కనికరములేని ఆదాసుని దుష్క్రియలు రాజుకు తెలియ జేయబడెను. అతని కృతఘ్నత వలన నిశ్చేష్టుడై రాజు ఆకనికరములేని దాసుని యెడల తన దయాళుత్వమును తారుమారు చేసెను. బాధించువారికి అతనిని అప్పగించెను. బాధించువారు నిత్యనరకము. క్షమించలేనివారిని దేవుడు శిక్షించునని ఈ ఉపమానము చెప్పుచున్నది. మొదట్లో ఈ ఉపమానము దేవుని కనికరమునకు గురుతుగా యుండెను. ఈ ఉపమానము ద్వారా దేవుని కాఠిన్యము బయలుపరచబడెను.

## ముగింపు:

ఈ ఉపమానము యొక్క నీతి 35వ వచనములో విపులీకరించబడినది. "మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయపూర్వకముగా క్షమింపని యెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీ యెడల చేయును" (మత్తయి 18:35). దేవునినుండి క్షమాపణ నొందిన ప్రజలు తమ తోటి వారి యెడల క్షమాపణను ప్రదర్శించవలెను.

అప్పన్నది ఎంత ఎక్కువైనా అది దేవుని క్షమాపణకు ఆటంకము కాదు (యెషయా 1:18; 55:7). పాపులలో ప్రధానుని సయితము దేవుడు రక్షించును (I తిమో 1:15).క్షమాపణకు అతీతముగా ఎవడును లేడు. గనుక మనం క్షమించాలని దేవుడు కోరుచున్నారు.

ఈ ఉపమానమందున్న తారతమ్యములు గమనించదగినవి. మొదటిగా, పేతురు చెప్పిన సంఖ్య, ప్రభువుచెప్పిన సంఖ్య. పలుమారులు క్షమించుటకు పేతురు సిద్ధపడ్డాడు గాని ప్రభువైతే లెక్కలేనన్ని మారులు క్షమించుమనెను. రెండవదిగా అచ్చియున్న సొమ్ము. ఒకటి బహుస్వల్పము, రెండవది తిరిగి ఇయ్యలేనంత విస్తారము!

# 15. మంచి సమరయుడు

## (The Good Samaritan)

(లూకా 10:25-37)

### పరిచయము:

లూకా ఒక్కడు మాత్రమే వ్రాసిన ఉపమానములలో మంచి సమరయుని గూర్చిన ఉపమానము ఒకటి. యేసుప్రభువు సువార్త పరిచర్య నిమిత్తమై పంపిన 70మంది తిరిగి వచ్చిన తరువాత, ప్రేక్షకులలో ఒకడడిగిన ప్రశ్నకు జవాబుగా యేసు ఈ ఉపమానము చెప్పారు. ఆయన ఏయే పట్టణములకు వెళ్లబోవుచున్నారో ఆయా ప్రదేశనములకు ముందుగా యేసు 70మంది శిష్యులను పంపించారు (లూకా 10:1). ఈ శిష్యులు రోగులను బాగుచేసి దేవుని రాజ్యము సమీపముగా యున్నదని ఆయా పట్టణస్థులకు తెలియజేయాలి (లూకా 10:9).

రాబోవు చున్న రాజ్యము ప్రవచనముల సారాంశము (యెషయా2; దానియేలు 2; యోవేలు 2; అపొ.కా. 2). యూదులు దానికొరకై ఆసక్తితో ఎదురు చూచుచుండిరి. వారు ఒక భూసంబంధ రాజ్యముకొరకు ఎదురు చూచుచుండిరి (యోహాను 6:14-15) గాని యేసు ఒక ఆత్మీయ రాజ్యము స్థాపించుటకు వచ్చెను (యోహాను 18:36,37). ఆయన పరమునకారోహణుడవుటకు ముందుగా కూడ అపొస్తలులు ఒక భూసంబంధ రాజ్యమును ఆయన స్థాపించునను కొనుచుండిరి. "కాబట్టి వారు కూడి వచ్చినపుడు-ప్రభువా ఈ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా? అని ఆయనను అడుగగా ఆయన కాలములను, సమయములను తండ్రి తన స్వాధీనమందుంచి కొనియున్నాడు, వాటిని తెలిసికొనుట మీ పనికాదు" అన ఉత్తరమిచ్చెను (అపొ.కా. 1:6-7)

ఆ డెబ్బది మంది శిష్యులు తిరిగివచ్చి "ప్రభువా, దయ్యములు కూడ నీనామమువలన మాకు లోబడుచున్నవని" చెప్పిరి (లూకా 10:17). ఆయన "దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీపేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడని యేసు వారితో చెప్పెను" (లూకా 10:20). అంతమంది ఆయన యెదుట ఉన్నను యేసు తన శిష్యులవైపు తిరిగి వారితో మాటలాడెను (లూకా 10:23). అప్పుడు ధర్మశాస్త్రోపదేశకు డొకడులేచి యేసును ఒక ప్రశ్న అడిగెను (లూకా 10:25).

నూతన రాజ్యమును గూర్చిన అపోహలు అదిస్థాపించబడిన తరువాతకూడ శిష్యుల మధ్య యుండెను. అపొ. పేతురు కూడ కొంత సంశయముతోనే యూదులు కాని వారికి సువార్తను బోధించెను (అపొ.కా. 10-11 అధ్యా). ఏది ఎలాగయినా ధర్మ శాస్త్రోపదేశకుడు అడిగిన ప్రశ్న మూలముగా యేసు మంచి సమరయుని గూర్చిన ఉపమానము చెప్పెను.

**ఉపమానము:**

"ఇదిగో ఒకప్పుడు ధర్మశాస్త్రోపదేశకుడు లేచి-బోధకుడా నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమిచేయవలెనని ఆయనను అడిగెను" (లూకా 10:25).

ఒకడు అడుగవలసిన అతిప్రాముఖ్యమైన ప్రశ్నయిది! ఈ ప్రశ్నను వేర్వేరు సందర్భాలలో వేర్వేరు వ్యక్తులు అడిగిరి. వేర్వేరు కారణాలను బట్టి అడిగిరి. పెంతెకోస్తునాడు బాప్తిస్మము పొందిన 3000మంది సువార్తనుగాని, సంఘమును గాని వెదుకుట లేదు. పేతురు చెప్పిన ప్రసంగమును విని "సహోదరులారా, మేమేమి చేతుమని?" వారడిగిరి (అపొ.కా. 2:37). తార్సువాడైన సౌలు యేసునుగూర్చిన సత్యమును వెదుకుటలేదుగాని దమస్కుమార్గమందు ఆయన ఆగుపడగానే, "ప్రభువా నేనేమి చేయవలెను?" అని అడిగెను (అపొ.కా. 9:6). వారి ప్రశ్నలకు జవాబు దొరుకగానే వారు క్రైస్తవులయ్యారు. ధనికుడైన యువకుడు. "బోధకుడా నిత్యజీవముకు

వారసుడగుటకు నేనేమి చేయవలెను?" అని అడిగెను (లూకా 18:18), గాని దుఃఖముఖుడై తిరిగి వెళ్లెను. యేసు చెప్పిన మంచి సమరయుని ఉపమానము వినిన తరువాత ఆ ధర్మశాస్త్రోపదేశకుడు కూడ తన ప్రశ్నకు లభించిన దైవిక జవాబును ప్రతిఘటించినట్లగుపడు చున్నది.

డెబ్బదిమంది శిష్యులు తమ పనిని ముగించుకొని యేసు నొద్దకురాగా, మీ పేరులు పరలోకమందు వ్రాయబడి యున్నవని సంతోషించుడి అని ఆయన చెప్పగా ఈ శాస్త్రోపదేశకుడు కొంచెము వ్యంగ్యముగానే యేసును ఆ ప్రశ్న అడిగాడు. నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెనని అడుగగా, యేమీ చేయనక్కరలేదు అని ఆయన చెప్పలేదు. పెంతెకొస్తునాడు యూదులు మేమేమి చేయాలి అని అడుగగా, యేమీ చేయనక్కరలేదని వారికి చెప్పబడలేదు. తార్సువాడైన సౌలు ప్రభువా నేనేమి చేతును? అని అడుగగా, యేమీ చేయనక్కరలేదని అతనికి చెప్పబడలేదు. ధనికుడైన యువకుడు, ఈధర్మ శాస్త్రోపదేశకుడు యూదుల యుగములో జీవించిరి. వారు చేయవలసినది ఒకటి యున్నదని వారెరుగుదురు. రక్షణ షరతులపై ఆధారపడియున్నది (హెబ్రీ 5:9), వెలుగులో నడచుటపై ఆధారపడియున్నది (I యోహాను 1:7). ఒక విధంగా మన రక్షణను మనమే కొనసాగించు కొనవలసి యున్నది (ఫిలిప్పీ 2:12). అయినను మానవ మాత్రులమైన మనము పాపమువలన దేవుని కృప, దయలపై ఆధారపడవలసియున్నది (ఎఫెసీ 2:8; తీతు 3:5). దేవుని కృప, దయలు మన విధేయత అనే షరతుపై ఆధారపడి యున్నవి.

యేసు ఆధర్మశాస్త్రోపదేశకునితో, "ధర్మశాస్త్ర మందేమి వ్రాయబడి యున్నది? నీవేమి చదువుచున్నావని అతని నడిగెను" (లూకా 10:20). అతడడిగిన ప్రశ్నకు సరియైన సమాధానము అవుసరమని నేడు మనందరం ఎరిగినదే. అతని అనుభవము వలన దానికి జవాబును అప్పటికే ఎరిగి యుండవలసిన స్థాయిలో అతడున్నాడు. అందువలన యేసు అడిగిన ప్రశ్నకు అతడు తప్పక జవాబిచ్చునట్లు ఆయన అతని ప్రశ్నించారు. అతడు యూదుల ధర్మశాస్త్ర పండితుడు. అన్ని ప్రశ్నలకు జవాబును ఎరిగి యుండవలసిన

వాడు.

అతడు తన ప్రశ్నకు తానే కరెక్టుగా జవాబిచ్చాడు. గాని దానిలో యున్న పరమసత్యమును తనకు అన్వయించుకొనలేకపోయాడు. "అతడు నీదేవుడైన ప్రభువును నీపూర్ణ హృదయముతోను, నీ పూర్ణ మనస్సుతోను నీ పూర్ణ శక్తితోను, నీ పూర్ణ వివేకముతోను ప్రేమింపవలెననియు, నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింప వలెననియు వ్రాయబడి యున్నదని చెప్పెను. అందుకాయన నీవు సరిగా ఉత్తర మిచ్చితివి; ఆలాగు చేయుము అప్పుడు జీవించెదవని అతనితో చెప్పెను. అయితే తాను నీతిమంతుడైనట్టు కనబరచకొనగోరి, అతడు-అవునుగాని నా పొరుగు వాడెవడని యేసు నడిగెను" (లూకా 10:27-29).

అన్నిటికంటె ముఖ్యముగా దేవుని ప్రేమించాలి, తదుపరి నీ పొరుగు వానిని ప్రేమించాలి. యిది మానవ కోటియొక్క విధి. యిది పాత నిబంధనలోను, క్రొత్త నిబంధనలోను కూడ వక్కాణించబడినది. "నీపూర్ణ హృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను. నేడు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీ యింట కూర్చుండు నప్పుడును త్రోవను నడుచునప్పుడును పండుకొనునప్పుడును లేచునప్పుడును వాటిని గూర్చి మాటలాడ వలెను. సూచనగా వాటిని నీ చేతికి కట్టుకొనవలెను (ద్వితీ 6:5-7).

"కీడుకు ప్రతికీడు చేయకూడదు. నీ ప్రజలమీద కోపముంచు కొనక నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెను, నేను యెహోవాను" (లేవీ 19:18).

"అందు కాయన నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెననునదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగు వాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును

ఆధారమై యున్నవి" (మత్తయి 22:37-40. దేవుని యెడలయున్న ప్రేమ యితరులను ప్రేమించుటకు దోహదపడును. "ఎవడైనను నేను దేవుని ప్రేమించు చున్నానని చెప్పి తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు. దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింప వలెను" (I యోహాను 4:20-21).

ధర్మశాస్త్రోపదేశకుడు, నా పొరుగువాడెవడు? అని ప్రశ్నించిన పిదప యేసు మంచిసమరయుని ఉపమానము చెప్పెను. యిది నిజముగా క్రైస్తవ్యానికి మూలమై యున్నది. క్రైస్తవ జీవన విధానమంతయు ఒక్క దృశ్యములోనే యేసు ఇక్కడ వివరించారు. దేవునితో నీవు కలిగి యున్న సంబంధమునుండి, నీ పొరుగు వానితో కలిగియున్న సంబంధముతో విడదీయజాలవు అనే సత్యాన్ని యేసు ఇక్కడ బోధించారు.

"అందుకు యేసు ఇట్లనెను. ఒక మనుష్యుడు యెరూషలేమునుండి యెరికో పట్టణమునకు దిగి వెళ్లుచు దొంగల చేతిలో చిక్కెను; వారు అతని బట్టలు దోచుకొని అతని కొట్టి కొరప్రాణముతో విడిచిపోయిరి. అప్పుడొక యాజకుడు ఆత్రోవను వెళ్లుట తటస్థించెను. అతడు అతనిచూచి ప్రక్కగా పోయెను. అలాగుననే లేవీయుడొకడు ఆచోటికివచ్చి చూచి ప్రక్కగా పోయెను. అయితే ఒక సమరయుడు ప్రయాణమై పోవుచు అతడు పడియున్న చోటికి వచ్చి అతనిని చూచి, అతని మీద జాలిపడి దగ్గరకు పోయి నూనెయు ద్రాక్షారసమును పోసి అతని గాయములకు కట్టి తన వాహనము మీద ఎక్కించి యొక పూట కూళ్లవాని యింటికి తీసికొనిపోయి అతని పరామర్శించెను. మరునాడతడు రెండు దేనారములు తీసి ఆ పూటకూళ్లవానికిచ్చి-ఇతని పరామర్శించుము. నీవింకేమైన ఖర్చుచేసిన యెడల నేను మరలవచ్చునప్పుడు అది నీకు తీర్చెదనని అతనితో చెప్పి పోయెను" (లూకా 10:30-35).

ఒక మనుష్యుడు అను ఈ మాటలో అతని వివరములు యేమీ లేవుగాని, అతడు యూదుడై యుండవచ్చును. అతడొక సమరయుడుగాని, అన్యుడుగాని అయ్యుండిన యెడల నాడుండిన సాంఘిక పరిస్థితులను బట్టి ఈ ఉపమానము యొక్క ప్రభావము క్షీణించియుండును. ఏలయనగా యూదులు సమరయులతోను అన్యులతోను సాంగత్యము చేసేవారు కారు. మరియు ఒక సమరయుడు తోటి సమరయునికి లేక అన్యునికి సహాయపడుటకు సహజముగా ముందుకు వచ్చును గదా. ఈ ఉపమానములో గాయపరచబడిన వాడు యూదుడే, అయితే యూదులే ముందు అతని ఆదుకొనవలసినవారు.

యెరికో యెరూషలేముకు తూర్పున 16 మైళ్లదూరములో సముద్రమునకు 800 అడుగుల దిగువ యుండెను. అందువలన నిజానికి ఒకడు యెరికోకు దిగివెళ్లవలసి వచ్చెను. బైబిలులో కొన్ని ప్రాంతములు దొంగలకు దోచుకొనువారికి ప్రసిద్ధి. యెరూషలేమునుండి యెరికోకు పోవు మార్గము కూడయిట్టిదే. ఈ మార్గములో పయనించు వారు తరుచు దొంగల బారినపడేవారు గనుక ఆమార్గము "రక్తమార్గమని" ప్రసిద్ధి గాంచినది.

యూదుల చరిత్ర కారుడగు జోసిఫస్ ఇట్లు చెప్పుచున్నాడు. యేసు ప్రభువు ఈ ఉపమానము చెప్పకముందు హేరోదు రాజు నలభై వేలమంది పనివారిని దేవాలయపు పనిలోనుండి తొలగించెను. వారిలో అనేకులు దారి దోపిడి దొంగలలా తయారయ్యిరి. యెరికోకు పోవు మార్గము తీవ్రమైన వంపులతోను, గుట్టలతోను నిండి యుండుటచే వారు దాగుకొని దోచుకొనుటకు గొప్ప అవకాశము కలిగియుండెను.

ఆదారిని పోవు యూదులు దొంగల చేతిలో చిక్కుకొని తమ భక్తి విశ్వాసములను వెళ్లడించినను, దొంగల యొద్ద అదేమీ పనిచేయలేదు. వారు కేవలము దోచుకొని సంపన్నులగుటకే ప్రయత్నించేవారు.

అతని డబ్బు, వస్త్రములు కోల్పోయి, కొట్టబడి కొరప్రాణముతో యున్నవాడు, ఏమంతంత ఘనుడుగా అగుపడడు. అత్యవసరముగా

సహాయమవుసరమయిన ఒక పొరుగు వాడతడు. సంగతియేమంటే, ఆ నిస్సహాయ స్థితిలో అతనిని మొదట కనుగొనిన వాడొక యాజకుడు.

దావీదు కాలమునుండియు యాజకులు 24 వంతులుగా విభాగింపబడిరి ((I దినవృ 24:1-19). ప్రతివంతువారు దేవాలయములో సంవత్సరమునకు రెండుసార్లు, ఒక్కోవారము చొప్పున పనిచేసేవారు. యెరూషలేము వలె యెరికోకూడ యాజకులు ఎక్కువగా నివాసముండే పట్టణము. గనుక ఈ రెండు పట్టణములమధ్య యాజకులు తరుచు ప్రయాణము చేసేవారు. ఆకాలములో యెరికోలో 12,000 మంది యాజకులు కాపురముండేవారు. అతడు బహుశ తన దేవుని దేవాలయములోనే విడిచి పెట్టేసాడు. తన తోటి యూదుడు శ్రమలో యుండగా చూస్తు వెళ్లిపోయాడే గాని అతని యెడల జాలిగొనలేదు. సమయాన్ని వెచ్చించ లేదు.

గాయపరచబడినవాడు, యాజకుడు కూడా ఒకే దిశలో యెరూషలేమునుండి యెరికోకు పయనించుచుండిరి. ఆ ప్రయాణీకుడు యజమానికంటె కొంచెము ముందుగా ఆ మార్గమున వెళ్లెను. యాజకుడు కొరప్రాణముతో యున్నవానిని చూచినను, తాను కాదుగాని తన వెనుకవచ్చు వాడెవడైన అతనికి సహాయము చేయునేమోయని అనుకొనెను. "కావున మనుష్యులు మీకు ఏమిచేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునై యున్నది" (మత్తయి 7:12). యాజకుడు దీనిని ఎరిగియుండినను, తన త్రోవను పోయెను. ఇట్టి తత్వమును గూర్చి హెచ్చరించు అనేక లేఖన భాగములను మనము చూడవచ్చును (మత్త 25:31-46; యాకోబు 2:15-17).

"మనుష్యులు మీకేలాగు చేయవలెనని మీరు కోరుదురో ఆలాగు మీరును వారికి చేయుడి" (లూకా 6:31).

"కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరియెడలను విశేషముగా విశ్వాసగృహమునకు చేరినవారి యెడలను మేలు చేయుదము"

(గలతీ 6:10).

"కాబట్టి మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును" (యాకోబు 4:17).

"ఈలోకపు జీవనోపాధి గలవాడై యుండి తన సహోదరునికి లేమి కలుగుట చూచియు అతని యెడల ఎంతమాత్రము కనికరము చూపని వాని యందు దేవుని ప్రేమ యేలాగు నిలుచును?" (I యోహాను 3:17).

కొరప్రాణముతోయున్న ఆ యాత్రికుని తదుపరి ఒక లేవీయుడు చూచెను. లేవీయుడు దేవాలయములో పరిచర్య చేయువాడు. అతడు ఆరాధనలో సహకరించువాడు, ధర్మశాస్త్రమును ఉపదేశించువాడే అయినను శ్రమలోయున్న వానికి సహాయము చేయుటకు బదులు, అతడును తప్పించుకొనిపోయెను. ఆ యాజకుడు ఈలేవీయుడు కూడ తాముచెప్పే దానిని చేయలేదు!

గాయపరచబడి కొనప్రాణముతో యున్నవానిని సమరయుడొకడు చూచెను. అతడు ఆగి అతనికి సహాయపడెను. సమరయుడంటే యేమిటి? యూదులకు అతనికియున్న తేడా యేమిటి? ఉత్తర దేశమైన ఇశ్రాయేలు దేశమును క్రీస్తుపూర్వము 722 సంవత్సరములో అష్షూరు దేశము జయించెను. దానిలోని 20వేలమంది యూదులను బహిష్కరించి, 20వేలమంది అన్యులను దానిలోనికి ప్రవేశింపజేసెను. కొంతకాలానికి అందున్న యూదులు ఈ అన్యులతో వైవాహిక సంబంధములు నెలకొల్పుకొనిరి. ఈ సంకరి జాతి సంతానమే సమరయులు. బబులోను చెరలోనుండి యూదులు తిరిగి యెరూషలేము చేరుకొనిన తరువాత దేవాలయ నిర్మాణములో పనిచేయుటకు యెరుబ్బాబెలు సమరయులకు అనుమతినియ్యలేదు. సమరయులు గెరిజీము కొండపై దేవాలయమును నిర్మించుకొనిరి (యోహాను 4:4-20). వారు పంచకాండములను మాత్రమే గౌరవించుచు యూదామతమును కొంతమట్టుకు అనుసరించిరి. మత్తయి

10:5 లూకా 9:52-53; 17:16,18; యోహాను 8:48 చూడుము.

గాయపరచబడిన వాడు యూదుడై, సహజ శత్రువైనను సమరయుడు అతనిపై జాలిగొనెను. జాతిమత విద్వేషాలను బట్టి అతడు చలించలేదుగాని నిజముగా ఆపదలోయున్న తోటి మానవునికి అతడు సహాయపడెను. ఆ సమరయుడు తన్నుతానే కొంత అసౌకర్యమునకు గురిచేసుకొనెను. బహుశ కొంత అపాయస్థితిలో కూడ అతడుండెను. ఆయూదుని గాయములకు పరిచర్య చేసి, నిస్సహాయుడైన ఆ మనుష్యునికి సహాయపడెను. అతడు చేసినదంతయు ప్రతిఫలాపేక్షలేక చేసెను. తానెరుగని మరొక మనుష్యునికి అతడు సహాయపడెను. అతడు తనగాడిదను, నూనెను వినియోగించెను.

పూర్వీకులు గాయములకు దెబ్బలకు విరుగుడుగా నూనెను వినియోగించే వారు (యెషయా1:6). ద్రాక్షారసము కూడ బాహ్య ఉపశమనము కొరకు వినియోగించేవారు.

గాయపరచబడిన వాని అత్యవసరములను చూచుటయే గాక ఆ సమరయుడు అతని భవిష్యత్ అవుసరములకు కూడ తోడ్పడెను. అతడిచ్చిన రెండు దేనారములు రెండు రోజుల జీతముతో సమానము (మత్తయి 20:2). పూట కూళ్లవాని యింటిలో అయితే దేనారములో 12వ భాగము రోజుకు ఖర్చయ్యేది. ఇంకోమాటలో ఆ సమరయుడు మూడువారాల మట్టుకు సరిపడా సహాయము చేసెను. అదీ సరిపోకపోతే ఆపూటకూళ్ల యింటివాడు ఏమైనా ఖర్చు చేస్తే దానిని కూడ యిచ్చుటకు ఆ సమరయుడు హామీయిచ్చెను.

ఈ ఉపమానము ద్వారా యేసు తనను ప్రశ్నించిన ధర్మశాస్త్రోపదేశకుడు అది తనకే వర్తించునట్లు గ్రహించగోరెను. ఉపమానముయొక్క లక్షణమే యిది. 2 సమూ 12:1-3 చూడుము.

"కాగా దొంగల చేతికి చిక్కిన వానికి ఈ ముగ్గురిలో ఎవడు పొరుగువాడాయెనని నీకుతోచు చున్నదని యేసు అడుగగా అతడు అతనిమీద

జాలిపడిన వాడే అనెను. అందుకు యేసు–నీవును వెళ్లి ఆలాగు చేయుమని అతనితో చెప్పెను" (లూకా 10:36–37).

ప్రభువుయొక్క విరోధులు ఆయనను మాటలతో పడగొట్టాలని తరుచు ప్రయత్నించే వారు గాని వారు వ్యర్థులైరి (మత్తయి 22:15–22). ప్రతి సందర్భములోను యేసువారి మాటల దాడిని త్రిప్పికొట్టెను. ఆయన దేవుని కుమారుడు (మత్త 22:46; లూకా 14:6).

## ముగింపు:

ఆ యూదా ధర్మశాస్త్రోపదేశకుడు జవాబును గ్రహించెను. గాయపరచబడిన వాని పొరుగువాడెవడు? లేవీయుడా, యాజకుడా, సమరయుడా? అని అడుగగా అతడు సరిగానే జవాబిచ్చెను. గాని ఆ జవాబులో సమరయుడు అనే మాటను మాత్రము అతడు వాడలేదు! అతనిమీద జాలిగొన్న వాడే యని అతడు జవాబిచ్చెను. ఈ ఉపమానమునుండి నేర్చుకొనదగిన అనేక పాఠములున్నాయి. అవి నేడు మనకును వర్తించును అవి:

జాతి కుల మత వివక్షత లేకుండా అవుసరములో యున్నవాడే మన పొరుగువాడు. మన యిల్లు కాదుగాని మన ప్రేమయే పొరుగువానిని కల్పించును.

నా పొరుగువాడెవడు? అనేది ప్రశ్నకాదుగాని, నేనెవరికి పొరుగువానిగా యుండగలను అనే ముఖ్యమైన పాఠమును అధర్మశాస్త్రోపదేశకుడు కనుగొనలేక పోయెను.

కార్యాచరణలో యున్న పరిచర్యయే క్రీస్తు రాజ్యములో ప్రయోజనము. క్రైస్తవ్యము అంతా ఆరాధనకు వెళ్లుట, ప్రార్థనలు చేయుటయే కాదు. కొందరు వీటిని సంవత్సరముల తరబడి చేయుచు యుండవచ్చును. గాని వారొక మృత సంఘము! క్రైస్తవ్యము ఒక జీవన విధానము.

మత సంస్కారములు యితరుల యెడల జాలిచూపు స్థానములో యుండరాదని యాజకుడు, లేవీయుడు వలన నేర్చుకొనగలము. నిజమైన దయాదాక్షిణ్యములు ఒకని ప్రవర్తనలో దృశ్యమగునని సమరయుని ద్వారా నేర్చుకోగలము. క్రైస్తవుని బాధ్యత ఈలోకం అంతా ఆవరించుకొనియున్నదని ఈ ఉపమానము మనకు తెలియజేయుచున్నది.

యూదా మతములో శత్రువుకు చెందిన జంతువును సయితము పరిరక్షించాలని చెప్పబడినది (నిర్గమ 23:4-5). ఈ ఉపమానములో యాజకుడు, లేవీయుడు జంతువుకు కాదు సరిగదా, ఆపదలో యున్నవానిని దొంగలచేతిలో చిక్కుకొని కొనప్రాణముతో యున్న మానవునికి తప్పక సహాయపడి యుండవలసినది. ఈ ముగ్గురిలో నీవెవరితో పోల్చుకుంటావు? యాజకుడా? లేవీయుడా? మంచి సమరయుడా?

# 16. బుద్ధిహీనుడైన ధనికుడు

## (The Rich Fool)

లూకా 12:13-21

### పరిచయము:

బుద్ధిహీనుడైన ధనికుని గూర్చిన ఉపమానము లూకా సువార్తలో మాత్రమే కనబడును. అయితే ఈ ఉపమానములో యున్న అంశము క్రొత్తదేమీ కాదు. అది లూకా సువార్తలో మాత్రమే గాక లేఖనాల్లో పలుచోట్ల కనబడును. మన ప్రభువైన యేసు లోభత్వమును గూర్చి ఇక్కడ బోధించెను.

"మరియు ఆయన వారితో-మీరు ఏవిధమైన లోభమునకు ఎడమియ్యక జాగ్రత్త పడుడి, ఒకని కలిమి విస్తరించుట వాని జీవముకు మూలము కాదనెను" (లూకా 12:15).

దేనినైనా దేవుడొక్కమారు పలికితే చాలు. అది మార్పులేనిదవుతాది. అయినను కొన్ని అంశములు బైబిలులో పదే పదే చెప్పబడ్డాయి. దేవుని అజ్ఞను మానవులు పాటించనందువలన దేవుడు వాటిని పదే పదే జ్ఞాపకము చేయవలసివచ్చెను. ధనము బైబిలు అంశమే. ఈ లోక సంపద విషయమై మనము శోధనలో పడుట సులువే. ధనవంతులగుటకు ఆశించనివారు అరుదు. కొందరు తమ ఆస్తియే ప్రాపకమని నమ్మి తమ ధన విస్తారతను బట్టి పొగడు కొందురు (కీర్తన 49:6). దేవుని ప్రజలుకూడ ధనాశనుండి వేరుచేయబడినవారు కాదు, లోభత్వమనే పాపమును చూచిచూడనట్లుగా యుండుట సులభమే.

మంచి సమరయుని గూర్చిన ఉపమానము అన్నింటిలో కంటే ఆచరణీయము. బుద్ధిహీనుడైన ధనికుని గూర్చిన పాఠము అత్యవసరము. క్రైస్తవులమని చెప్పుకునే వారిలో కూడ ధనాశ ఎంత ప్రబలియున్నదంటే

దానిని గుర్తించుట దుర్లభమే.

ధనాశను గూర్చి హెచ్చరించుమని అపొస్తలుడైన పౌలు తిమోతికి ఉద్బోధించాడు. అతడిట్లు చెప్పాడు: "ధనవంతులగుటకు అపేక్షించు వారు శోధనలోను, ఉరిలోను అవివేక యుక్తములును హానికరములు నైన అనేక దురాశలలో పడుదురు. అట్టి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము, కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి. దైవజనుడా, నీవైతే వీటిని విసర్జించి నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సాత్వికమును సంపాదించుకొనుటకు ప్రయాసపడుము" (I తిమో6:9-11).

"ఇహమందు ధనవంతులైనవారు గర్విష్టులు కాక, అస్థిరమైన ధనము నందు నమ్మిక యుంచక సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగ దయచేయు దేవుని యందే నమ్మిక యుంచుడని ఆజ్ఞాపించుము. వారు వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము రాబోవు కాలమునకు మంచి పునాది తమకొరకు వేసికొనుచు మేలుచేయువారును సత్క్రియలు అనుధనము కలవారును ఔదార్యము గలవారును తమ ధనములో ఇతరులకు పాలిచ్చు వారునై యుండవలెనని వారికి ఆజ్ఞాపించుము" (I తిమో6:17-19).

ఒక మనుష్యుడు తన కుటుంబపరమైన సమస్యను పరిష్కరింపుమని యేసును కోరగా, ఆయన ఈ ఉపమానము చెప్పెను. "అజన సమూహములో ఒకడు-బోధకుడుగా పిత్రార్జితములో నాకు పాలు పంచిపెట్టవలెనని నా సహోదరునితో చెప్పుమని ఆయన నడిగెను" (లూకా 12:13). అందుకాయన ఓయీ, మీమీద తీర్పరిగానైనను పంచిపెట్టువానిగానైనను నన్నెవడు నియమించెనని అతనితో చెప్పెను" (లూకా 12:14). అదొక గద్దింపుతో కూడిన జవాబు. యేసు ఈ లోక సంబంధ వ్యవహారములు పరిష్కరించుటకు

రాలేదు. అది ఆయన పనికాదు. నశించిన దానిని వెదకి రక్షించుటకు ఆయన వచ్చెను (లూకా 19:10). ఇట్టి సంబంధమైన వ్యవహారముల విషయమై యూదుల చట్టము విశదము గానే యున్నది. (ద్వితీ 21:15-17). ఇది చిరకాలమునుండి యున్న ధర్మశాస్త్రము. దానిలో తర్కించుటకవకాశమేమియు లేదు. బహుశ యేసును అభ్యర్థించిన వాడు చిన్న (సహోదరుడు) వాడై యుండవచ్చును.

అయితే అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదమును యేసు ప్రభువు గొప్ప పాఠమునుపదేశించుటకు ఒక తరుణముగా మార్చెను. అ మనుష్యుడు లేవనెత్తిన సమస్య లౌక్యమైనది. ఆ వివాదమునకు కారణమేమో ఆత్మీయమైనది. అందువలన యేసు ధనాశను గూర్చిన ఉపమానమును చెప్పెను. యేసుప్రభువు తమ హృదయములను కాదుగాని తమ సమస్యలను పరిష్కరించాలని కోరుకొనే వారనేకులు. ఈ కుటుంబములో తలెత్తిన ధన సంబంధమైన సమస్య అంతకంటే గొప్ప సమస్యయైన లోభత్వమునకు సూచికగా యున్నదని యేసు ఎరుగును. యేసుప్రభువు సమస్యల లక్షణములను గాక వాటి కారణాన్ని పరిష్కరింప బూనుకున్నారు.

"మరియు ఆయనవారితో ఈ ఉపమానము చెప్పెను. ఒక ధనవంతుని భూమి సమృద్ధిగా పండెను. అప్పుడతడు నా పంట సమకూర్చుకొనుటకు నాకు స్థలము చాలదు గనుక నేనేమి చేతునని తనలో తాను ఆలోచించుకొని, నేనీలాగు చేతును; నాకొట్లు విప్పి వాటికంటె గొప్ప వాటిని కట్టించి, అందులో నా ధాన్యమంతటిని, నా ఆస్తిని సమకూర్చుకుని నా ప్రాణముతో ప్రాణమా, అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చబడియున్నది; సుఖించుము తినుము త్రాగుము సంతోషించుమని చెప్పుకొందుననుకొనెను. అయితే దేవుడు-వెర్రివాడా, యీ రాత్రి నీప్రాణము నడుగుచున్నారు; నీవు సిద్ధపరచినవి ఎవనివగునని అతనితో చెప్పెను. దేవుని యెడల ధనవంతుడు కాక తన కొరకే సమకూర్చుకొనువాడు అలాగుననే యుండునని చెప్పెను" (లూకా 12:16-21).

యేసు ఒక వ్యవసాయకుని వినియోగించి అతనినుండి ఆత్మీయ పాఠములు ఉపదేశించెను. యేసుకాలములో యూదులు వ్యవసాయముపై ఆధారపడినవారే. ప్రజలయొక్క దైనందిన జీవిత సంఘటనలనే యేసు తన ఉపమానములలో వినియోగించెను. ఈ సందర్భములో వ్యవసాయకుని కుండకూడని లక్షణములను ఆయన ఎత్తి చూపించెను. వ్యవసాయము పాపముకాదు. ఇతడు ఫలవంతమైన వ్యవసాయకుడు. అది గౌరవప్రదమైన వృత్తి. అతడు తన వ్యవసాయరీత్యా ధనవంతుడయ్యాడు.

యిదివరలో కంటే తనకు పంట అధికముగా వచ్చెను. అతని కొట్లలో నరిపడినంత స్థలము లేకపోయెను. అందువలన కొత్త వాటిని కట్టించుదుననుకొనెను. అలాగ సమకూడిన ఆస్థివలన అతడు అనేక సంవత్సరములు కులాసాగా జీవించుదుననుకొనెను. అతడు శారీరకసుఖము కొరకు అనేక సంవత్సరముల మట్టుకు సిద్ధపరచుకొనినను, ఆత్మీయ సుఖము కొరకు ఏమంత సిద్ధపడిలేదు. అతనికి కలిగిన విస్తారమైన పంట విషయంలో దేవుని పాత్రను అతడు పూర్తిగా విస్మరించాడు. "దేవుడు చెడ్డవారిమీదను మంచివారిమీదను తన సూర్యుని ఉదయింపజేసి నీతిమంతుల మీదను అనీతిమంతులమీదను వర్షము కురిపించుచున్నాడు" (మత్త 5:45). ఈ భూమియు దాని సంపూర్ణతయు యెహోవావే యని అతడు మరిచాడు (కీర్త 50:10-12; హగ్గయి 2:8). మనమేమి యిస్తామో దానిని పొందుదుము. యేమి దాచుకొందుమో దానిని పోగొట్టుకొందుమను నది వాస్తవము. మానవుని ఆత్మకూడ దేవునిదే. మన్నయినది వెనుకటివలె మరల భూమికి చేరును, ఆత్మదాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7).

ధనవంతుడైన ఈ వ్యవసాయకుడు సమృద్ధిగా వచ్చిన అతని పంటను అపార్థము చేసికొన్నాడు. అతని అభిలాష హర్షింపదగినదే అయినను, అతని అత్యభిలాషను బట్టి అతడు మునిగిపోవలసి వచ్చెను. అత్యాభిలాష గలవాడు విస్తారమైన సంపదలో విజయవంతమైన జీవితం వున్నదని తలస్తాడు. గాని

ఒకని కలిమి విస్తరించుట అతని జీవముకు మూలము కాదని ఈ ఉపమానములో యేసు బోధించారు. మానవుని విలువ అతని సంపాదనములో లేదు.

ధనవంతుడైన వ్యవసాయకుని సంకల్ప మంతయు సింపుల్ గానే యున్నది: తినుము, త్రాగుము, సుఖించుము!

అతడు దేవుని మరిచాడు. దేవుని గూర్చి అతడు తలంచనే తలంచక గొప్పపొరబాటు చేసాడు. తన పాత కొట్లను పడగొట్టి క్రొత్తవాటిని కట్టించుకొనుటలో తప్పేమీలేదు. మంచి వ్యవసాయకుడు భవిష్యత్తును గూర్చి ఆలోచిస్తాడు. అయితే అతని సంకల్పాలన్నిటిలోను దేవునిగూర్చి ఇసుమంతయు ఆలోచించక పోయినందున అవి అతని ప్రాణాంతక మాయెను. విశ్వాసులు తమ సంకల్పాలన్నిటిలోను దేవునికి చోటీయకపోతే సహజంగా వారు పడిపోతారు.

లేఖనములోగల హెచ్చరికలు విశదముగానే యున్నవి. "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). "రేపటి దినమును గూర్చి అతిశయ పడకుము, ఏదినమున ఏది సంభవించునో అది నీకు తెలియదు" (సామె 27:1). తదుపరి మానవుని దినములు సంకుచితములు, అవి వాడిగా పరుగెత్తును (యోబు 14:1; కీర్త 90:10; యాకోబు 4:13-16; (I పేతురు 1:24; 2 కొరింథీ 4:17).

"అయితే దేవుడు, వెర్రివాడా ఈ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నారు; నీవు సిద్ధపరచినవి ఎవనివగునని అతనితో చెప్పెను" (లూకా 12:20). ఈ వ్యవసాయదారుని గూర్చి ఇతరులు అంచనా వేసేదానికి దేవుని అంచనాకు గొప్ప వ్యత్యాసమున్నది. దేవుడు నిత్యత్వాన్ని గూర్చి ఆలోచించును, మానవుడు ప్రస్తుతాన్ని గూర్చి ఆలోచించును (యెషయా 55:8-9; I కొరింథీ 1:25). ఈ లోకం అతనిని జ్ఞాని అన్నాది, దేవుడేమో వెర్రివాడన్నారు!

అతడు వెఱ్ఱివాడు ఏలయనగా తన శరీరాన్ని గూర్చి ఆలోచించాడు గాని ఆత్మను మరచిపోయాడు. ఒడు ఈలోకసంపదను బట్టి జ్ఞాని కావచ్చును గాని ఆత్మీయ విషయాల్లో వెఱ్ఱివాడవచ్చును. ఒకడు ఈలోకంలో కోటీశ్వరుడు కావచ్చునుగాని పరసంబంధముగా భిక్షాధికారి కావచ్చును. ఈ ధనవంతుడు తన కష్టార్జిత ఫలమునుభవించలేకపోయాడు, అతడు ఆ రాత్రే ప్రాణము విడిచాడు.

అతడు ఎంతవిడిచివెళ్లాడు? తన కున్నదంతా! తాను విడిచి వెళ్లవలసిన వాటికొరకు జీవితమంతా కష్టపడుచు తనతో కూడ వచ్చు విలువలను నిర్లక్ష్యము చేయడం ఎంత బుద్ధిహీనత! ఎంత వెఱ్ఱితనం!! నిత్యత్వాన్ని గూర్చి సిద్ధపడలేనందున అతడు గొప్ప పొరబాటు చేసాడు. మనలో చాలమందివలె తన మరణ దినము దగ్గరలో లేదనుకొన్నాడు. దీర్ఘాయువును గూర్చి అతనికి మనకు కూడ నిర్ధారణ యేమీలేదు. అందువలన మనం పరలోకములో ధనము కూర్చుకొనుటకు ప్రయత్నించాలి.

"దేవుని యెడల కాక తన కొరకే సమకూర్చుకొనువాడు ఆలాగుననేయుండును" (లూకా 12:21).

తన స్వార్థము కొరకు సమకూర్చే వాడు నిజానికి భిక్షగాడే, అతడు యితరులను గూర్చిగాక తన్నుగూర్చియే ఆలోచించుకొన్నాడు గనుక దేవుడతనిని వెఱ్ఱివాడన్నారు. మత్తయి 6:19-21; లూకా 12:33-34 లను లూకా 12:21తో పోల్చి చదువుము.

"భూమిమీద మీకొరకు ధనము కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును, దొంగలు కన్నము వేసి దొంగిలించెదరు. పరలోకమందు మీ కొరకు దనము కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీధనమెక్కడ ఉండునో అక్కడనే నీ హృదయముండును" (మత్తయి 6:19-21).

"మీకు కలిగిన వాటిని అమ్మి ధర్మము చేయుడి, పాతగిలని సంచులను పరలోకమందు అక్షయమైన ధనమును సంపాదించుకొనుడి; అక్కడికి దొంగరాడు, చిమ్మెట కొట్టదు, మీధనమెక్కడ ఉండునో అక్కడనే మీ హృదయముండును" (లూకా 2:33–34).

బుద్ధిహీనుడైన ధనవంతుని గూర్చి ఉపమానము చెప్పిన తరువాత దేవుడు తన సృష్టియెడల కలిగిన ఔదార్యమును గూర్చి బోధించారు (లూకా 12:22–32). ఒకడు అతిగా చింతిచుటవలన యేమీ చేయలేడు గాని పరమందున్న దేవుడు ఆకాశపక్షులను ఎట్లు పోషించునో అట్లే తన బిడ్డలను కూడ ఆదుకొనునని ఆయన బోధించారు. క్రీస్తు శిష్యులు దేవుని కృపయందు నమ్మికయుంచాలి. ఆయన రాజ్యమును మొదటవెదకాలి (2థెస్స 3:10–11; సామెత 6:6–8 మత్త 6:33).

## ముగింపు:

విచారం యేమంటే లోభత్వము ఒక మర్యాదపూర్వక పాపముగా నేడు పరిగణింపబడుచున్నది. క్రైస్తవులు కూడ చాలమంది దానికి లోనైయున్నారు. లోభత్వము పాపము మాత్రమేగాక యితర పాపములకు అది దారితీయును. ధనవంతుడైన ఈ వ్యవసాయకుని యేసు వెర్రివాడన్నారు! అతడు ప్రస్తుత సంగతులను గూర్చియు ఆత్మీయ సంగతులను గూర్చియు అవగాహన లేనివాడు.

అతడొక దేవుడు లేని బుద్ధిహీనుడు. దేవుడు లేడని బుద్ధి హీనులు తమ హృదయములో అనుకొందురని దావీదు చెప్పాడు (కీర్తన 14:1). విజయవంతమైన వ్యవసాయములో అతడు దేవుని కనుగొనలేకపోయాడు. అతడు ధాన్యము సమకూర్చుకొనుటకు కొత్తకొట్లనుగాక తనకొరకే సమాధి కట్టించుకొన్నాడు. అతడు తన ఆస్థిలో దేనిని తనకూడ తీసికొనివెళ్లలేకపోయాడు. "ఆస్థిగలవాడు తన ఆస్తిని దాచిపెట్టుకొని తనకు

నాశనము తెప్పించుకొనును" (ప్రసంగి 5:13).

బుద్ధిహీనుడైన ఈ ధనవంతుడు, మరొక ధనవంతుడు కూడ లాజరుతో పోల్చిచూస్తే, తమధనాన్ని యితరులకు ఉపయోగించ లేదు. ధనభోగమువలన వారి హృదయములో దేవుని గూర్చిన తలంపులు అణచివేయబడినవి. దేవుడు తమకిచ్చిన తలాంతులను సద్వినియోగము చేయవలెనని కోరుచున్నట్లు తలాంతులును గూర్చిన ఉపమానము తెలియజేయుచున్నది.

లూకా 12:16-21 యేమి విసర్జించబడాలో తెలియజేస్తే లూకా 16:19-31 లోభత్వము వలన యేమి సంభవించునో తెలియజేయుచున్నవి. ఈ ఇద్దరుకూడ తాము ధనవంతులైనందువలన గాక, తమ జీవితములో దేవునికి చోటీయనందున నరకమునకు పోవలసివచ్చెను. వారు దేవుని యెడల ధనవంతులు కాలేకపోయారు. కడవరి తీర్పులో మన తరుణములను, తలాంతులను దేవునికొరకు ఎట్లు వినియోగించామో దానినిబట్టి మన బహుమతి నిర్ణయించబడును (మత్త 25:31-46). ఇతడు బీదవాడైన ధనవంతుడు. లవొదికయలోని సంఘమువలె అతడు ధనసమృద్ధి సంపాదించుకొన్నాడు, దేనికి కొదువలేక యున్నాడు, గాని అతడు యాతన పడు ప్రదేశముకు పోయాడు!

# 17. నిష్ఫలమైన అంజూరపు చెట్టు

## (The Barren Fig Tree)

(లూకా 13:1-9)

### పరిచయము:

దేవుని యొక్క శిక్షకు సూచనగా ప్రజలకు కీడు జరుగుననే అపోహను పురస్కరించుకొని ఈ ఉపమానము చెప్పబడియున్నది. గలిలయలో కొందరు యూదులు బలులర్పించుచుండగా దేవాలయములో పిలాతు వారిని చంపెను. ఈ సంగతిని కొందరు యేసుకు తెలియజేసిరి. "పిలాతు గలిలయులైన కొందరి రక్తము వారి బలులతో కలిపియుండెను; అకాలమున అక్కడ నున్న కొందరు ఆసంగతి యేసుతో చెప్పిరి" (లూకా 13:1).

అట్లు మరణించిన యూదులు గలిలయలోని మిగతా ప్రజలకంటే యేమీ పాపులు కాదని యేసుచెప్పెను. మరియు సిలోయములోని గోపురము పడిచచ్చిన ఆపదునెనిమిదిమంది యెరుషలేములో కాపురమున్న వారందరి కంటె అపరాధులు కారని" యేసువారికి బోధించెను (లూకా 13:2-5). ఈ సందర్భాన్ని బట్టి యేసు వారికి మారుమనస్సును గూర్చి బోధించెను. మానవులందరు అన్నిచోట్ల మారుమనస్సుపొందవలెను (అపో.కా. 17:30-31). "మీరు మారుమనస్సుపొందని యెడల మీరందరు ఆలాగేనశింతురు" అని యేసు పై సందర్భములో బోధించెను (లూకా 13:2-5).

నా బంధువురాలు ఒకామె 40 సంవత్సరముల వయస్సులో గర్భవతియై అంగవైకల్యము గల బిడ్డకు జన్మనిచ్చెను. అట్టి బిడ్డ నిచ్చి దేవుడు తనను, తన కుటుంబాన్ని శిక్షించారని ఆమె తలంచెను. యోబుకు కలిగిన దుర్దశ అతడు రహస్యముగా చేసిన పాపఫలితమై యుండునని అతని మిత్రులు తలంచారు. అపో.పౌలును ఒక విషసర్పము చుట్టుకొని కాటు వేయగా నిశ్చయముగా అతడు నరహంతకుడు గనుక న్యాయమునుండి

తప్పించుకొనలేకపోయెనని మిలేతు వాస్తవ్యులు తలంచారు. "పౌలు మోపెడు పుల్లలేరి నిప్పుల మీద వేయగా ఒక సర్పము కారుకు బయటకు వచ్చి అతని చెయ్యిపట్టెను. ఆ ద్వీపవాసులు ఆజంతువతని చేతిని వ్రేలాడుట చూచినప్పుడు-నిశ్చయముగా ఈమనుష్యుడు నరహంతకుడు; ఇతడు సముద్రము నుండి తప్పించుకొనినను న్యాయమాతని బ్రదుక నియ్యదని తమలో తాము చెప్పుకొనిరి" (అపో.కా. 28:3-4).

యేసు యొక్క శిష్యులు కూడ ఇట్టివి దైవ ఉగ్రతకు సూచనలని తలంచేవారు. "ఆయన మార్గమున పోవుచుండగా పుట్టుగ్రుడ్డియైన యొక మనుష్యుడు కనబడెను. ఆయన శిష్యులు-బోధకుడా, వీడు గ్రుడ్డివాడై పుట్టుటకు ఎవడు పాపము చేసెను? వీడా, వీని కన్నవారా? అని ఆయననడిగిరి" (యోహాను 9:1-2).

నా బంధువురాలు పొరబడింది. యోబు యొక్క మిత్రులు కూడ పొరబడ్డారు. పౌలు విషయమై మిలేతు వాస్తవ్యులు కూడ తప్పుగా తలంచారు. పాపముకు, శరీరవైకల్యానికి సంబంధమున్నట్లు తలంచి యేసు శిష్యులు కూడ పొరబడ్డారు.

మారు మనస్సు యొక్క అవశ్యకతను గూర్చి యేసు ఈ ఉపమానము చెప్పారు. గతంలో చేసిన పాపఫలితముగా రోగము, వ్యాధి, బాధ, ఘోరమరణము మొదలైనవి కలుగునని యేసుకాలమునాటి ప్రజలు తలంచేవారు. ఇవ్విధమైన మనస్సు గలిగి కొందరు యేసు దగ్గరకు వచ్చి గలిలయలో పిలాతు చేసిన ఘోరకృత్యాన్ని గూర్చి ఆయనకు చెప్పారు. మారు మనస్సును గూర్చి చెబుతు యేసు నిష్ఫలమైన అంజూరపు చెట్టుయొక్క ఉపమానమును బోధించారు. ఈ ఉపమానము కూడా లూకా సువార్తలో మాత్రమే అగుపడును.

## ఉపమానము:

"మరియు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను-ఒక మనుష్యుని

ద్రాక్షతోటలో అంజూరపు చెట్టు ఒకటినాటబడియుండెను. అతడు దాని పండ్లు వెదకవచ్చినపడు ఏమియు దొరకలేదు. గనుక అతడు, ఇదిడో మూడేండ్లనుండి నేను ఈ అంజూరపు చెట్టున పండ్లు వెదకు చున్నాను గాని యేమియు దొరకలేదు; దీనిని నరికివేయుము, దీనివలన ఈ భూమియు ఏల వ్యర్థమై పోవలెనని ద్రాక్షతోటమాలితో చెప్పెను. అయితేవాడు అయ్యా నేను దాని చుట్టు త్రవ్వి యెరువు వేయుమట్టుకు ఈ సంవత్సరము కూడ ఉండనిమ్ము; అది ఫలించిన సరి, లేని యెడల నరికించి వేయుమని అతనితో చెప్పెను" (లూకా 13:6–9).

వ్యవసాయము, దానివలన వచ్చు పంట మొదలగు వాటిని గూర్చి తరుచు బైబిలునందు చెప్పబడినది. అదే రీతిగా ఫలింపని వృక్షములను, పంటను నరికివేయడం కూడ తరుచు చెప్పబడినది. "ఇప్పుడే గొడ్డలి చెట్ల వేరున ఉంచబడి యున్నది గనుక మంచి ఫలము ఫలింపని ప్రతిచెట్టును నరకబడి అగ్నిలో వేయబడును" (మత్తయి 3:10).

"అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి. వారు గొర్రెల చర్మములు వేసికొని మీ యొద్దకు వత్తురు కాని లోపలవారు క్రూరమైన తోడేళ్లు. వారి ఫలము వలన మీరువారిని తెలిసికొందురు. ముండ్ల పొదలలో ద్రాక్షపండ్లనైనను పల్లేరు చెట్లను అంజూరపు పండ్లనైనను కోయుదురా? ఆలాగుననే ప్రతి మంచి చెట్టు మంచి ఫలములు ఫలించును, పనికిమాలిన చెట్టు మంచి ఫలములు ఫలింపనేరదు. మంచి ఫలములు ఫలింపని ప్రతిచెట్టు నరకబడి అగ్నిలో వేయబడును. కాబట్టి మీరు వారి ఫలముల వలన వారిని తెలిసికొందురు" (మత్తయి 7:15–20).

"నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు. నాలోఫలింపని ప్రతి తీగెను ఆయన తీసిపారవేయును ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలో పనికిరాని తీగెలను తీసివేయును. నేను మీతో చెప్పిన మాటను బట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు. నాయందు నిలిచి యుండుడి, మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనే

గాని తనంతట తానే యేలాగు ఫలింపదో, ఆలాగే నాయందు నిలిచి యుంటేనేగాని మీరును ఫలింపరు. ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచి యుండునో వాడు బహుగా ఫలించును. నాకు వేరుగా యుండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగె వలె బయట పారవేయబడి యెండి పోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలోపారవేతురు, అవి కాలిపోవును" (యోహాను 15:1-6).

నిష్ఫలమైన అంజూరపు చెట్టుయొక్క ఉపమానము యూదులను గూర్చి చెప్పబడినది. వ్యక్తిగతముగాను, జాతిపరముగాను వారు నిష్ఫలులైరి. పాతనిబంధనలో కూడ ఫలవంతమైన తోట, లేక ఫలభరితముకాని చెట్లను గూర్చి ఇట్లే చెప్పబడినది (యెషయా 5:1-7). ఈ ఉపమానములో చెప్పబడిన విధముగా యెషయాలోకూడ పనికిరాని చెట్లయొక్క లేక తోటయొక్క వినాశము గూర్చి చెప్పబడినది. వారు ఫలించునట్లు ప్రత్యేక అవకాశములు కల్పించినను ఫలింపలేక పోయిరి. ఫలింపని అంజూరపు చెట్టు ఉపమానములో అదే దృశ్యము కనబడుచున్నది. ఈ రెండు లేఖన భాగములు నేరుగా యూదులకే వర్తించెను. "నన్ను వెదకని వారికినేను దొరికితిని; నన్ను విచారింపనివారికి ప్రత్యక్షమైతిని అని చెప్పుచున్నాడు. ఇశ్రాయేలు విషయమైతే-అవిధేయులై యెదురాడు ప్రజలకు నేను దినమంతానా చేతులు చాచితిని" అని చెప్పుచున్నాడు (రోమా 10:2).

ఫలింపని అంజూరపు చెట్టుయొక్క యజమాని దేవుడే. తోటమాలి యేసుక్రీస్తు. ఫలింపని అంజూరపు చెట్టు యూదులు. ఆ చెట్టు నాటబడిన తోట దేవుడు ఇశ్రాయేలుకు యిచ్చిన ప్రత్యేక ఆధిక్యతలు.

ఈ అంజూరపు చెట్టు ఒక ద్రాక్షతోటలో నాటబడినట్లు ఇశ్రాయేలు జనాంగమునకు తన ప్రత్యక్షతల ద్వారా దేవుడు ప్రత్యేకావకాశముల నిచ్చెను. పాత నిబంధనకాలమంతటిలోను సైన్యముల కధిపతియగు యెహోవా, తోట యజమాని వలె ఫలముల కొరకు వెదకుచు వచ్చుచుండెను.

తోటమాలి అడిగిన మూడు సంవత్సరముల కాలము దేవుని ఓర్పుకు, సహనమునకు సాదృశ్యము. అయితే తిరుగబాటు చేయు ఇశ్రాయేలీయుల యెడ దేవుని సహనము నిత్యము వుండునదికాదు. బబులోను బానిసత్వమునుండి యూదావారు తిరిగి వచ్చినప్పటినుండి దేవుడు వారి యెడల గొప్ప సహనము కలిగియుండెను. తత్ఫలితముగా దేవుని బిడ్డలు మారుమనస్సు పొందునట్లు అనేక తరుణములీయబడెను. దేవుని సహనము యూదుల యెడల అంతరించక పూర్వము పాతనిబంధన ప్రవక్తలు, భాప్తిస్మమిచ్చు యోహాను, యేసుక్రీస్తు, పరిశుద్ధాత్ముడు కూడ వారికి మారు మనస్సును గూర్చిన హెచ్చరికలిచ్చిరి. యూదా జనాంగము మారుమనస్సు పొందవలెనని తన హృదయాభిలాషను గూర్చి అపొ.పౌలు వ్రాసాడు (రోమా 10:1-3).

ఈ ఉపమానములో యజమానుడు నిష్ఫలముగా యున్న ఆ అంజూరపు చెట్టును నరికి వేయుమని సెలవిచ్చెను. తిరుగుబాటు చేయుటలో ఎడతెగక యున్న ఇశ్రాయేలు జనాంగము నాశనమునకు ముందు సూచనగా ఇది కనబడుచున్నది. యెరూషలేము నాశనము గావించబడుట దేవుని సహనము అంతమవుటకు పరాకాష్టగా నిలిచియున్నది.

నిష్ఫల క్రైస్తవుల వలన సంఘము మృతిజెందును (ప్రక 3:1-6). శరీర కార్యముల వలన నిష్ఫలము సంభవించును (గలతీ 5:19-21). లేదా క్రియలు లేనందున కూడ అది సంభవించును (మత్త 25:31-40; యాకోబు 4:17).

మానవులందరు మారుమనస్సు పొందునట్లు అనుగ్రహించబడిన సమయము పరిమితము. దేవుని ప్రత్యేక ఆశీర్వాదములు పొందు జననాంగముగా ఇశ్రాయేలు ఇక లేరు. వారు నిష్క్రమించి నందువలన కలిగిన ఖాళీని యూదులు కానివారు అసంఖ్యాకముగా మార్పుజెంది పూర్తిచేసారు.

రోమా 11:17-24 లో యూదులు ఒలీవచెట్టు యొక్క సహజ

కొమ్మలుగా వర్ణించబడ్డారు. ఆ కొమ్మలు నిష్ఫలమై నందున నరికివేయబడ్డాయి. అన్యజనులు ఆడిలీవచెట్టుకు అంటుకట్టబడిన వారు. చెట్టు కొట్టివేయ బడకుండా మరికొంతకాలము ఉండనియ్యవలెనని తోటమాలి అడిగినది, యూదులు మారుమనస్సు పొందునట్లు మరికొంతకాలము కొరకు చేసిన విజ్ఞాపనయై యున్నది. అయితే చెట్టుగొడ్డుదైతే తప్పక నరికి వేయబడును. ఎవడును నశింపవలెనని దేవుడు కోరుటలేదు గాని అందరు మారుమనస్సు పొందవలెనని కాంక్షించుచున్నారు.

"కొందరు ఆలస్యమని ఎంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడుకాదుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు మీయెడల దీర్ఘశాంతముగలవాడైయున్నాడు. అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కుటమైన వేంద్రముతో లయమై పోవును. భూమియు దానిమీద నున్న కృత్యములు కాలిపోవును" (II పేతురు 3:9–10).

"నా జీవముతోడు దుర్మార్గుడు మరణమునొందుటవలన నాకు సంతోషము లేదు; దుర్మార్గుడు తన దుర్మార్గతనుండి మరలి బ్రదుకుట వలన నాకు సంతోషము కలుగును. కాబట్టి ఇశ్రాయేలీయులారా, మనస్సు త్రిప్పుకొనుడి, మీరెందుకు మరణము నొందుదురు? ఇదే ప్రభువగు యెహోవా వాక్కు" (యెహెజ్కేలు 33:11).

దేవుని యొక్క తీర్పు ఆదుర్దాగా జరుగదు, గాని అది ఖచ్చితము (ప్రసంగి 8:11–13, 2 పేతురు 3:9).

"దుష్క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగకపోవుట చూచి మనుష్యులు భయము విడిచి హృదయ పూర్వకముగా దుష్క్రియలు చేయుదురు. పాపాత్ములు నూరుమారులు దుష్కార్యములు చేసి దీర్ఘాయుష్మంతులైనను దేవునియందు భయభక్తులు కలిగి ఆయన సన్నిధికి భయపడు వారు క్షేమముగా

నుందురనియు భక్తిహీనులు దేవునిసన్నిధికి భయపడరు గనుక వారికి క్షేమము కలగుదనియు వారు నీడవంటి దీర్ఘాయువును పొందక పోవుదురనియు నేనెరుగుదును" (ప్రసంగి 8:11-13).

## ముగింపు:

తన బిడ్డలు ఫలించాలని, ఫలభరితముగా యుండాలని దేవుడు కోరుచున్నారు. ఇంకో మాటలో వారు విధేయులై యుండాలని ఆయన కోరుచున్నారు. అవిధేయులైన వారి యెడల దేవుని మహోద్రేకము అంత్యదినమందు బయలు పరచబడును.

"ప్రభువైన యేసు తన ప్రభావము కనబరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు మిమ్మును శ్రమపరచువారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే'' (II థెస్స 1:7-9).

దేవుని ప్రతిదండన తప్పించుకొనవలెనంటే సమయముండగానే మారుమనస్సు నొందవలెను. మన పాపముల యెడల దేవుని సహనమును అపార్థము చేసికొంటే కలిగే పరిణామములను నిష్ఫలమైన అంజూరపు చెట్టు యొక్క ఉపమానము చెప్పుచున్నది.

దేవుడు ఈలోకమున కంతటికి యజమాని. ప్రతివాని నుండి ఫలముల నాశించే హక్కు దేవునికున్నది. షరతులను విధించే హక్కు దేవుని కున్నది. ద్రాక్షతోటయు, దానిలో నాటబడిన చెట్టును యజమానికి చెందినవి గనుక దానినుండి ఫలముల నాశించే సర్వహక్కులు యజమానివే. అదే రీతిగా నిష్ఫలమైన వాటిని నరికివేయడానికి, నాశనము చేయడానికి ఆయన సర్వహక్కులు కలిగియున్నారు.

# 18. గొప్ప విందు

## (The great Supper)

లూకా 14:15-24

### పరిచయము:

ఈ ఉపమానము లూకా సువార్తలో ప్రత్యేకమైనది. మత్తయి 22:1-14లో చెప్పబడినది దీనివలె యుండినను, అది భిన్నమైనది. రాజపెండ్లి విందు ఉపమానమును మనప్రభువు తన పరిచర్య ఆరంభదినాల్లో చెప్పారు. గొప్ప విందును గూర్చిన ఈ ఉపమానము ఆయన పరిచర్య అంతిమదినాల్లో, తన శ్రమల వారములో చెప్పబడినది. మొదటిది దేవాలయములో యున్న జనసమూహములకు చెప్పబడినది, చివరికి ఒకని యింట్లో యున్న అతిథులకు చెప్పబడినది. మొదటిదానిలో రాజుయొక్క పరిచారకులు హింసింపబడుటను చూడగలము. రెండవదానిలో వారు సాకులు వినవలసి వచ్చినది. మొదటిదానిలో ఆహ్వానింప బడినవారు నాశనము గావించబడిరి, రెండవ దానిలో ఆహ్వానింపబడినవారు మినహాయించబడిరి.

యేసు విశ్రాంతి దినమున పరిసయ్యుల అధికారులలో ఒకని యింట భోజనము చేయుటకు వెళ్లిరి. ఆ యింటికి యితరులు కూడ ఆహ్వానింపబడిరి. ఆ సందర్భముగా అక్కడ జరిగిన సంఘటనలను పురస్కరించుకొని యేసు ఈ గొప్ప విందును గూర్చిన ఉపమానము చెప్పారు. 2-6 వచనములను బట్టి యేసును ఇరుకులో పెట్టుటకు ఆవిందు ఏర్పాటు చేయబడినట్లు గ్రహించుకొన గలము. అక్కడ జలోదరరోగము గలవాడొకడుండెను. అతని చూచి యేసు సందిగ్ధములో పడి యేమి చేయునోయని గృహ యజమాని, మిగతా అతిథులు ఆసక్తితో చూచుచుండిరి. అది సబ్బాతుదినము. అయితే యేసు నేరుగా వారినొక ప్రశ్న వేసెను: "విశ్రాంతి దినమున స్వస్థపరచుట న్యాయమా? కాదా? అని ధర్మ శాస్త్రోపదేశకులను పరిసయ్యులను అడుగగా

వారూరకుండిరి. అప్పుడాయన వాని చేరదీసి స్వస్థపరచి పంపివేసి–మీలో ఎవని గాడిదయైనను, ఎద్దయినను గుంటలో పడిన యెడల విశ్రాంతి దినమున దానిని పైకి తీయడా? అని వారినడిగెను. ఈ మాటలకు వారు ఉత్తరము చెప్పలేకపోయిరి" (లూకా 14:2-6).

7వ వచనములో పిలువబడినవారు భోజన పంక్తిలో అగ్రపీఠములు ఏర్పరచుకొనుట ఆయన చూచెను. అప్పుడాయన అగ్రపీఠములను గూర్చిన ఉపమానము చెప్పెను (లూకా 14:8-11). యేసు వినయమును గూర్చి వారికి బోధించెను. తదుపరి ఆయన తన్ను పిలిచిన గృహయజమానిని సంబోధించెను. తనను తిరిగి తమ విందులకు పిలిచేవారినే అతడు ఆహ్వానించెనని ఆయన అతని విమర్శించెను (లూకా 14:12-14). దేవుడు మన కనుగ్రహించిన సంపదను బట్టి బీదలకు, అంగహీనులకు మనము సహాయపడవలెనని యేసు అతనికి బోధించెను. ఆతిథ్యము చేయుటవలన కొందరు ఎరుగకయే దేవదూతలకు ఆతిథ్యము చేసిరి (హెబ్రీ 13:2).

"మరియు ఆయన తన్ను పిలిచిన వానితో ఇట్లనెను–నీవు పగటివిందైనను, రాత్రి విందైనను చేయునప్పుడు నీ స్నేహితులనైనను నీ సహోదరులనైనను నీ బంధువులనైనను ధనవంతులగు నీ పొరుగు వారినైనను పిలువవద్దు; వారు ఒకవేళ మరల నిన్ను పిలుతురు గనుక నీకు ప్రత్యుపకారము కలుగును. అయితే నీవు విందు చేయునప్పుడు బీదలను అంగహీనులను కుండివాండ్రను గ్రుడ్డివాండ్రను పిలువుము. నీకు ప్రత్యుపకారము చేయుటకు వారికేమియు లేదు గనుక నీవు ధనవంతుడవగుదువు. నీతిమంతుల పునరుత్థానమందు నీవు ప్రత్యుపకారము పొందుదు వని చెప్పెను" (లూకా 14:12-14).

ఈ మాట వినగానే గృహయజమాని, అతని అతిథులు కూడ నిరుత్సాహపడియుందురు. ఆయన వారి మానసిక పరిస్థితిని దుయ్యబట్టెను. అయితే ఆయనతో భోజన పంక్తిలో కూర్చుండిన వారిలో ఒకడు ఈమాటలు

విని–దేవుని రాజ్యములో భోజనము చేయువాడు ధన్యుడని చెప్పెను (లూకా 14:15).

దేవుని రాజ్యమును గూర్చి యూదులలో అనేక అపోహలుండెను. దేవుని రాజ్యములో అన్యులు కూడ చేర్చబడుదురనే పాత నిబంధన ప్రవచనములను యూదులు గమనించలేకపోయిరి. (ఆదికా 12:3; యెష 2:2; 62:2; యోవేలు 2:28–3:2). అబ్రాహాముతో వారికున్న శారీరక సంబంధమును బట్టి యూదులు దేవుని రాజ్యమునకు ఆటోమేటిక్‌గా వారసులవుదురని వారు తలంచారు.

## ఉపమానము:

"ఆయన వారితో ఇట్లనెను–ఒక మనుష్యుడు గొప్ప విందు చేయించి అనేకులను పిలిచెను. విందు కాలమందు అతడు ఇప్పుడు సిద్ధమైయున్నది, రండని పిలువబడినవారితో చెప్పుటకు తన దాసుని పంపెను. అయితే వారందరు ఏక మనస్సుతో నెపములు చెప్పసాగిరి. మొదటివాడు నేనొక పొలము కొనియున్నాను. అవశ్యముగా వెళ్లి దాని చూడవలెను, నన్ను క్షమింపవలెనని నిన్ను వేడుకొను చున్నాననెను. మరియొకడు నేను అయిదు జతల యెడ్లను కొనియున్నాను. వాటిని పరీక్షింప వెళ్లుచున్నాను, నన్ను క్షమింపవలెనని వేడుకొనుచున్నాననెను. మరియొకడు నేనొక స్త్రీని వివాహము చేసికొన్నాను, అందుచేత రాలేనననెను. అప్పుడా దాసుడు తిరిగి వచ్చి యీ మాటలు తన యజమానునికి తెలియజేయగా,ఆ యింటి యజమానుడు కోపపడి–నీవు త్వరగా పట్టణపు వీధులలోనికి సందులలోనికి వెళ్లి బీదలను అంగహీనులను కుంటివారిని గ్రుడ్డివారిని ఇక్కడికి తోడుకొని రమ్ము అని ఆ దాసునితో చెప్పెను. అంతట దాసుడు–ప్రభువా నీవాజ్ఞాపించినట్లు చేసితిని గాని యింకను లోటున్నదని చెప్పెను. అందుకాయన నాయిల్లు నిండునట్లు నీవు రాజమార్గములలోనికిని కంచెలలోనికిని వెళ్లి లోపలికి వచ్చుటకు అక్కడి వారిని బలవంతము చేయుము. ఏలయనగా పిలువబడిన ఆ మనుష్యులలో

ఒకడును నావిందు రుచిచూడడని మీతో చెప్పుచున్నాననెను" (లూకా 14:16-24).

ఈ ఉపమానములో గొప్ప విందు చేయించిన మనుష్యుడు దేవునికి సూచనగా యున్నాడు. మానవమాత్రులను ఆయన నిత్యపరలోకానందముకొరకు ఆహ్వానించుచున్నారు. ఆవిందుకొరకు ఆయన అన్నిసంగతులు సిద్ధపరచారు. యేసు రాకముందే ఈ ఏర్పాట్లన్నీ సిద్ధపరచబడెను. గొప్పవిందు సువార్తలోని ఆశీర్వాదములతో సమానము. అది నిత్యరక్షణ. ఆహ్వానము సువార్త ద్వారా ఇయ్యబడుచున్నది. విందు సిద్ధపాటును గూర్చి చెప్పుటకు పంపబడిన దాసుడు యేసుక్రీస్తు. ఆహ్వానింపబడిన వారు యూదులు. వారు దేవునియొక్క ప్రత్యేక ప్రేమను పొందినవారు. విందు, సిద్ధపాటు, క్రీస్తురాకడకు సంపూర్ణమైన కాలము (గలతీ 4:4).

18-20 వచనములలో ఊహించ రానిది జరిగినది. ఆహ్వానించ బడినవారు రాకుండా సాకులు చెప్పసాగిరి. అరబ్బు దేశాలలో ఆహ్వానము నందుకొన్న తరువాత విందుకు గైర్హాజరవుట గొప్పసిగ్గుచేటు. దానివలన కొన్ని సందర్భాలలో యుద్ధము కూడ సంభవింపవచ్చును. అందరుసాకులు చెప్పిరి. వారొకరితో నొకరు కూడ బలుకుకొని యుండకపోవచ్చును. గాని అందరు సాకులు చెప్పసాగిరి.

ముందుగా చూడకుండనే పొలమును ఎవడైనా కొంటే అతడు బుద్ధిహీనుడే. అలాగే పది ఎడ్లను కొనినవాడు కూడ వాటిని ముందుగా పరీక్షింపకపోతే బుద్ధిహీనుడే. కొత్తగా పెండ్లి చేసికొనినవాడు తన భార్యను యింటికి తీసికొనివచ్చే యుండును. వీరు ఆహ్వానమును తిరస్కరించలేదు, వారు దుష్కార్యములలో యేమీ మునిగియుండలేదు. నేడు దేవుని ఆహ్వానమును తిరస్కరించు అనేకులు చెడుగా ప్రవర్తించు వారుకారు. గాని వారు తమదైనందిన వ్యవహారాలలో తీరికలేక యున్నవారు. ఆత్మీయ విషయాలను

గూర్చి తీవ్రముగా ఆలోచించువారు కారు. అందరు సాకులు చెప్పేవారే.

ఈ ముగ్గురు చెప్పిన సాకులు రెండు రకాలైనవి. మొదటి రెండు ఆస్థిని గూర్చినవి. మూడవది సంబంధ బాంధవ్యాన్ని గూర్చినది. అయితే ఈసాకులు దేవుని వాక్యము హృదయములో పెరుగకుండా అణచివేయునట్టివి. సువార్త విందుకు నేడు జనములు ఆహ్వానించబడుచున్నారు. గాని యేసు చెప్పినట్లు అనేకులు సాకులు చెప్పుచున్నారు.

21-26 వచనాలలో విందు యజమాని యొక్క కోపము వర్ణించబడినది. ప్రేమమూర్తియైన దేవుడు కోపపడడని కొందరు భావిస్తారు (I యోహాను 4:8,16, నిర్గమ 4:14; సంఖ్యా 25:4; మార్కు 3:5). అదేరీతిగా ఆహ్వానింపబడిన వారు సాకులు చెప్పగా వారిస్థానమును భర్తీచేయుటకు దేవుడు సంకల్పించారు. ఆహ్వానమునందుకొని విందుకు రాకుండా సాకులు చెప్పినవారు యేసుకాలమునాటి యూదులు ఆయనను వారు నిరాకరించారు.

యజమానుడు దాసునితో, "నీవు త్వరగా పట్టణపు వీధులలోనికి, సందులలోనికి వెళ్లి బీదలను అంగహీనులను కుంటివారని, గ్రుడ్డివారిని ఇక్కడికి తోడుకొని రమ్మని" చెప్పెను (లూకా 14:21). వారందరురాగా ఇంకను చోటువున్నది. అందుకు యజమానుడు, నాయిల్లునిండునట్లు నీవు రాజమార్గములలోనికి, కంచెలలోనికి వెళ్లి లోపలికి వచ్చునట్లు అక్కడివారిని బలవంతము చేయుమని" చెప్పెను (లూకా 14:22-23).

కుంటివారు, గ్రుడ్డివారు సుంకరులు మిగతావారందరు అన్యజనులు. బలవంతముచేయుట! రాజమార్గములలోను, కంచెలలోను యున్న సామాన్యులు ఇంతగొప్ప ఆహ్వానమును పొందుటకు అర్హులము కామని తలుస్తారు గనుక వారిని బలవంతము చేయవలసి వచ్చినది.

విందు యజమాని దేవుడు గనుక అందరు దేవుని రాజ్యము లోనికి ఆహ్వానితులే. మారుమనస్సు పొంది సువార్తకులోబడిన వారెంత ఘోర

పాపులైనను వారి పాపములు క్షమించబడును. దేవుడు సర్వమానవాళికే దేవుడే. ఆయన యూదులను, యూదులుకాని వారిని అందరినీ రక్షించును. దేవుని కృపగల ఆహ్వానము వర్తించకుండా ఎవరు లేరు. ఎవరికీ అక్కరలేని వారిని ప్రభువే ఆహ్వానించుచున్నారు.

"సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడనుకాను, ఏలయనగా నమ్ముప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" అని అపొ. పౌలు తెలియజేసాడు (రోమా 1:16).

గొప్ప విందును గూర్చిన ఉపమానము తమ్మును తాము బహిష్కరించు కొనిన వారితో ముగియుచున్నది. "ఏలయనగా పిలువబడిన ఆ మనుష్యులలో ఒకడును నావిందు రుచి చూడడని మీతో చెప్పుచున్నాను" (లూకా 14:24). నిజానికి ఇదే దృశ్యము కడవరి తీర్పునాడు కూడ సంభవించును. దేవుని మాటచొప్పున ఆయన పిలుపునంగీకరించని వారు నిత్య నాశనమునకు గురియవుదురు. వారు దేవుని కృపకు దయకు తమ్మునుతావే బహిష్కరించుకొన్నారు.

సాకులు చెప్పినవారు గొప్పవిందులో పాల్గొనలేకపోయారు. సువార్తకు లోబడకుండా నేడుసాకులు చెప్పేవారు కూడ పరలోకము చేరుకోలేరు.

క్రీస్తు కాలమునుండి నేటివరకు యున్న యూదులలో పెక్కుమంది ఆయనను నిరాకరించారు. ఇశ్రాయేలు యొక్క నిరీక్షణను గూర్చి చెప్పబడిన ప్రవచనముల నెరవేర్పునేవారు నిరాకరించారు. అవిశ్వాసము వలన యూదుల యొక్క దౌర్భాగ్యాన్ని, విశ్వాసమువలన అన్యజనుల యొక్క సుభాగ్యాన్ని రోమా 11:12-32 వివరించుచున్నది. ఇప్పుడైతే యూదుడేమి, యూదుడు కానివాడేమి దైవిక ఆహ్వానము నందుకొనుటకు సమాన తరుణములను కలిగియున్నాడు.

## ముగింపు:

పరిసయ్యుల అధికారి యింటిలో చెప్పబడిన ఈ ఉపమానము గొప్ప విందు ఉపమానమని చెప్పబడినది. దానికి అనేకులు ఆహ్వానింపబడిరి. అందువలన అది గొప్ప విందు. విందు నిచ్చేవాడు గొప్పవాడు. ఆయనే గొప్ప దేవుడు! అది క్రీస్తు కాలము నాటి వాస్తవము. యూదులు ఆయనను నిరాకరించారు. అన్య జనులు ఆయనను అంగీకరించారు గనుక అది ప్రవచనాత్మకమైనది.

ఈ ఉపమానము విశాదకరమైనది ఏలయనగా దేవుని ఆహ్వానము నంగీకరింపని అనేకుల విశాదాంతము అది తెలియుజేయుచున్నది. ఇహసంబంధమైన ఆస్థి పాస్తులపై యున్న వ్యామోహమును బట్టి వారు తమ్మును తామే నిత్య సంతోషము నుండి వెలివేసుకొన్నారు!

# 19. తప్పిపోయిన గొర్రె

## (The Lost Sheep)

లూకా 15:1-7

**పరిచయము:**

తప్పిపోయిన గొర్రెను గూర్చిన ఉపమానము లూకా సువార్తలో ప్రత్యేకమైనది. దానిలాంటి మరొక సందర్భము మత్తయి సువార్తలో కూడ కనబడును. గొర్రెలు, గొర్రెల కాపరుల ఉదాహరణలతో బైబిలులో అనేక సత్యములు బోధింపబడినవి.

మనలో చాలమందికి ఇష్టమైన లేఖన భాగములుంటాయి. లూకా సువార్త 15 అధ్యాయము అనేకులకు ఇష్టపూర్వకమైనది. అది బైబిలు అంతటిలోనూ అత్యంత అమూల్యమైనది. దానియంతటి మృదువైన ప్రేమ పూర్వకమైన అధ్యాయము మరొకటిలేదు. అది సువార్తలకు సువార్తయని శతాబ్దములు తరబడి చెప్పబడుచున్నది. ఆ అధ్యాయములో మూడు గొప్ప ఉపమానములు చెప్పబడినవి; తప్పి పోయిన గొర్రె, పడిపోయిన నాణెము, తప్పిపోయిన కుమారుడు. అదిమూడు ఉపమానములుగా యున్నను లూకా 15వ అధ్యాయము అంతయును ఒకే ఉపమానమై యున్నది. ఒక ఉపమానము మరొక దానికి నడిపించును. "అందుకాయన వారితో ఈ ఉపమానము చెప్పెను" అని లూకా 15:3లో చెప్పబడినది. అనగా ఆ అధ్యాయమంతయు ఒకే ఉపమానమై యున్నది.

అందున్న మూడు ఉపమానములు కూడ ఒక్క ఆత్మ నశించి పోతే దేవుడు గమనిస్తారు, బహుశా దుఃఖిస్తారు. పాపుల యెడల దేవుని ప్రేమను ఈ ఉపమానములు తెలియజేయు చున్నవి. గొర్రె; నాణెము, కుమారుడు...విలువ పెరుగుచు యున్నది.

నూరులో ఒకటి, పదిలో ఒకటి నుండి ఇద్దరిలో ఒకని దగ్గరకు మనం వస్తాము. గొర్రెను పోగొట్టుకంటే తీవ్రమే, డబ్బును పోగొట్టుకొంటే ఇంకా ఘోరము, కుమారునే పోగొట్టుకొంటే అన్నిటికంటే ఘోరము. ఇవన్నీ కలిసి ఆయనను విమర్శించే వారికి యేసు యిచ్చిన జవాబు అయ్యున్నది (లూకా 15:2). శాస్త్రులు, పరిసయ్యులు యేసు సుంకరులతోను పాపులతోను సహవాసము చేయుచున్నాడని తరుచు విమర్శించేవారు. వారు పరలోక రాజ్యము విషయమై అనాసక్తిపరులు. సుంకరులను తమ స్వదేశస్థులే ద్వేషించేవారు. వారు రోమా ప్రభుత్వము దరపున యుండేవారు గనుక దేశద్రోహులుగా పరిగణించేవారు.

యేసును స్వాగతించ వలసిననాటి మతనాయకులే ఆయనను తిరస్కరించారు. అది విచారం. అయితే పాపులైన వారు యేసును సంతోషంతో వెదికేవారు, వెంబడించేవారు. పరిసయ్యుల వలెగాక పాపులు తాముపాపులని, వారికి రక్షణ అవుసరమని గ్రహించేవారు.

## ఉపమానము:

"అందుకాయన వారితో ఈ ఉపమానము చెప్పెను. మీలో ఏ మనుష్యునికైనను నూరు గొర్రెలు కలిగియుండగా వాటిలో ఒకటి తప్పిపోయిన యెడల అతడు తొంబది తొమ్మిదింటిని అడవిలో విడిచిపెట్టి తప్పిపోయినది దొరుకువరకు దానిని వెదక వెళ్లడా? అది దొరకినప్పుడు సంతోషముతో దానిని తన భుజముల మీదవేసి కొని ఇంటికివచ్చి తన తన స్నేహితులను పొరుగువారిని పిలిచి మీరు నాతో కూడ సంతోషించుడి; తప్పిపోయిన నా గొర్రె దొరికినదని వారితో కూడ చెప్పును గదా. అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది నీతిమంతుల విషయమై కలుగు సంతోషము కంటె మారుమనస్సు పొందు ఒక్కపాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును" (లూకా 15:3-7).

గొర్రెలు గొర్రెల కాపరులు పాలస్తీనాలో సామాన్యమే. అందువలన వీరిని గూర్చిన సందర్భములు లేఖనములలో తరుచు మనకు కనబడ్తాయి. వాటిని ఉదాహరణగా వినియోగించిన సందర్భములు కూడా మెండు. గొర్రెలను గూర్చి మొదటిగా ఆదకాండము 4:2లో కనబడతాది. "హేబెలు గొర్రెల కాపరి". గొర్రెలు, గొర్రెపిల్లలు బలి అర్పణగా అర్పించబడినట్లు పాత నిబంధనలో మనము కనుగొనగలము (నిర్గమ 20:24; I రాజులు8:63; 2దివృ 29:33). గొర్రెలు మాంసాహారమునకు ముఖ్యము (I సమూ28:18; I రాజులు 1:19; 4:23; కీర్త 64:11). వాటిపాలు త్రాగుటకును, (యెష 7:21, 23) ఉన్ని దుస్తులకును ఉపయోగపడేవి (లేవీ 18:47; ద్వితీ 22:11)

గొర్రెల కాపరియొక్క విధులు అనేకములు. వారికి నిత్యము వుండే విధులు కలవు. అతని జీవితము ఎల్లవేళలా శక్తివంతముగాను, చురుకుగాను వుండేది. గొర్రెలు పుట్టిననాటి నుండి చనిపోయేవరకు వాటిని పాలించుట అత్యవుసరము. అవి వినయముకు, సాత్వికముకు, ఓర్పుకు, మృదుత్వమునకు గురుతుగా యున్నను (యెషయా 53:7; అపో.కా. 8:37), అవి అతి తెలివి తక్కువ జంతువులు. వాటిని నిత్యము చూచుచు, కాయుచుండుట అత్యవుసరము.

బైబిలు కాలములో యూదయలో గొర్రెలకాపరి యొక్క పనిచాల కష్టతరమైనది. అరుదైన పచ్చిక ప్రదేశములు కనుగొనుట, మందను కాయుట కష్టమైనపని. గొర్రెలకాపరి వేడికి, చలికి తట్టుకోవాలి (ఆదికా 31:40), ప్రకృతి సహజమైన ఆహారము సేవించాలి (ఆమోను 7:14), క్రూరమృగములనుండి తన మందను కాయాలి (I సమూ17:34; యెషయా 31:4; యిర్మి 5:6; ఆమోసు 3:12). దొంగలనుండి కూడ మందను అతడు కాపాడాలి (ఆది 31:39).

గొర్రెల కాపరుల విధులు కూడ లేఖనములలో మనకు చెప్పబడినవి. ఉదయాన్నే అతడు మందను దొడ్డిలోనుండి బయటికి తీసుకొనివెళ్లాలి,

కుక్కలతో అతడు మందను కాపలా కాసేవాడు (యోబు 30:11), కొన్ని తప్పిపోయిన యెడల అవి దొరికే వరకు వాటిని వెదకాలి (యెహెజ్కేలు 34:12; లూకా 15:4), అతడు గొర్రెలకు నీటిని సరఫరా చేయాలి (ఆదికా 29:7; కీర్తన 23:2; ఆదికా 30:38; నిర్గమ 2:16). సాయంకాలమున గొర్రెలను అతడు దొడ్డిలోనికి చేర్చాలి (లేవీ 27:32; యెహెజ్కేలు 20:37; యిర్మి 33:13), రాత్రులందు వాటికి కాపలా కాయాలి (యోహాను 10:3; ఆదికా 31:40).

గొర్రె తెలివి తక్కువ గల జంతువు. అది అక్కడా ఇక్కడా తిరుగును. ఎక్కడ ఖాళీ దొరికితే అక్కడికి పోయే జంతువు అది. అది దూరపు కొండలలోనికి పోయి దారి తప్పి పోవును. తప్పిపోయినట్లుదానికి తెలియదు. వేలకొలది ప్రజలు నేడు ఇట్లున్నారు.

మేత మేయుచు గొర్రెలు దారి తప్పిపోవుట కద్దు. దారితప్పి పోవాలని అవి తలంచవు, గాని తిరిగివచ్చే దారి వాటికి తెలియదు. మానవులు పాపములో అటుయిటు తిరుగుచు దేవునినుండి తొలగిపోవుదురు (యెషయా 59:1,2). మంచి గొర్రెల కాపరియైన యేసు స్వరమును విననందున నేడు అనేకులు నాశనమగుచున్నారు (యోహాను 10:14, 27).

"నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను" (లూకా 19:10). "నేను పాపులను పిలువ వచ్చితిని గాని నీతిమంతులను పిలువరాలేదు" (మత్త 9:13). యేసును వ్యతిరేకించిన మతనాయకులు దీనిని గుర్తించి ఆయనను స్వీకరించి యుండవలసినది. అప్పుడాయన పాపులతో సాంగత్యము చేయు కారణమును గ్రహించి యుందురు.

నశించిన గొర్రెను వెదకి పట్టుకొందునని కాపరి ఎల్లప్పుడు తలంచును. దానిని ఎప్పుడు కనుగొనలేనని అతడు తలంచడు. దానిని వెదుకుటకు కాపరి తానే వెళ్లును గనుక అతని ఆసక్తిని మనము గ్రహించుకొందుము. నశించిన దానిని వెదకి కనుగొనిన తరువాత కాపరి దానిని శిక్షించడు, కఠినంగా

దానిని దొడ్డిలోనికి చేర్చడు గాని దానిని తన భుజముల మీద వేసికొని దొడ్డిలోనికి దానిని చేర్చును.

లూకా 15:6లో చెప్పబడిన సంతోషము, ఒక్క పాపి మారుమనస్సు పొందితే పరలోకములో కలుగు నిజమైన సంతోషమును వర్ణించుచున్నది. అదే రీతిగా మనతోటి మానవులు మారుమనస్సు పొందినప్పుడు మనము కూడ నిజముగా సంతోషించాలి.

పరిసయ్యులు, శాస్త్రులు నీతిమంతులని, సుంకరులు పాపులని యేసు యొక్క ఉద్దేశ్యము కాదు. సరిగదా మారుమనస్సు అక్కడ లేని వారెవరు లేరని, అందరు అంతట మారుమనస్సు పొందవలెనని ఆయన ఉద్దేశ్యము. వారు నీతిమంతులమని చూపించుకొనే వారు, ఆరోపించుకొనే వారు గాని వారు నీతిమంతులు కాదు. తమస్వనీతిని బట్టి యేసును వారు నిందించుటను బట్టి ఆయన వారిని ఖండించారు. తొంబది తొమ్మిది స్వనీతిపరుల కంటె మారుమనస్సు పొందు సుంకరులు, పాపుల విషయమై పరలోకమందు నిజమైన సంతోషము కలుగును. నశించుట ఘోరము, రక్షింపబడుట సంతోష దాయకము.

## ముగింపు:

మానవుల యెడల దేవుని ప్రేమ తరుచు గొర్రెలతో పోల్చబడినది (మత్త 9:36; 10:6; హెబ్రీ 13:20 Iపేతు 2:25). తప్పిపోయిన గొర్రెల వలె తరుచు దేవుని ప్రజలు వర్ణించబడ్డారు (కీర్త 119:76; యెష 53:6; యిర్మి 23:1-2; జెక 13:7). ఇశ్రాయేలీయుల నాయకులు తమ బాధ్యతలను విస్మరించినందున దేవుడు వారిని శిక్షించుచు వచ్చారు. బాధ్యతను విస్మరించినందున దేవుడు వారిని శిక్షించు నిమిత్తము దేవుడు వారికొక గొర్రెల కాపరిని వాగ్దానము చేసారు. ఆయనద్వారా తప్పిపోయిన గొర్రెలను ఆయన తిరిగి సంపాదించుకొనును (యెహెజ్కేలు 34). ఇశ్రాయేలీయుల నాయకులు ఎల్లప్పుడు చేయవలసిన పనిని చేయుటకు యేసు వచ్చారు. నశించిన దానిని

వెదకి రక్షించుటకు ఆయన వచ్చారు (లూకా 19:10). మనము పాపములో బడి తప్పి పోయినను దేవుడు మనలను గూర్చి చింతించు చున్నారని తప్పిపోయిన గొర్రె ఉపమానము తెలియజేయుచున్నది.

గొర్రెల కాపరి తప్పిపోయిన గొర్రెలను గూర్చిన దేవుని చింత ఈ ఉపమానము తెలియజేయు చున్నది. పాపులను గూర్చి చింతించుట వేరు, వారిని వెదుక వెళ్లుట వేరు. దేవుడు నశించినవారిని వెదుకును. ఆయన ఆవ్యక్తిని ప్రేమించును. అశ్రద్ధవలన ప్రజలు దేవుని నుండి తొలగిపోతారు.

యేసు తానే గొర్రెల కాపరిగా గుర్తించు కొన్నారు (యోహాను 10:11, 14-15). యేసు ప్రధానకాపరి యని పేతురు గుర్తించాడు I పేతురు 5:4). తదుపరి సంఘ పెద్దలు మందను కాయువారని కూడ చెప్పబడినది (అపొ.కా. 20:28-29, Iపేతురు 5:2-3).

మన ప్రధాన కాపరియైన యేసు ప్రభువు యూదులను అన్యజనులను ఒకేమందగా చేర్చారు. యేసుక్రీస్తు వధింపబడిన గొర్రె పిల్లగా కూడ లేఖనములలో వర్ణించబడ్డారు (యోహాను 1:29; 36:1, Iపేతురు 1:18-19; యెష 53:7). ఆయన దేవుని గొర్రెపిల్లగా ప్రకటన గ్రంథములో 79 సార్లు చెప్పబడినది.

# ౨౦. పడిపోయిన నాణెము

## (The Lost Coin)

లూకా 15:8-10

### పరిచయము:

లూకా సువార్త 15వ అధ్యాయములో యేసు పడిపోయిన నాణెమును గూర్చిన ఉపమానము చెప్పారు. ఆ అధ్యాయములో ఇది రెండవది. ఆయన తప్పిపోయిన గొర్రె, పడిపోయిన నాణెము, తప్పిపోయిన కుమారుని గూర్చిన ఉపమానములు ఒకే సందర్భములో, ఒకేజనసమూహమునకు బోధించారు. పరిసయ్యులకు, శాస్త్రులకు జవాబుగా యేసు ఈ ఉపమాన సంపుటిని బోధించారు (లూకా 15:2). యేసును సుంకరులు పాపులు సంతోషముతో అంగీకరించేవారు. అందు వలన శాస్త్రులు పరిసయ్యులు ఆయనను విమర్శించేవారు (లూకా 15:1-2).

పాపుల యెడల మన స్వభావమును గూర్చి ముఖ్యముగా పడిపోయిన నాణెమును గూర్చిన ఉపమానము తెలియ జేయుచున్నది. తప్పిపోయిన పాపియొక్క ఆత్మవిలువను గుర్తించుచు అతని వెదుకుట ఇందులో మనకు కన్పడుచున్నది.

యేసుక్రీస్తు వలెనే ఆదిమసంఘము పాపులను శ్రద్ధతో వెదికే వారు. నిజానికి మొదటి శతాబ్దపు క్రీస్తుసంఘము (తదుపరి అన్ని శతాబ్దముల సంఘమువలె) రక్షింప బడిన పాపులతో నిండియుండేది. ( I కొరింథీ 6:9-11). మొదటి శతాబ్దపు క్రీస్తు సంఘము పాపులతో సహవసించుటకు వెనుదీయలేదు. వారికి బోధించి మారుమనస్సు పొందిన తరువాత సహవాసములోనికి ఆహ్వానించుటకు వారు వెనుదీయలేదు.

పడిపోయిన నాణెము యొక్క విలువ, అదిపడిపోయిన స్థలము,

సందర్భములను యేసు చక్కగా ఈ ఉపమానములో వర్ణించారు. పడిపోయిన నాణెము రోమా దేశపు దేనారములో సమానముగల వెండినాణెము. అది ఆనాటి ఒక రోజు జీతముతో సమానము. ఆనాటి యూదా స్త్రీలు పదినాణెములను పోగుచేసికొని మెడలో ఒక హారముగా ధరించుకొనేవారు. మరీ ముఖ్యముగా వివాహితులైన స్త్రీలు ఈ నాణెముల హారమును ధరించేవారు. ఏది ఏలాగయినా, ఒక హారములో భాగముగా గాని, లేదా దాచబడిన ధనమువలెగాని అది పడిపోగా దాని విలువ అత్యంతమైనదిగా ఆ స్త్రీ పరిగణించినది. ఆమె దాని కొరకు శ్రద్ధగా వెదకినది. అది పడిపోగా ఆమె ఒక దీపము వెలిగించి తన ఇల్లంతా ఊడ్చినది. ఆ రోజులలో యిండ్లకు సాధారణముగా కిటికీలుండేవి కావు గనుక పగటివేళకూడ దీపము అవుసరము. లోపల అంతామట్టితో అలుకబడి యుండేది. గనుక పడిపోయిన ఆ నాణెము ఇంటిలోనే కనబడకుండా ఎక్కడైనా యుండవచ్చును. గనుక దానిని వెదకుట కష్టమే. చివరకు అది దొరికే సరికి ఆమె యొక్క సంతోషము పట్టజాలనిది. పడిపోయిన ఆ వెండినాణెము ఆమెకు దొరికినది.

## ఉపమానము:

"ఏ స్త్రీకైనను పది వెండినాణెములుండగా వాటిలో ఒక నాణెము పోగొట్టుకొంటె ఆమె దీపము వెలిగించి యిల్లు ఊడ్చి అది దొరుకు వరకు జాగ్రత్తగా వెదకదా? అది దొరికనప్పుడు తన చెలికత్తెలను పొరుగు వారిని పిలిచి–నాతో కూడ సంతోషించుడి, నేను పోగొట్టుకొనిన నాణెము దొరకినదని వారితో చెప్పును గదా. అటువలె మారుమనస్సు పొందు ఒక పాపి విషయమై దేవుని దూతల యెదుట సంతోషము కలుగునని మీతో చెప్పుచున్నానని" యేసు చెప్పెను (లూకా 15:8–10).

పడిపోయిన నాణెము, తప్పిపోయిన గొర్రె పాపములో బడి నశించిన వానికి సాదృశ్యముగా యున్నదనుట విదితమే. పడిపోయిన నాణెమువలె అనేకులు పాపములో పడియున్నారు. గాని వారు పడిపోయినట్లు ఎరుగరు.

నశించిన వాని ఆత్మ పడిపోయిన వెండి నాణెము వలె యున్నది.

పడిపోయిన నాణెముపై కైసరు యొక్క ముద్ర ఎట్లుండెనో (లూకా 20:24), అట్లే, పాపములో పడిపోయినవాడు ఆత్మీయముగా దేవుని స్వరూపము కలిగిన వాడై యుండును (ఆదికా 1:26). పడిపోయిన నాణెము యజమానికి ఎట్లు నిరుపయోగమైనదో, తప్పిపోయిన పాపి దేవుని సేవకు నిరుపయోగియవుతాడు. పడిపోయినా సరే, నాణెము విలువగలది గనుక దాని యజమాని తిరిగిపొందగోరును. దాని పోగొట్టుకొనిన స్త్రీ దాని తిరిగి పొందడానికి సర్వ విధాల ప్రయత్నం చేసినది. అదే రీతిగా నశించిన పాపిని తిరిగి పొందడానికి దేవుడు సర్వ విధాల ప్రయత్నం చేయును. తన వాక్యము ద్వారా, కాపుదల ద్వారా, క్రైస్తవులద్వారా ఆయన వారిని వెదకును.

నాణెము పడిపోయినా సరే, అది యింటిలోనే యుండునని ఈ ఉపమానము తెలియజేయుచున్నది. అదే రీతిగా లక్షలాది ప్రజలు లోకములో నశించిపోయినా, సంఘములోనే యుంటూ నిరుపయోగమైన క్రైస్తవులుందురు. పడిపోయిన నాణెము విలువగలదేగాని అది చెలామణిలో లేదు.

దేవుని వాక్యమే దీపము. సంఘము దానిని వెలిగించి పాపులను వెదకును. సువార్త వెలుగుకు బదులుగా మానవ కల్పిత సిద్ధాంతములను వినియోగిస్తే, పాపులను గుర్తించుట కష్టమగును. భౌతిక సంబంధ ఆకర్షణలనుపయోగిస్తే, అక్కడ గుమికూడేవారు తప్పిపోయిన పాపులే. పడిపోయినట్లువారు గుర్తెరుగరు.

## ముగింపు:

పడిపోయిన నాణెము నుండి మనం అనేక పాఠములు నేర్చుకొన వచ్చును.

నశించిన పరిస్థితి ఒకటి యున్నది

దేవుడు నశించిన వారిని వెదుకుచు యున్నారు.

ఆయన చిత్తప్రకారము వారిని రక్షించుటకు ఆయన ప్రయత్నము చేయుచు యుండును.

పడిపోయిన నాణెము కొరకు ఆ స్త్రీ చాల శ్రద్ధజూపినది.

నశించిన వారి కొరకు, సభ్యులకొరకు సంఘము శ్రద్ధకలిగి యుండాలి.

నాణెము వెదుకుటకు ఆస్త్రీ వెళ్లినది. నాణెము ఆమె యొద్దకువచ్చుటకు ఆమె కనిపెట్టలేదు. నశించినవారు తమకుతామే రావాలని సహోదరులు కనిపెట్టుదురు. పడిపోయిన నాణెము కొరకు తన యొద్దనున్న వన్నీ స్త్రీ వినియోగించినది. అది నాకు దొరుకదని ఆమె ఎన్నడు తలంచలేదు. నేడు కూడ దేవుడు తన వాక్యమనే దీపమును వినియోగించుచున్నారు. దాని సహాయముతో సంఘము ద్వారా ఊడ్చుచున్నారు. మారుమనస్సు పొందేవారు ఇంకను యున్నారని క్రైస్తవులు విశ్వసించాలి. పడిపోయిన నాణెము తప్పక దొరికే అవకాశమున్నది.

విచారం యేమంటే నశించిన ఆత్మలను గూర్చిన చింత నేటి సంఘమునకు కొదువగా యున్నది. మన కుటుంబాలతో సుఖముగానే యుండి (ఆమోసు 6:1), నశించిన వారిని గూర్చిన చింతలేక యున్నాము.

ఒకపాపి మారుమనస్సు పొందితే నేటి సంఘము సంతోషించుచున్నదా?

# 21. తప్పిపోయిన కుమారుడు

## (The Prodigal Son)

లూకా 15:11-32

### పరిచయము:

ఇంతకు ముందు చెప్పబడిన ఉపమానములు వినిన వారే తప్పిపోయిన కుమారుని ఉపమానమును కూడ విన్నారు. ప్రభువును నిందించు చున్నవారికి జవాబుగా ఆయన తప్పిపోయిన గొర్రె, పడిపోయిన నాణెము, తప్పిపోయిన కుమారుని గూర్చిన ఉపమానములను చెప్పియున్నారు. శాస్త్రులు పరిసయ్యుల నుద్దేశించి యేసు ఈ గొప్ప ఉపమానములను చెప్పారు. వారు దేవుని రాజ్యము నందు ఆసక్తిలేనివారు. గాని యేసు యూదా సమాజములో వెలివేయబడిన వారితో సాంగత్యము చేయుట చూచి కోపోద్రేకులైరి. ఆయనను విమర్శింపసాగిరి. "ఈ మనుష్యుడు పాపులను చేర్చుకొనుచున్నాడు!" అని చెప్పి వారు విమర్శించేవారు. వారికి ప్రభువు ఎట్టి జవాబిచ్చారు? వారాయనను అపార్థము చేసికొన్నారని వారికి చెప్పలేదు. సరిగదా వారు వాస్తవమునే చెప్పారని అంగీకరిస్తు, నశించిన వారి యెడల ఆయన ప్రేమను ఉపమానరీతిగా ప్రగాఢముగా ప్రకటించారు.

### ఉపమానము:

"మరియు ఆయన ఇట్లనెను. ఒక మనుష్యునికి ఇద్దరు కుమారు లుండిరి.. వారిలో చిన్నవాడు-తండ్రీ ఆస్తిలో నాకు వచ్చు భాగమిమ్మని తన తండ్రి నడుగగా, అతడు వారికి తన ఆస్తిని పంచిపెట్టెను. కొన్ని దినములైన తరువాత ఆచిన్న కుమారుడు సమస్తమును కూర్చుకొని దూరదేశమునకు ప్రయాణమై పోయి అచ్చట తన ఆస్తిని దుర్వ్యాపారము వలన పాడు చేసెను. అదంతయు ఖర్చు చేసిన తరువాత ఆ దేశమందు గొప్ప కరువురాగా వాడు

ఇబ్బంది పడసాగి వెళ్లి ఆదేశస్థులలో ఒకని చెంత చేరెను. అతడు పందులను మేపుటకు తన పొలముల లోనికి వానిని పంపెను. వాడు పందులు తిను పొట్టుతో తన కడుపు నింపుకొన ఆశపడెను గాని యెవడును వానికేమియు ఇయ్యలేదు. అయితే బుద్ధి వచ్చినప్పుడు వాడు-నాతండ్రి యొద్ద ఎంతోమంది కూలివాండ్రకు అన్నము సమృద్ధిగా ఉన్నది, నేనైతే ఆకలికి ఇక్కడ చచ్చిపోవుచున్నాను. నేను లేచి నాతండ్రి యొద్దకు వెళ్లి-తండ్రీ నేను పరలోకమునకు విరోధముగాను నీ యెదుటను పాపము చేసితిని. ఇక మీదటను నీ కుమారుడనని అనిపించుకొనుటకు యోగ్యుడను కాను, నన్ను నీ కూలి వారితో ఒకనిగా పెట్టుకొనుమని అతనితో చెప్పుదుననుకొని లేచి తండ్రి యొద్దకు వచ్చెను. వాడింకా దూరముగా ఉన్నప్పుడు తండ్రి వానిని చూచి కనికరపడి, పరుగెత్తి వానిమెడ మీద పడి ముద్దు పెట్టుకొనెను. అప్పుడు ఆ కుమారుడు అతనితో-తండ్రీ నేను పరలోకమునకు విరోధముగాను నీ యెదుటను పాపము చేసితిని, ఇక మీదట నీ కుమారుడనని అనిపించు కొనుటకు యోగ్యుడను కాననెను.

"అయితే తండ్రి తన దాసులను చూచి-ప్రశస్తవస్త్రము త్వరగా తెచ్చి వీనికి కట్టి వీని చేతికి ఉంగరము పెట్టి పాదములకు చెప్పులు తొడిగించుడి, క్రొవ్విన దూడను తెచ్చి వధించుడి. మనము తిని సంతోషపడుదుము; ఈ నాకుమారుడు చనిపోయి మరల బ్రదికెను, తప్పిపోయి దొరికెనని చెప్పెను. అంతటవారు సంతోషపడసాగిరి. అప్పుడు అతని పెద్ద కుమారుడు పొలములో ఉండెను. వాడు పొలమునుండి వచ్చుచు ఇంటి దగ్గరకురాగా, వాద్యములను నాట్యమును జరుగుట విని దాసులలో ఒకని పిలిచి ఇవి ఏమిటని అడుగగా- ఆ దాసుడు అతనితో నీ తమ్ముడు వచ్చియున్నాడు, అతడు తన యొద్దకు సురక్షితముగా వచ్చినందున నీ తండ్రి క్రొవ్విన దూడను వధించెననెను. అయితే అతడు కోపపడి లోపలికి వెళ్లనొల్లక పోయెను గనుక అతని తండ్రి వెలుపలికి వచ్చి లోపలికి రమ్మని బతిమాలు కొనెను. అందుకతడు తన తండ్రితో ఇదిగో యిన్ని యేండ్లనుండి నిన్ను సేవించు చున్నానే, నీ ఆజ్ఞను

నేనెన్నడూ మీరలేదే; అయినను నా స్నేహితులతో సంతోషపడునట్లు నీవు నా కెన్నడూ ఒక మేకపిల్లనైన ఇయ్యలేదు. అయితే నీ ఆస్తిని వేశ్యలతో తిని వేసిన యీ నీ కుమారుడు రాగానే వీనికొరకు క్రొవ్విన దూడను వధించితివని చెప్పెను. అందుకతడు కుమారుడా, నీవెల్లప్పుడును నాతోకూడ ఉన్నావు; నావన్నియు నీవి. మనము సంతోషపడి ఆనందించుట యుక్తమే. ఈ నీతమ్ముడు చనిపోయి తిరిగి బ్రదికెను, తప్పిపోయి దొరికెనని అతనితో చెప్పెను" (లూకా 15:11-32).

ఈ మనుష్యుని ఇద్దరి కుమారులలో చిన్నవాడు తన తండ్రిని ఆస్తికొరకు అడిగెను. తండ్రి అతని కోరికను మన్నించెను. యూదుల పద్ధతి ప్రకారము తండ్రి మరణించిన తదనంతరము చిన్నవానికి తండ్రియొక్క ఆస్తిలో మూడవ భాగము సంక్రమించును. పెద్దవానికి రెండంతలు వెళ్లును. ఈ సందర్భములో మూడింటిలో రెండు వంతులు పెద్దవానికి సంక్రమించును. తండ్రి బ్రదికి యుండగా కుమారులు ఆస్తిలో భాగమును కోరుకొనుటకు ఆధార మేమియులేదు, అట్టి సందర్భములు కూడ లేవు. అట్టి కోరికను మన్నించుటకు తండ్రి కూడ బాధ్యుడు కాడు.

అయితే ఈ సందర్భములో రెండవవాడు మొదటివానిగా అగుపడు చున్నాడు. అతడు నిశ్చయించేసుకొన్నాడు. అతడు తన కుటుంబమును విడిచి వెళ్లిపోవడానికి నిశ్చయించేసుకొన్నాడు. అది అనాలోచిత చర్యయే. అయినను తండ్రి అతని కోరికను మన్నించాడు. అతడు వెళ్లిన 'దూరదేశము' సాధారణంగా పాపులు పోయే దూర ప్రాంతము.

అదిదేవుని నుండి దూరమైపోయిన దూరప్రాంతము (కీర్తన 10:4; ఎఫెసీ 2:12, 13). ఒకడు దేవుని నుండి దూరమైనప్పుడు దూరదేశమునకు పోయిన వాడవుతాడు.

సరదాగా, కులాసాగా జీవించే జీవితము కొంచెము కాలమే. ఒకడు జీవనోపాధిని సంపాదించుట కొరకు బాధ్యత వహించాలి. తప్పిపోయిన

కుమారుడు తన కుటుంబమునేగాక, తన జీవనోపాధిని. తండ్రి నేర్పిన వృత్తిని కోల్పోయాడు. కులాసా జీవితం గడిపితే, ధన నిధులు త్వరితంగా మాయమైపోతాయి. కరువు కాలములో పేదరికము తరుముకుంటు వచ్చును. పనిచేసి భౌతికాశీర్వాదములను పొందుటను గూర్చి అపొ.పౌలు నేర్పించాడు ( 2 థెస్స 3:10; I తిమో 5:8).

దేవుని యెడల భయము లేకుండుట వలన చిన్న కుమారుడు తప్పిపోయాడు. దేవుని యెడల, కుటుంబము యెడల, ఆయన నీతియెడల గౌరవము లేనందున అతడు నశించాడు. అతడు తన ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించాడు గనుక నశించాడు. అతడు తననుగూర్చియే గాని ఇంటిలో నున్న వారెవరిని గూర్చి ఆలోచించుకోలేదు.

తన దంతయు ఖర్చుచేసిన తరువాత అతడు పొలములలోనికి వెళ్లి పందులను మేపవలసి వచ్చినది. పంది అపవిత్ర జంతువు గనుక, యూదునికి యిది బహుఅవమాన కరమైన పని (లేవీ 11:7). యూదుడు పందులను మేపుట కంటే హేయమైన వృత్తి ఇంకొకటి యుండదు. హేయమైన తన కోరికలకు లొంగిపోయి నందున అతడు పందులు తినుపొట్టుతో తన ఆకలి తీర్చుకొనగోరే స్థితికి దిగజారవలసి వచ్చినది.

అయితే చివరకు తప్పిపోయిన కుమారుడు, తానున్న ఘోరదుస్థితిని గూర్చి గ్రహించుకొన్నాడు. తానున్న హేయమైన వాతావరణం, అల్లలాడుచున్న ఆకలి మొదలగువాటిని అతడు గ్రహించు కొన్నాడు. తన దీనస్థితికి తానే కారకుడనని గ్రహించుకొన్నాడు. తన పాపపుస్థితికి, తండ్రినుండి దూరమవుటకు తానే కారకుడు.

దుష్టత్వము వలన మనకు మనమే హానిచేసికోవచ్చును, మన పొరుగువారి యెడల ద్రోహము జరిగించవచ్చును గాని దేవునికి విరోధముగా మాత్రమే పాపము చేయుదుము. దీనిని గుర్తించుటే మారుమనస్సు యొక్క ముఖ్యలక్షణము. తన అయోగ్యతను గ్రహించుకొనిన వాడై, నీ కుమారులలో

ఒకనిగా యుండుటకు యోగ్యుడనుకానని ఒప్పుకుంటాడు. ఇట్టి ఒప్పుకోలు మారుమనస్సు యొక్క నిజమైన లక్షణము. పాపము చేయుట దేవునిపై తిరుగుబాటు చేయుటే. రాజైన దావీదుకూడ తన పాపమును గూర్చి ప్రశ్నించినప్పుడు, "నేను పాపము చేసితినని" ఒప్పుకున్నాడు (2 సమూ 12:13).

తప్పిపోయిన కుమారుడు మొదట్లో ఆస్థిలో తనకు వచ్చు భాగమిమ్మని కోరాడు గాని మారుమనస్సుపొంది నప్పుడు తండ్రియొక్క కూలివానిలో ఒకనిగా పెట్టుకోమని ప్రార్థించాడు. అతడు తిరిగి రాగా తండ్రి ప్రేమతోను, కృపతోను స్పందించాడు. కొడుకు తండ్రికి గొప్ప అన్యాయము చేసాడు, గాని తండ్రి అతనిని సంతోషముతో చేర్చుకొన్నాడు. తప్పిపోయిన కుమారుడు తిరిగి వచ్చినప్పుడు పొందిన స్వాగతం, మారుమనస్సు పొందిన పాపులను దేవుడు చేర్చుకొనే విధానాన్ని మనకు వర్ణించుచున్నది.

అతడు తిరిగి రాగా తండ్రి అతని మెడమీదపడి ముద్దులతో అతని నింపెను. ప్రతిరోజు అతని రాకకై తండ్రి వేచియుండేవాడు. మారుమనస్సు పొందే పాపిని దేవుడెట్లు చేర్చుకొంటారోగదా! చేతులుచాచి కౌగలించుకొని, పాపము లన్నిటిని మరచిపోయి ఆయన ఆహ్వానిస్తారు. ప్రశస్తమైన వస్త్రము ధరింప చేయుటద్వారా అతని కుమారత్వాన్ని హక్కులను తండ్రి అతనికి తిరిగి ప్రతిష్టించాడు. ఇంటిలో కుమారులు మాత్రమే జోళ్లు తొడుగుకుంటారు, దాసులు పాదరక్షలు ధరించరు! ఇట్లు తప్పిపోయిన వాడు కుమారునిగా పునఃప్రతిష్టింపబడ్డాడు. క్రొవ్విన దూడను వధించుట, సంతోషముతో సంబరము జరిపించుట ఇవన్నీ దానిలో భాగమే. క్రొవ్విన దూడ ప్రత్యేక దినము కొరకు ఉంచబడాలి (I సమూ28:24). ఒకడు దేవుని యొద్దకు తిరిగి వచ్చుట ప్రత్యేకమైనదే!

విచారం యేమంటే పడిపోయిన సహోదరులు తిరిగి వస్తే క్రైస్తవులు ఉత్సాహము చూపరు. నశించిన ఆత్మలు రక్షింపబడినప్పుడు పడిపోయిన సహోదరులు తిరిగి వచ్చినప్పుడు (యాకోబు 5:19-20), సంతోషించుటకు

గొప్ప అవకాశములున్నవి. మారుమనస్సు పొందిన వారి నెల్లప్పుడు స్వాగతించాలి (I యోహాను 4:8; 2 కొరింథీ 2:7). గాని క్రైస్తవులు తరుచు ఈ ఉపమానములోని పెద్దకుమారుని స్వభావమును కనుబరతురు.

పాపియైన వాడు పునరుద్ధరించబడతాడని కొందరు నమ్మరు. ఒకడు పాపములో పడిపోతే అతడెన్నడు రక్షించ బడలేదని వారనుకొంటారు. పాపములో పడిపోయినవారు దేవుని యొద్దకు తిరిగివచ్చిన సందర్భములనేకములు బైబిలు నందున్నవి. (అపొ.కా. 8:22; యాకో 5:19-20; యూదా:23). పడిపోయిన వాడు మారుమనస్సుపొంది దేవుని యొద్దకు తిరిగి రాగలడని ఈ ఉపమానము బోధించుచున్నది. దేవునిబిడ్డయైన వాడు పాపముచేస్తే తిరిగి రాలేడను సిద్ధాంతమును అది తిరస్కరించుచున్నది (లూకా 15:18-20; I యోహాను 1:9; 2:1-2; అపొ.కా. 8:18-24).

ఇప్పటి వరకు ఈ ఉపమానమంతయును తప్పిపోయిన కుమారుని గూర్చియుంటే, పెద్ద కుమారుని యొక్క దుష్టస్వభావము ఆశ్చర్యము కలిగించుచున్నది. నిజానికి శాస్త్రులు పరిసయ్యులు కూడ అతని గూర్చి ఆశ్చర్యపడిరి గాని సరదాపడలేదు. 25-32 వచనాలలో యేసు పెద్దకుమారుని తప్పుబట్టారు. పెద్దకుమారుని చిత్రములో శాస్త్రులు పరిసయ్యుల యొక్క కఠినస్వభావాన్ని, డంబాన్ని, స్వనీతిని ఆయన వారికి వర్ణించారు.

తండ్రి పెద్దకుమారుని బ్రతిమలాడాడు. అతడు తండ్రి యొద్దకు రాకపోయినను తండ్రే అతని యొద్దకు వెళ్లాడు. అతడు గమనించి యుండకపోయినను పెద్దకుమారుడు తన స్వాస్థ్యమును రెండంతలు అనుభవించుచున్నాడు. తండ్రి అతనితో, "కుమారుడా, నీ వెల్లప్పుడును నాతోకూడ ఉన్నావు; నావన్నియు నీవి" అని చెప్పెను (లూకా 15:31). అంతేకాదు తండ్రి తన కుమారుని, పెద్దవాడు తన తమ్ముని తిరిగిపొందారు. ఇంకేమికావాలి? ఈ ఉపమానములో తండ్రి పరలోకమందున్న తండ్రివలె తన దాతృత్వాన్ని ప్రదర్శించాడు. పెద్దవాడు ఎంత దుష్టుడైనను తండ్రి అతనికి తరుణమిచ్చి లోపలికి రమ్మని ప్రేమతో ఆహ్వానించాడు.

పెద్దవాడు తన పాపములో నిలిచియుండగానే ఈ ఉపమానము ముగియును. శాస్త్రుల యొక్కయు, పరిసయ్యుల యొక్కయు స్వభావము పెద్ద కుమారుని స్వభావమును పోలినది. పాపుల ఆత్మల విలువను గ్రహించకుండా నాటి మతనాయకులు తమ దురభిమాన ద్వేషములోనే యుండిపోయారు.

చిన్న కుమారుడు లోపలను పెద్ద కుమారుడు వెలుపలను యున్న వేళ తెరదించబడినది. పాపులు మారుమనస్సుపొంది యేసును అంగీకరించారు. శాస్త్రులు పరిసయ్యులు ఆయనను నిరాకరించారు.

## ముగింపు:

ఈ ఉపమానము మూడు అంచెలుగా యున్నది. గృహాన్ని నిరాకరించుట, గృహానికి తిరిగివచ్చుట, గృహములోనికి స్వాగతము. ఇంటిలోనే యుంటూ తప్పిపోయిన కుమారుడు అదనంగా మనకు కనబడ్డాడు. రకరకకాల పాపులున్నారని, రకరకాల కారణాలవలన వారు తప్పిపోయారని యేసు ఈ విధంగా చూపించారు.

మనం రక్షింపబడాలని దేవుడు కోరుచున్నారు. "ఎవడును నశింపవలెనని ఇచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని" ఆయన కోరుచున్నారు (2 పేతురు 3:9). అయోగ్యులమును, పాపులమునైన మనలను దేవుడు ప్రేమించుచున్నారు. మనలను మనము తగ్గించుకొనాలి, మారుమనస్సు పొంది ఆయన చెంతకు చేరాలి.

# 22.అన్యాయస్థుడైన గృహనిర్వాహకుడు

## (The unjust Steward)

లూకా 16:1-13

### పరిచయము:

లూకా 15లో యేసు మూడు ఉపమానములు చెప్పిన తరువాత మరికొన్ని ఉపమానములు చెప్పెను. సుంకరులను పాపులును ఆయన బోధవినుటకు ఆయన యొద్దకు వచ్చుచుండిరి (లూకా 15:1). ఆయన బోధించుచుండగా జనసమూహములో పరిసయ్యులు, శాస్త్రులు కూడ యుండేవారు. స్వనీతిపరులైన పరిసయ్యులు , శాస్త్రులకు ఒక పాఠముగా ఆయన లూకా 15లో యున్న ఉపమానములు చెప్పెను.

లూకా 16లో ఆయన తన శిష్యులకు ఈ ఉపమానము చెప్పెను. ఆయన చెప్పిన అన్యాయస్థుడైన గృహనిర్వాహకుని ఉపమానము వినిన తరువాత పరిసయ్యులు ఆయనను విమర్శించిరి. "ధనాపేక్షగల పరిసయ్యులు ఈ మాటలన్నియు విని ఆయనను అపహసించిరి" యని లూకా 16:14 చెప్పుచున్నది. ఈ ఉపమానములో దేవుని రాజ్యములో యున్న బాధ్యతలు, వాటి లెక్కలను గూర్చి ఆయన బోధించెను.

### ఉపమానము:

ఆయన ఇట్లు చెప్పెను. "ఒక ధనవంతుని యొద్ద ఒక గృహ నిర్వాహకుడుండెను. వాడతని ఆస్తిపాడు చేయుచున్నాడని అతనియొద్ద వానిమీద నేరము మోపబడగా అతడు వాని పిలిపించి-నిన్ను గూర్చి నేను వినుచున్న యీ మాటలేమిటి? నీ గృహనిర్వాహకత్వపు లెక్క అప్పగించుము; నీవు ఇకమీదట గృహనిర్వాహకుడవై యుండవల్లకాదని వానితో చెప్పెను. ఆగృహ నిర్వాహకుడు తనలోతాను-నా యజమానుడు ఈ గృహనిర్వాహకత్వపు

పనిలోనుండి నన్నుతీసి వేయును గనుక నేను ఏమి చేతును? త్రవ్వలేను, భిక్షమెత్తసిగ్గుపడు చున్నాను. నన్ను ఈ గృహ నిర్వాహకత్వపు పనిలోనుండి తొలగించునప్పుడు వారు నన్ను తమయిండ్లలోనికి చేర్చుకొనునట్లు ఏమి చేయవలెనో నాకు తెలియుననుకొని తన యజమాని ఋణస్థులలో ఒక్కొక్కని పిలిపించి-నీవు నాయజమానునికి ఎంత అచ్చియున్నావని మొదటి వాని నడిగెను. వాడు నూరుమణుగుల నూనె అని చెప్పగా-నీవు నీ చీటి తీసికొని త్వరగా కూర్చుండి ఏబది మణుగులని వ్రాసికొమ్మని వానితో చెప్పెను. తరువాత వాడు నీవు ఎంత అచ్చియున్నావని మరియొకని నడుగగా వారు నూరు తూముల గోధుమలని చెప్పినప్పుడు వానితో-నీవునీ చీటి తీసికొని యెనుబదితూములని వ్రాసి కొమ్మని చెప్పెను. అన్యాయస్థుడైన ఆ గృహ నిర్వాహకుడు యుక్తిగా నడుచుకొనెనని వాని యజమానుడు వానిని మెచ్చుకొనెను. వెలుగు సంబంధుల కంటె ఈ లోక సంబంధులు తమ తరమును బట్టి చూడగా యుక్తిపరులై యున్నారు. అన్యాయపుసిరివలన మీకు స్నేహితులను సంపాదించుకొనుడి; ఎందుకనగా ఆసిరి మిమ్మును వదిలిపోవునప్పుడు వారు నిత్యమైన నివాసములలో మిమ్మును చేర్చుకొందురని మీతో చెప్పుచున్నాను, మిక్కిలి కొంచెములో నమ్మకముగా ఉండువాడు ఎక్కువలోను నమ్మకముగా ఉండును. మిక్కిలి కొంచెములో అన్యాయముగా ఉండువాడు ఎక్కువ లోను అన్యాయముగా ఉండును. కాబట్టి మీరు అన్యాయపు సిరి విషయంలో నమ్మకముగా ఉండని యెడల సత్యమైన ధనమును ఎవరు మీ వశము చేయును? మీరు పరులసొమ్ము విషయములో నమ్మకముగా ఉండని యెడల మీ సొంతమైనది మీకు ఎవడిచ్చును? ఏ సేవకుడు ఇద్దరు యజమానులను సేవింపలేడు; వాడు ఒకని ద్వేషించి ఒకని ప్రేమించును, లేదా ఒకని అనుసరించి ఒకని తృణీకరించును; మీరు దేవునిని సిరిని సేవింప లేరని చెప్పెను" (లూకా 10:1-13).

## గృహనిర్వాహకుడు:

గృహనిర్వాహకుడనగా ఎవరో మనము మొదట తెలిసికొనవలెను.

వేరొకని ఆస్థియొక్క బాధ్యత అప్పగించబడినవాడు గృహనిర్వాహకుడు. ఆదికాండము 39లో యోసేపు ఒక గృహనిర్వాహకుడై యుండెను. "యోసేపు మీద పోతీఫరుకు కటాక్షము కలిగెను గనుక అతనియొద్ద పరిచర్య చేయువాడై యుండెను. అతడు తన యింటిమీద విచారణ కర్తగా అతని నియమించి తనకు కలిగిన దంతయు అతని చేతి కప్పగించెను...అతడు తనకు కలిగిన దంతయు యోసేపు చేతికప్పగించి తాను ఆహారము తినుట తప్ప తనకేమిఉన్నదో ఏమిలేదో విచారించినవాడు కాదు" (ఆదికా 39:4-6).

తన బిడ్డలందరు మంచి గృహ నిర్వాహకులై యుండాలని దేవుడు కోరు చున్నారు. "తగిన కాలమున ప్రతివానికి ఆహారము పెట్టుటకు యజమానుడు తనయింటివారి మీద నియమించునట్టి నమ్మకమైన బుద్ధిగల గృహనిర్వాకుడెవడు?" అని యేసు అడిగెను (లూకా 12:42). గృహ నిర్వాహకులు గొప్ప బాధ్యత అపగింపబడినవారు (లూకా 12:42-48). గృహనిర్వాహకుడు లెక్క అప్పగించు బాధ్యతగలవాడు (మత్త 25:34-40).

తమకు కలిగి యున్నది తమదికాదనే సంగతిని క్రైస్తవులు కూడ మరతురు. సమస్తము దేవునికి చెందినవే (కీర్తన 50:10-11; యెహెజ్కే 18:4). దేవుడు మన కనుగ్రహించిన దీవెనలకు మనము కేవలము గృహనిర్వాహకులమే.

ఈలోక సంపద అంతయు దేవునిదే (కీర్తన 20:1). అది మనకు చెందినది కాదు, కేవలము ఎరువుగా ఈయబడినదే. మంచి గృహ నిర్వాహకులుగా మనం బాధ్యత నిర్వహించాలి.

## అన్యాయస్థుడైన గృహనిర్వాహకుడు:

ఈ ఉపమానములో చెప్పబడినవాడు అన్యాయస్థుడు. అతని మీద అన్యాయముగా అపనింద మోపబడిన దనడానికి యేమీ అవకాశము లేదు. అతనిపై మోపబడిన నమ్మకాన్ని వమ్ము చేసారనడానికి సందేహాము లేదు.

అతని యజమాని ఆస్థి అతనికి అప్పగింపబడెను. యజమానునికి లాభము చేకూరేలాగున దానిని అతడు వినియోగించాలి. గాని అతడట్లు చేయలేదు.

I కొరింథీ 4:1–2లో సువార్తను గూర్చిన గృహనిర్వాహకత్వము మనకు అప్పగింపబడి యున్నదని పౌలు చెబుతాడు. "ఈలాగున క్రీస్తు సేవకుల మనియు, దేవునిమర్మముల విషయములో గృహనిర్వాహకులమనియు ప్రతిమనుష్యుడు మమ్మును భావింపవలెను. మరియు గృహనిర్వాహకులలో ప్రతివాడును నమ్మకమైన వాడై యుండుట అవశ్యము".

గృహ నిర్వాహకుడెవరో తెలిసికొనిన తరువాత ఈ ఉపమానములో యున్నవాడు అన్యాయస్థుడని, అవినీతిపరుడని మనం గ్రహించాలి. ఈ ఉపమానం అంతా ఇతనిచుట్టూనే యున్నది గనుక ఇతని గూర్చి మనకు ఇంకా ఎక్కువ చెప్పబడతాది. అతని యజమానియైన ధనవంతుడు తన పరిధిలో వ్యాపారము చేసికొనుచు యదార్థవంతునిగానే కనబడుచున్నాడు. ధనవంతుడైయుండుట పాపము కాదని మనం గుర్తుంచుకోవాలి. అయితే ధనవంతులు శోధనకు గురియగుదురని కూడ మనం తెలిసికోవాలి. అయితే ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను ఉరిలోను అవివేక యుక్తములను హానికరములైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానాభాదలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (I తిమో 6:9–10).

బైబిలులో నమ్మకమైన విశ్వాసులగు అబ్రాహాము, యోబు మొదలగు వారు ధనవంతులే.

ఈ అన్యాయస్థుడైన గృహ నిర్వాహకుడు తాను పట్టుబడ్డాడని ఎరుగును. మరియు మరికొంత కాలానికి తన ఉద్యోగము ఊడిపోవునని కూడ ఎరుగును. ఇట్లు ఉద్యోగమునుండి తీసివేయబడిన తరువాత వానికెవడు ఇంకో ఉద్యోగము

ఇయ్యడని కూడ అతడెరుగును. "నా యజమానుడు ఈ గృహనిర్వాహకత్వపు పనిలో నుండి నన్ను తీసివేయును గనుక నేనేమి చేతును? త్రవ్వలేదు, భిక్షమెత్త సిగ్గుపడుచున్నాను" అని అతడు తలంచెను (లూకా 16:3). అకస్మాత్తుగా అతనికొక అక్రమ ఆలోచన కలిగింది! తన యజమానికి అచ్చియున్న వారిని తానే మచ్చిక చేయదలచుకొన్నాడు. అప్పుడు తనకు ఉద్యోగము లేకున్నా, జీవనోపాధిలేకున్నా వారతనికి అతిథ్యమిత్తురు (లూకా 16:4). అట్లు ఈ గృహ నిర్వాహకుడు తన మోసపూరిత సంకల్పాన్ని అమలు పరచదలచాడు. తన యజమాని రుణస్థులు కూడ దానిలో ఇష్టపూర్వకముగా పాలి భాగస్థులవుదురనుకొన్నాడు. నిజానికి వారందుకు అంగీకరించారు (5-7) వచనములు).

అతని అక్రమ సంకల్పాన్ని యజమాని ఎరిగియుండినను అతడా గృహనిర్వాహకుని అభినందించాడు. అతడు చేసిన మోసమును కాదుగాని, తన అక్రమ క్రియల పర్యవసానమునుండి అతడు తప్పించుకొనిన విధానమును ఆ యజమానుడు అభినందించాడు. అతని దుష్టత్వాన్ని గాక, అతని తెలివి తేటలను అతడు అభినందించాడు. మోసపూరిత క్రియనుగాక, అతని ప్రజ్ఞను యేసు అభినందించారు. అతడు తన భవిష్యత్తుకొరకు సరిగ సిద్ధపడ్డాడు. మనం ఈ లోకంలో నిరంతరము ఉండబోము. గనుక భవిష్యత్తు కొరకు సరిగ సిద్ధపడాలి.

అతని ప్లాను చాల సులభమైనది. యజమాని రుణస్థుల రికార్డులను తారుమారుచేసి వారి కృతజ్ఞతను పొందగోరాడు. అతని ఉద్యోగము పోయిన తరువాత వారికి అతడు చేకూర్చిన అక్రమలాభాన్ని బట్టి తమ యిండ్లలోనికి అతనిని చేర్చుకొందురు. ఈ కుట్రను యజమానుడు తెలిసికొని అతనిపై ఆగ్రహము తెచ్చుకొనుటకు బదులు అన్యాయస్థుడైన ఆ గృహనిర్వాహకుడు యుక్తిగా నడుచుకొనెనని గ్రహించి అతని అభినందించెను. ఈ ఉదంతము లోని వ్యక్తులందరు అక్రమ కారులే. గృహనిర్వాహకుడు అన్యాయస్థుడు. అతడు క్రమ క్రమముగా తన యజమాని సొమ్ము దొంగిలించుచువచ్చాడు.

పట్టుబడిన తరువాత కూడ అబద్ధములాడుచు తప్పించుకొనజూచాడు. రుణపడినవారు కూడ అన్యాయస్థులే. తాము అచ్చియున్న యజమానిని మోసము చేయుటకు గృహనిర్వాహకునితో చేతులు కలిపారు. తప్పు లెక్కలు వ్రాసుకున్నారు. యజమాని కూడ చేతివాటముగలవాడే. గృహనిర్వాహకుడు తననే మోసము చేయుచుండినా అతని కుయుక్తిని అభినందించాడు.

8వ వచనంలో ఆధనవంతుడు తన గృహనిర్వాహకుని తెలివితేటలను మెచ్చుకొన్నాడు. లేఖనాలలో మరొకచోట విభిన్న రీతిలో ఒక తారతమ్యాన్ని గూర్చిచెప్పారు. "ఇదిగో తోడేళ్ల మధ్యకు గొర్రెలను పంపినట్లు నేను మిమ్మును పంపుచున్నాను గనుక పాములవలె వివేకులును పావురములవలె నిష్కపటులునై యుండుడి" యని ఆయన చెప్పారు (మత్తయి 10:16). సాధారణంగా మనం పాముల గుణగణాలను గూర్చి ఆలోచించము. తదుపరి పాములకు పావురములకు యున్న సంబంధాన్ని మనము ఊహించు కొనలేము. అవి రెండు ఒక దాని కొకటి పొసగవు. లూకా 16:8లో ఆఖరి భాగమున , ఈ ఉపమానము ద్వారా మనము నేర్చుకొన దగిన పాఠమున్నది. "వెలుగు సంబంధులకంటె ఈ లోక సంబంధులు తమ తరమును బట్టి చూడగా యుక్తి పరులై యున్నారు" ఈ ఉపమానములో జరిగించబడిన అన్యాయమును కాదుగాని, ఒక పని జరిగించుటలో యున్న ఆతురతను, శ్రద్ధను గూర్చి మనము నేర్చుకొనాలి. ఈ లోకములో విజయవంతులైన వ్యాపారుల వివేకమును, శ్రద్ధను, దూరచూపును చూచి మనము నేర్చుకొనాలని యేసు యొక్క ఉద్దేశ్యమై యున్నది.

క్రైస్తవులు క్రైస్తవ్యమును వ్యాప్తి చేయుటకు కలిగిన శ్రద్ధ భక్తుల కంటె ఈలోకస్థులు ధనార్జన చేయుటకు చూపించు శ్రద్ధ భక్తులు అధికమైనవి. గృహ నిర్వాహకుడు తన భవిష్యత్తును భద్రము చేసికొనుటకు కుటిల ప్రయత్నము లన్నీ చేసాడు; యుక్తి గల ఈ చోరునితో రుణస్తులు కూడ తమ చేతులు కలిపారు; ధనవంతుడైన యజమాని కూడ జరుగుతున్న అక్రమాన్ని గూర్చి పట్టించుకోనట్లున్నాడు. లోకస్థులు తమ వ్యాపారము నిమిత్తము

కలిగియున్న శ్రద్ధను, దేవుని రాజ్య విస్తరణ పనిలో క్రైస్తవులు కలిగియుంటే ఈ లోకములో ఎంత తేడా కన్పించునో గదా!

యిది ఎంత నిజము! మనము దేవుని బిడ్డలము (వెలుగు సంబంధులము). అయినను మనకు కావలసినదానిని గూర్చి (పరలోక గృహమును గూర్చి) ఈ లోకస్థులు తమకు కావలసిన వాటిని గూర్చి చూపించు విజ్ఞతను కూడ మనము కలిగియుండము. ఆత్మీయ విషయాలలో మనము కనుబరచు జ్ఞానము కంటె ఈ లోకస్థులు భౌతిక విషయాలను గూర్చి ప్రదర్శించు జ్ఞానము గొప్పది.

లూకా 16:9లో యేసు అసంభావ్యమైన హెచ్చరిక ఇచ్చుచున్నట్లుగు పడుచున్నది. "అన్యాయపు సిరివలన మీకు స్నేహితులను సంపాదించుకొనుడి. ఎందుకనగా అసిరి మిమ్మును వదలిపోవునప్పుడు వారు నిత్యమైన నివాసములలో మిమ్మును చేర్చుకొందురని మీతో చెప్పుచున్నాను". సిరి అనగా ధనము. ధనము పాపము కాదు, పాపము చేయదు. గాని పాపము చేయుటకు ధనము వినియోగించబడును.

'అన్యాయపుసిరి' అనగా మన చేతికి అప్పగింపబడిన ధనము. దేవుని బిడ్డల చేతికి అప్పగింపబడిన ధనమును వారు తమ నిత్య నివాసము కొరకు వివేకముతో వెచ్చించాలి. తాత్కాలికమైన ఈలోక సంపద నిత్యసంపద ఇక్కడ పోలికగా చెప్పబడినవి. "భూమిమీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును. దొంగలు కన్నము వేసి దొంగి లిదెరు. పరలోకమందు మీకొరకు ధనము కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెట యైనను, తుప్పైనను దాని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధనమెక్కడ నుండునో అక్కడనే నీ హృదయముండును" (మత్తయి 6:19-21).

లూకా 16:9లో మానవులందరు సిద్ధపడినను, సిద్ధపడక పోయినను ఎదుర్కొన వలసిన మరణమును గూర్చి ఉచ్చరించడమైనది. "ఆసిరిమిమ్మును

వదలిపోవునప్పుడు" అను మాటలు మీకు మరణము సంభవించు నప్పుడు అని చదువుకొనవచ్చును.

లూకా 16:10-12 వచనాలలో తమకు అప్పగించబడిన ఆర్థిక బాధ్యతలను శ్రద్ధతో నిర్వహించుచు పరలోక నివాసము కొరకు సిద్ధ పడాలని యేసు తన శిష్యులను ప్రోత్సహించారు. 13వ వచనములో ఒక దానితో నొకటి పొసగని జీవన విధానమును గూర్చి చెప్పబడినది. ఒకడు దేవునిని, సిరిని సేవింపలేడు. ఇందులో మధ్యస్థ స్థితి యేమీ లేదు. ఏ సేవకుడు ఇద్దరు యజమానులను సేవింపలేడు; వాడు ఒకని ద్వేషించి ఒకని ప్రేమించును, లేక ఒకని అనుసరించి ఒకని తృణీకరించును. మీరు దేవునిని సిరిని సేవింపలేరని" యేసు చెప్పెను (లూకా 16:13).

యేసు ప్రభువు ఈ ఉపమానము చెప్పిన వెంటనే పరిసయ్యులు ఆయనను అపహసించిరి (16:14). పరిసయ్యులు ధనాపేక్షగలవారు గనుక ఆయన చెప్పిన ఉపమానము వారికి గుచ్చుకొన్నది.

## ముగింపు:

ధనాపేక్షను గూర్చి హెచ్చరించుటకు ప్రాధమికముగా ఈ ఉపమానము చెప్పబడినది. మరియు ఆర్థిక సంబంధమైన దీవెనలు పరలోక నివాసము కొరకు వివేక విజ్ఞతతో వినియోగించాలి.

యేసు ఈ ఉపమానమును తన శిష్యులకు చెప్పెను గాని పరిసయ్యులు కూడ దానిని వినుచుండిరి. రెండు సంగతులు ఆయన బోధింప గోరారు. 1) తరుణములను జ్ఞానయుక్తముగా వాడుకోవాలి. 2) ధనపేక్ష, లోభత్వము వలన ప్రమాదము కలుగును. విశ్వాసులు సరియైన మనస్తత్వము కలిగి తమధనాన్ని లోక వ్యాపారులవలె జ్ఞానముగా వినియోగించిన యెడల, దేవుని రాజ్యముకొరకు వారు ఎక్కువ చేయగలరు.

# 23. ధనవంతుడు, లాజరు

## (The Rich man and Lazarus)

లూకా 16:19-31

**పరిచయము:**

ధనవంతుడు, లాజరును గూర్చిన సందర్భము ఉపమానమా? కాదా? యని బోధకులు, లేఖకులు తర్కించుకొంటారు. అది లూకా సువార్తలో మాత్రమే కన్పడును. అది ఉపమాన మైనను కాకపోయినను యేసు చెప్పిన మాటలు ఉపమానాత్మకమైనవి, చారిత్రాత్మకమైనవి మరియు వర్ణనాత్మకమైనవి.

యేసు చెప్పిన ఉపమానములలో వలె గాక దీనిలో వ్యక్తులపేర్లు చెప్పబడినవి. లాజరు, అబ్రాహాము, ధనవంతుడు మొదలగువారు యదార్థముగా జీవించిన వ్యక్తులు. ధనవంతుడు, లాజరు యొక్క కథనము ద్వారా యేసు ప్రాముఖ్యమైన దైవిక సత్యమును బయలుపరచెను. యేసు చెప్పిన ఈ మాటలు పరిసయ్యులు, సుంకరులు, పాపులు శిష్యులు అందరు వినిరి (లూకా 16:1; 17:1).

దేవునివలన మనకు అనుగ్రహించ బడిన ధనమును సద్వినియోగము చేయాలి అను అంశము ఈ ఉపమానము యొక్క ముఖ్య ఉద్దేశ్యమై యున్నది. ధనాపేక్ష గల పరిసయ్యుల యొక్క అపహాస్యమునకు జవాబుగా యేసు ఈ ఉపమానము చెప్పెను (లూకా 16:14-15).

ధనవంతుడు, లాజరు యొక్క కథనము మూడు దశలుగా యేసు వివరించారు. మొదటిది, వీరిద్దరు భూమిమీద నివసించిన దృశ్యము. రెండవది ఈ యిద్దరు మనుష్యుల యొక్క మరణము, మూడవది మరణమైన తరువాత వారిద్దరి స్థితి.

## ఉపమానము:

"ధనవంతుడొకడుండెను. అతడు ఊదారంగు బట్టలును సన్నపునార వస్త్రములును ధరించుకొని ప్రతిదినము బహుగా సుఖపడుచుండువాడు. లాజరు అను ఒక దరిద్రుడుండెను. వాడు కురుపులతో నిండినవాడై ధనవంతుని యింటి వాకిటపడియుండి అతని బల్లమీద నుండి పడు రొట్టె ముక్కలతో ఆకలి తీర్చుకొనగోరెను; అంతే కాక కుక్కలు వచ్చి వాని కురుపులు నాకెను. ఆ దరిద్రుడు చనిపోయి దేవదూతల చేత అబ్రాహాము రొమ్మున ఆనుకొనుటకు కొనిపోబడెను. ధనవంతుడు కూడ చనిపోయి పాతిపెట్టబడెను. అప్పుడతడు పాతాళములో బాధపడుచు, కన్నులెత్తి దూరమునుండి అబ్రాహామును అతని రొమ్మున ఆనుకొనియున్న లాజరునుచూచి, తండ్రివైన అబ్రాహామా, నాయందు కనికరపడి తన వ్రేలి కొనను నీళ్లలో ముంచినా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపుము. నేను ఈ అగ్ని జ్వాలలలో యాతన పడుచున్నానని కేకలు వేసి చెప్పెను. అందుకు అబ్రాహాము కుమారుడా–నీవు నీజీవితకాలమందు నీకిష్టమైనట్టు సుఖము అనుభవించితివి, ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపకము చేసికొనుము; ఇప్పుడైతే వాడిక్కడ నెమ్మది పొందుచున్నాడు, నీవు యాతనపడుచున్నావు. అంతేకాక ఇక్కడనుండి మీ యొద్దకు దాటగోరువారు దాటి పోజాలకుండునట్లును, అక్కడివారు మా యొద్దకు దాటి రాజాలకుండునట్లును, మాకును మీకును మహా అగాధముంచబడి యున్నదని చెప్పెను. అప్పుడతడు–తండ్రీ ఆలాగైతే నాకయిదుగురు సహోదరులున్నారు. వారును ఈ వేదనకరమైన స్థలమునకు రాకుండ వారికి సాక్ష్యమిచ్చుటకై నాతండ్రి యింటికి వాని పంపవలెనని నిన్ను వేడుకొనుచున్నాననెను. అందుకు అబ్రాహాము వారియొద్ద మోషేయు ప్రవక్తలును ఉన్నారు; వారి మాటలు వినవలెనని అతనితో చెప్పగా, అతడు తండ్రివైన అబ్రాహామా, ఆలాగు అనవద్దు; మృతులలోనుండి ఒకడు వారియొద్దకు వెళ్లిన యెడల వారు మారుమనస్సు పొందుదురని చెప్పెను. అందుకతడు మోషేయు ప్రవక్తలును చెప్పినమాటలు వారు వినని యెడల

మృతులలోనుండి ఒకడు లేచినను వారు నమ్మరని అతనితో చెప్పెను" (లూకా 16:19-31).

ధనవంతుడు, బీదవాడైన లాజరు యొక్క జీవితములు ఈలోకములో యుండగా వేర్వేరుగా యుండెను. ఎలియేజరు అను హెబ్రీ పదము గ్రీకులో లాజరు అని చెప్పబడినది. ఊదా రంగు వస్త్రములు రాజ వంశస్థులు, బహుధనవంతులు ధరించేవారు. లూదియ ఊదా రంగు పొడిని అమ్మేది. సైనికులు యేసును సిలువవేయక ముందు ఆయనకు ఊదారంగు వస్త్రములు ధరింప జేసి యూదుల రాజని హేళన చేసిరి (మార్కు 15:17-20).

మానవులు ఈలోకంలో జీవించుచుండగా చాలమట్టుకు తమ జీవితములను తాము నడుపుకోగలరు. మరణమయితే ఎవడును ఆపజాలని ఒక యదార్థము. మరణమునకు అందరు గురియవుదురు (హెబ్రీ 9:27). గొప్ప తీర్పుదినమునకు ముందు మరణమైన తరువాత వారి యాత్మలు ఎక్కడకు పోవునో యేసు మనకు బయలు పరచారు. ఆయన పరమునుండి వచ్చారు గనుక మరణానంతర జీవితమును గూర్చి ఆయన ఒక్కడు మాత్రమే చెప్పగలరు.

ఈ ఉపమానములో పరిచయము చేయబడిన ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరణించిన తరువాత వారిద్దరి పరిస్థితులు తారుమారైనవి. మరణించగా లాజరును ఎవరు ఘనంగా పాతిపెట్టలేదు. గాని బహుశ దనవంతుని అంత్యక్రియలు ఆర్భాటముగా జరిగియుండవచ్చును. మరణించిన తరువాత వారిద్దరు ఇకలేకుండా పోలేదు. మరణమైన తరువాత కూడ వారిద్దరు స్మృతికలిగి వివేక యుక్తముగానే యుండిరి.

తదుపరి ధనవంతుడు లాజరు యొక్క ఆత్మలు మృతుల లోకములో భిన్న స్థానములలో యుండెను. ధనవంతుని ఆత్మ నశించిన వారి స్థానములోను, లాజరు యొక్క ఆత్మ రక్షించబడినవారి స్థానములోను యుండెను. నిజానికి ఈలోకంలో గాని రాబోవు లోకములోగాని యుక్తవయస్సు

గలవారందరు వుండు రెండే రెండు ఆత్మీయ స్థితులున్నవి. భూమిమీద మనము అంధకార రాజ్యములో గాని లేక వెలుగు రాజ్యములో గాని యుందుము. (కొలస్స 1:13; I పేతురు 2:9). మరణమైన తరువాత మనము కటికచీకటి గల బిలములో (Tartarus) గాని పరదైసులో (Paradise) గాని యుందుము. (లూకా 23:43). మంతుల లోకములో ఈ రెండే స్థావరములున్నవి. గొప్ప తీర్పు జరిగిన తరువాత, ఆత్మలు నిత్య నరకములోగాని నిత్య జీవములో గాని ప్రవేశించును. మరణమైన తరువాత చెడ్డవారి గతి మంచివారి గతి మార్పులేనిదై నిత్యము వుండును. ఈ రెండికి మధ్యస్థ స్థితియేమీ లేదు.

ధనవంతుడు మరణించిన వెంటనే యాతనపడు ప్రదేశమునకు కొనిపోబడెను. అది నిత్యనరకము కాదు. అతడు ధనవంతుడైనందుకే అట్లు శిక్షింప బడలేదు. అబ్రాహాము కూడ ధనవంతుడే. ఈ ధనవంతుడు ఇష్ట పూర్వక ముగా లాజరుకు అన్యాయము చేసియుండలేదు. అతని గుమ్మము దగ్గరనుండి లాజరును తోలివేయలేదు. గాని అతడు చేసిన పాపమేమిటి? అతడు ఉదాసీనత గలవాడు, స్వార్థపరుడు!

లాజరు చనిపోయి అబ్రాహాము రొమ్మున అనుకొనుటకు కొనిపోబడెను. భూమిమీద యున్నపుడు అబ్రాహాము పశువులను మందలను గొప్ప ఆస్థిని కలిగియుండెను. ధనము కాదుగాని ధనాశ మానవుల ఆత్మలను నాశనము చేయును (I తిమో 6:6-10). ధనవంతునిధనము అతడు నశించుటకు ఎట్లు కారణము కాదో బీదవాడైన లాజరు యొక్క బీదతనము పరదైసుకు కారణము కాదు.

మరణమైన తరువాత ధనవంతుని యొక్కయు, లాజరు యొక్కయు పరిస్థితులు తారుమారాయెను. ధనవంతుడు భిక్షగాడయ్యాడు. మొదట తాను ఇప్పుడు యాతనపడుచున్నానని మనవి చేసెను. సహాయము కొరకు ప్రార్థించెను. తదుపరి తన సహోదరులను మార్చుటకు అసాధారణమైన కోరిక కోరెను. తనకు నిరాకరించబడిన సహాయము తన సహోదరులకు చేయాలని

కోరాడు. ఈ రెండు విషయాల్లోను అతని మనవి నిరాకరించబడెను. తన సహోదరుల యొద్ద "మోషేయు ప్రవక్తలును ఉన్నారని" చెప్పబడెను (లూకా 16:29). మరణించిన తరువాత నశించిన వారు తమవారు కూడ నశించాలని కోరుకొనరు.

ధనవంతుడు లాజరు యొక్క సందర్భము అనేక సంగతులను గూర్చి మనకు తెలియజేయుచున్నది. దేవుని లేఖనములు మృతులలోనుండి లేచిన వారి మాటకంటె శక్తివంతమైనవి. మరణమైన తరువాత మారుమనస్సు పొందినా ప్రయోజనముండదు. మోషే యొక్కయు, ప్రవక్తల యొక్కయు ఉపదేశమును యేసు ఆమోదించారు (లూకా 16:29-31). మరణించిన వారు తమ జ్ఞాపకాలను కలిగేయుందురు. మరణము స్మృతిని నాశనం చేయలేదు, గుర్తింపును రద్దుచేయదు. జ్ఞాపకము చెరిగిపోదు, గమ్యమును మార్చలేదు.

## ముగింపు:

ఈలోక జీవిత తారతమ్యములు ధనవంతుడు, లాజరు యొక్క సందర్భములో విపులంగా చిత్రీకరించబడినవి. ధనవంతుడు ఊదారంగు వస్త్రములను ధరించుకొనగా, లాజరు కురుపులతో నిండియుండెను. ఒకడు సమృద్ధిలో యుండగా రెండవవాడు అతని బల్లమీదనుండి పడు రొట్టెముక్కల కొరకు ఎదురు చూచుచుండెను. ధనవంతుని ప్రతి కోరిక తీర్చుటకు అనేకమంది సేవకులుండగా, రెండవవాని బాధను కుక్కలు నివృత్తి చేయుచుండెను.

ధనవంతుని, లాజరును ఎవరు వేరు చేసిరి? వారిద్దరి మధ్య యున్న అగాధమును ఎవరు నిర్ణయించిరి? భూమిమీద తమ జీవన విధానమును బట్టి తమకు తామే వేరుచేసి కొనిరి. భూమిమీద యున్నపుడే వారిద్దరిమధ్య అగాధముండెను. మరణములో అది మార్పు చేయబడలేదు, నిత్యమూ ఆయగాధ ముండును.

ధనవంతుడు నిత్యత్వము కొరకు సిద్ధపడలేదని మరణించిన తరువాత గ్రహించాడు. అతని అడుగుజాడలలో యున్న తన కుటుంబస్థులు కూడ చివరకు యాతన పడు ప్రదేశమునకు చేరుకొందురని గ్రహించుకొన్నాడు. తన కొరకు, తన సహోదరుల కొరకు అర్థించాడు (లూకా 16:24, 27). గాని నిరాకరించబడ్డాడు. నిత్యత్వమును గూర్చి నీవు ఆలోచించావా? దానిని గూర్చి తగిన విధముగా సిద్ధపడ్డావా? ( 2 కొరింథీ 13:5).

# 24. అన్యాయస్థుడైన తీర్పరి

## (The unjust Judge)

లూకా 18:1-8

### పరిచయము:

దేవుని రాజ్యమెప్పుడు వచ్చునని పరిసయ్యులు విమర్శనాత్మకముగా యేసును ప్రశ్నించిరి (లూకా 17:20). అందుకాయన "దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు. ఎందుకనగా ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది. గనుక ఇదిగో ఇక్కడనని, అదిగో అక్కడ నని చెప్ప వీలుపడదని వారికి ఉత్తర మిచ్చెను" (లూకా 17:20-21).

22-37 వచనములలో శిష్యులకు యేసు తన రెండవ రాకడను గూర్చి వివరించెను. తదుపరి వారికి అన్యాయస్థుడైన తీర్పరిని గూర్చిన ఉపమానము చెప్పెను. దీనిలో ముఖ్యపాత్ర తీర్పరిదికాదు గాని, విసుగక నిత్యము ప్రార్థన చేయు విధవరాలిది. ఈ తీర్పరి తప్పనిసరి పరిస్థితుల్లో తీర్పు తీర్చును గాని దేవుడైతే తన చిత్త ప్రకారము త్వరలో తీర్పు తీర్చును.

ఈ ఉపమానములోని తారతమ్యము యిది. అన్యాయస్థుడైన తీర్పరి ఒకడు తనను విసికించు విధవరాలికి తీర్పు తీర్చిన యెడల నీతిమంతుడైన దేవుడు తనకు విజ్ఞాపన చేయువారికి తప్పక తీర్పు తీర్చును.

ఈ ఉపమానము ప్రార్థనను గూర్చి చెప్పబడినది. యేసు యొక్క గొప్ప సువార్త పరిచర్య ప్రార్థనతో ఆరంభింపబడెను. యేసు బాప్తిస్మము పొందినప్పుడు ప్రార్థన చేయుచుండగా పరిశుద్ధాత్మ ఆయనపై దిగినట్లు లూకా వ్రాసాడు (లూకా 3:21). ఆయన 12 మంది శిష్యులను ఏర్పరచుకొనకముందు రాత్రంతయు ప్రార్థనలో గడిపెను (లూకా 6:12-13). కైసరుదైన ఫిలిప్పయిలో పేతురు ఒప్పుకోలు చేయకముందు ఆయన

ప్రార్థన చేయుచుండెను (లూకా 9:18). యేసుకొండ మీద రూపాంతరము పొందినప్పుడు ప్రార్థన చేయుచుండెనని కూడ లూకా వ్రాసాడు. (లూకా9:28). ప్రార్థించుచున్న యేసుయొక్క చిత్రము లూకాకును ఆదిమ సంఘముకును ప్రాముఖ్యము యేసు ప్రార్థించవలసివస్తే, ఆదిమ సంఘము ప్రార్థించవలసివస్తే మనకు ప్రార్ధన ఇంకెంత అవుసరము!

ఈ ఉపమానము, పరిసయ్యుడు సుంకరి యొక్క ఉపమానము లూకా సువార్తలో మాత్రమే కన్పడును. అవి చెప్పబడకముందు వాటి ప్రయోజనము కూడా ముందుగానే ఈ రెంటిలోను చెప్పబడెను. ఇవి రెండు ప్రార్ధనను గూర్చి చెప్పబడిన ఉపమానములు.

## ప్రార్ధన యొక్క ఆవశ్యకత:

క్రైస్తవ జీవితములో ప్రార్థన అత్యవసరమైనది, అది దైనందిన అలవాటు. ప్రార్థన ఫలితము కొరకు మనము దిగువ సంగతులను గమనించాలి: 1) దేవుడు మన ప్రార్థనలను షరతులతో వినును-ఆయన మాటలు వినువారి మాటలను ఆయన వినును (లూకా 6:46; మత్త 7:21; సామె 28:9). 2) సరియైన ఆత్మ కలిగి ప్రార్థించాలి (లూకా 22:42; ప్రక 22:17) 3) విశ్వాసముతో ప్రార్థించాలి (యాకో 1:5-8), 4) ఆయన చిత్త ప్రకారము ప్రార్థించాలి (I యోహా5:14, లూకా 22:41, 42) 5) నీతిమంతుల ప్రార్థన ఆయన వినును (I పేతురు 3:12). 6) క్షమించు వారి ప్రార్థన ఆయన వినును (మత్తయి 6:12-15 7) పాపుల మనవి ఆయన ఆలకింపడు (యోహా 9:31; కీర్త 66:18).

## ఉపమానము:

“వారు విసుగక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను. దేవునికి భయపడకయు, మనుష్యులను లక్ష్య పెట్టకయు నుండు ఒక న్యాయాధిపతి యొక పట్టణములో యుండెను.

ఆ పట్టణములో ఒక విధవరాలుండెను. ఆమె అతని యొద్దకు తరుచుగా వచ్చి–నా ప్రతివాదికిని నాకును న్యాయము తీర్చుమని అడుగుచు వచ్చెనుగాని అతడు కొంతకాలము ఒప్పకపోయెను. తరువాత అతడు–నేను దేవునికి భయపడకను మనుష్యులను లక్ష్యపెట్టకయు ఉండినను ఈ విధవరాలు నన్ను తొందర పెట్టుచున్నది గనుక ఆమె మాటిమాటికి వచ్చి గోజాడకుండునట్లు ఆమెకున్యాయము తీర్తునని తనలో తాననుకొనెను. మరియు ప్రభువిట్లనెను– అన్యాయస్థుడైన అన్యాయాధిపతి చెప్పినమాట వినుడి. దేవుడు తాను ఏర్పరచుకొనినవారు దివారాత్రులు తన్నుగూర్చి మొర్ర పెట్టుకొనుచుండగా వారకి న్యాయము తీర్చడా? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును, వారి విషయమే గదా ఆయన దీర్ఘశాంతము చూపుచున్నాడని మీతో చెప్పుచున్నాను. అయినను మనుష్యకుమారుడు వచ్చునప్పుడు ఆయన భూమిమీద విశ్వాసము కనుగొనునా?" (లూకా 18:1–8).

ఈ ఉపమానము యొక్క ఆరంభములోనే అదిదేని నిమిత్తము చెప్పబడు చుండెనో తెలియజేయబడెను. వారు విసుగక నిత్యము ప్రార్థన చేయుచుండవలెను. అందువలన ఈ ఉపమానములో తదుపరి సంగతులన్నీ ఎడతెగక ప్రార్థన చేయవలసినదను సంగతిపై ఆధారపడియే యున్నవి. ఇందులో ముఖ్య పాత్ర తీర్పరిదికాదు గాని, అతనిని గోజాడు విధవరాలిదే. తీర్పరి విజ్ఞాపనలను విను దేవునికి సాదృశ్యముగా యున్నాడు. ఈ న్యాయాధిపతివలెగాక దేవుడు ప్రార్థనలను ప్రోత్సహించును, ప్రార్థించాలని కోరును. మరియు న్యాయాధిపతియు దేవుడును చలించు కారణములు వేర్వేరుగ యుండును.

ఈ ఉపమానములో పరిచయము చేయబడిన న్యాయాధిపతి ఒక్కడే. అతడు బహుశా రోమియోడై యుండవచ్చును. అతడు దేవునిని మనుష్యులను కూడ లక్ష్య పెట్టువాడు కాడని పరిచయం చేయబడినది. దేవునికి భయపడనివాడు సహజముగా మనుష్యులను కూడ లక్ష్యపెట్టడు (కీర్తన 14:1;

రోమా 3:5-18). అతని కనుగ్రహింపబడిన స్థానమునకు అతడు అర్హుడు కాడు.

తదుపరి ఒక విధవరాలు పరిచయం చేయబడినది. చట్టప్రకారము ఆమె న్యాయమును కోరినది. అయితే పొరబాటు న్యాయవ్యవస్థలో గాక న్యాయాధిపతిలోనే యుండెను. ఆమె యొక్క సమస్య యదార్థమైనదే. ఆమె తన ప్రతివాదికిని తనకును న్యాయము తీర్చుమని అతని అభ్యర్థించుచు వచ్చినది. యూదా మతము ద్వారా దేవుడు విధవరాండ్రకు, అనాథలకు ప్రత్యేకమైన భద్రత ఏర్పాటుచేసెను (ద్వితీ 10:18, 14:29; 24:17, 19-21; 26:12-13; కీర్త 68:5; 146:9; సామె 15:25; యెషయా 1:17; యిర్మి 22:3; మలాకీ 3:5). "విధవరాలినైనను దిక్కులేని పిల్లలనైనను బాధపెట్టకూడదు. వారు నీచేత ఏవిధముగానైనను బాధనొంది నాకు మొఱ పెట్టినయెడల నేను నిశ్చయముగా వారి మొరను విందును. నా కోపాగ్ని రవులుకొని మిమ్మును కత్తిచేత చంపించెదను, మీ భార్యలు విధవరాండ్రగు దురు, మీ పిల్లలు దిక్కులేని వారగుదురు" (నిర్గమ 22:22-24).

ఈ న్యాయాధిపతి ఆమె చేత విసిగించబడినందున ఆమెకు చివరకు తీర్పు తీర్చెదననుకొన్నాడు. అతడు దేవునికి భయపడువాడు కాదు (లూకా 18:4). మనుష్యులను లక్ష్య పెట్టువాడుకాదు, అతడు న్యాయవంతుడైనందున చివరకు తీర్పుతీర్చలేదుగాని, ఆమెచేత ఇంక విసిగించబడకుండుటకు తీర్పు తీర్చెను (లూకా 18:5).

లూకా 18:6-8లో యేసు అన్యాయస్థుడైన న్యాయాధిపతికిని పరమందున్న తండ్రికిని యున్న తారతమ్యము చూపించెను. న్యాయాధిపతి అయిష్టముగా నే చలించినను, దేవుడు తన్ను ఏర్పరచుకొనిన వారికి సంతోషముతో, యిష్టపూర్వకముగా న్యాయము తీర్చును. దేవుడు తనవారి ప్రార్థనలకు ఉదాసీనుడు కాదు. సరిగదా ప్రార్థనలకు జవాబిచ్చువాడు. "ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును; వారి విషయమే గదా ఆయన దీర్ఘశాంతము

చూపుచున్నాడని" 8వ వచనములో ఆయన చెప్పెను. ప్రార్థన ఎడతెగక యుండాలి. ఈ ఉపమానము యొక్క ముఖ్య ఉద్దేశ్యము అదే.

బైబిలు గ్రంథ మంతటిలోను ప్రార్థనను గూర్చి చెప్పబడినది. దిగువ కొన్ని రిఫరెన్సులు ఇయ్యబడినవి.

"భక్తిహీనులు అర్పించు బలులు యెహోవాకు హేయములు, యదార్థవంతుల ప్రార్థన ఆయనకు ఆనందకరము" (సామె 15:8)

"భక్తిహీనులకు యెహోవా దూరస్థుడు, నీతమంతుల ప్రార్థన ఆయన అంగీకరించును" (సామె 15:29).

"నేను మీతో చెప్పనదేమనగా పరలోకమందున్న మీతండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి" (మత్తయి 5:44).

మత్తయి 7:11లో ఇహలోక తండ్రికి పరలోక తండ్రికి యున్న తారతమ్యము చూపించబడినది. "మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి ఈవుల నియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును" (మత్తయి 7:10-11).

# 25. పరిసయ్యుడు - సుంకరి

## (The Pharisee and the Publican)

లూకా 18:9-14

**పరిచయము:**

పరిసయ్యుడు-సుంకరి యొక్క ఉపమానము లూకా సువార్తలో మాత్రమే లిఖించబడియున్నది. అన్యాయస్థుడైన న్యాయాధిపతిని గూర్చిన ఉపమానము చెప్పబడిన వెనువెంటనే యిది మనకు కనబడును. ఈరెండు ఉపమానముల ముఖ్యాంశము, ప్రార్థనయై యున్నది. మొదటిది ప్రార్థన మనస్ఫూర్తిగా, విసుగక చేయవలెనని బోధించితే యిది, ప్రార్థన వినయముతో యుండాలని బోధించుచున్నది. "తామే నీతిమంతులమని తమ్ము నమ్ముకొని యితరులను తృణీకరించు కొందరితో" యేసు ఈ ఉపమానము చెప్పెను (లూకా 18:9).

ఇద్దరు వ్యక్తులు ముఖ్యముగా ఈ ఉపమానములో మనకు కనబడుదురు. పరిసయ్యుడు, సుంకరి.

'పరిసయ్యుడు' అనగా ప్రత్యేకింపబడినవాడని అర్థము. ఈ గుంపు పాత క్రొత్త నిబంధనల మధ్య కాలములో యూదులలో ఉద్భవించిరి. హెబ్రీయులు గ్రీకు సాంప్రదాయము ననుసరించుటను వీరు వ్యతిరేకించిరి. యేసు కాలములో ఇంచుమించు 6000 మంది పరిసయ్యులుండిరి. వారు యూదామతమును గూర్చి నిష్టగలవారే అయినను (అపొ.కా. 26:5) వారు పారంపర్యాచారములనుగూర్చి పట్టుదల కలిగి యుండి దేవుని వాక్యమును వ్యర్థము చేసిరి (మత్తయి 15:1-9). పరిసయ్యులు సాధారణంగా స్వనీతిపరులు, వేషధారులు.

పరిసయ్యుడు యూదా సమాజములో అత్యున్నత స్థాయిలో ఎంచబడితే సుంకరి అతినీచస్థాయిలో ఎంచబడేవాడు. పరిసయ్యులు ఘనపరచబడేవారు, గౌరవించబడేవారు, సుంకరి వెలివేయబడినవాడు, దేశద్రోహి, దొంగ. యేసు

వీరిద్దరి తారతమ్యాన్ని గూర్చి చెప్పడం చాల ఆశ్చర్యము.

సుంకరులు యూదులే. వారు యూదులనుండి రోమా ప్రభుత్వము కొరకు పన్ను వసూలు చేసేవారు. తమపై ఏలుబడి చేయుచున్న రోమీయుల దరపున వీరు పన్ను వసూలు చేయుచున్నందున మిగతా యూదులు వీరిని దేశద్రోహులుగాను, దొంగలుగాను, అంటరానివారిగాను పరగణించేవారు. పన్ను వసూలు చేసేవారు సర్వసాధారణంగా ప్రజలకు ఇష్టులుకారు. యూదులు వీరిని అన్యులతోను (మత్త 18:7), వేశ్యలతోను (మత్త 21:31-33), పాపులతోను (మత్త 9:10; లూకా 7:34; 15:1) సమానముగా ఎంచేవారు. పొట్టిజక్కయ్య (లూకా 19:1-9), అపొస్తలుడైన మత్తయి (మత్త 9:9; 10:2-5), ఈ యిద్దరు సుంకరులే. యేసు తన పరిచర్యలో వీరిద్దరిని ఇమిడ్చియున్నారు.

**ఉపమానము:**

"తామే నీతిమంతులమని తమ్ము నమ్ముకొని యితరులను తృణీకరించు కొందరితో ఆయన ఈ ఉపమానము చెప్పెను. ప్రార్థన చేయుటకై యిద్దరు మనుష్యులు దేవాలయమునకు వెళ్లిరి. వారిలో ఒకడు పరిసయ్యుడు, ఒకడు సుంకరి. పరిసయ్యుడు నిలువబడి-దేవా నేను చోరులును అన్యాయస్థులును వ్యభిచారులునైన యితర మనుష్యుల వలెనైనను, ఈ సుంకరి వలెనైనను ఉండనందుకు నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించు చున్నాను. వారమునకు రెండుమారులు ఉపవాసము చేయుచు, నా సంపాదన అంతటిలోను పదియవ వంతు చెల్లించుచున్నానని తనలో తాను ప్రార్థించుండెను. అయితే సుంకరి దూరముగా నిలుచుండి అకాశమువైపు కన్నులెత్తుటకైనను ధైర్యముచాలక రొమ్ము కొట్టుకొనుచు-దేవాపాపినైన నన్ను కరుణించుమని పలికెను. అతనికంటె యితడు నీతిమంతుడుగా తీర్చబడి తన యింటికి వెళ్లెనని మీతో చెప్పుచున్నాను. తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడుననియు తన్నుతాను తగ్గించు కొనువాడు హెచ్చింపబడుననియు చెప్పెను" (లూకా 18:9-14).

వారు ప్రార్థించే టప్పటి భంగిమ సమస్యకాదు. వారిద్దరు నిలబడియే ప్రార్థించుచుండిరి. బైబిలులో వివిధ భంగిమలలో ప్రార్థించుటమనము చూడగలము. ఉదా: మోకాళ్లూని (I రాజులు 8:54, 2దినవృ 6:13; కీర్తన 95:6; యెష 45:23; లూకా 22:41; అపొ.కా. 7:60; ఎఫెసీ 3:14), తలవంచుకొని (ఆదికా 24:52; మత్త 26:39; మార్కు 14:35). నిలబడి చేతులెత్తి (I రాజులు 8:22; I సమూ 1:26; మార్కు 11:25; లూకా 18:11) ప్రార్థించిరి.

పరిసయ్యుడు వింతైన రీతిగా ప్రార్థించాడు. అతడు దేవునికి కాదుగాని తనలో తనకే ప్రార్థించాడు. స్వయం సంతృప్తికొరకు ప్రార్థించాడు. ఎంత వింతయో! తన ప్రార్థనలో కృతజ్ఞత లేదు, దేవునికి ఘనత ఎంతమాత్రము ఆపాదించలేదు.దేనినీ అడుగలేదు, దేనినీ ఒప్పుకోలేదు, దేనినీ పొందలేదు! అతడు 34 మాటలు పలికితే సుంకరి నాలుగే నాలుగు మాటలు పలికాడు.

పరిసయ్యుని ప్రార్థన అహంకారముతో కూడినది. తాను ఏమేమి కాదో వల్లించాడు...అతడు అన్యాయస్థుడు కాదు, దోచుకొనేవాడు, వ్యభిచారి కాదు! తదుపరి తన 'సద్గుణములను' వల్లించాడు. వారమునకు రెండు మారులు ఉపవాసము చేయుచున్నాడు, అన్నిటిలోను దశమభాగము చెల్లించుచున్నాడు! పరిసయ్యులు సాధారణంగ సోమవారము, గురువారము ఉపవాసముండే వారు. ఏలయనగా మోషే సీనాయి కొండపైకి సోమవారంనాడు ఎక్కి గురువారము దిగివచ్చాడని వారు తలస్తారు. ఈ పరిసయ్యుడు నిజానికి అనీతిపరుడు కాదు. మనుష్యులు ఎట్లు అతని పరిగణించినా దేవుడు మాత్రం అతని అంగీకరించలేదు (2 కొరింథీ 5:10). ఒకనిలో ఎన్ని సద్గుణములున్నా పాపము వలన అవి మరుగు చేయబడ్తాయి (యెహెజ్కే 33:13). ఈ పరిసయ్యుడు తన పాపపు జీవితాన్ని గూర్చి గ్రుడ్డివాడయ్యాడు.

సుంకరి అయితే పరిసయ్యునికంటె భిన్నమైన స్వభావమును ప్రదర్శించెను. అతడు తన లోపములను ఎరిగియుండెను. దేవాలయములో ప్రార్థించడానికి వెళ్లిన వీరిద్దరు భిన్నమైన ప్రవర్తన, విశ్వాసము, స్వపరీక్ష

గలవారు. పరిసయ్యుని వలెగాక సుంకరి ప్రాముఖ్యస్థలములో నిలబడి యుండలేదు. తన్ను తాను తగ్గించుకొన్నాడు, తాను పలికిన మాటలను బట్టి దేవునికి దగ్గరయ్యాడు!

అతడు దూరమున నిలుచుండినను, దేవునికి దగ్గరగా యున్నాడు (కీర్త 51:17). ఎజ్రావలె అతడు ఆకాశమువైపు కన్నులెత్తుటకు ధైర్యము లేకపోయెను (ఎజ్రా 9:6; లూకా 15:18). "దేవా, పాపినైన నన్ను కరుణింపుము" కేవలము నాలుగు మాటల ప్రార్థనే, అయినను అది దేవుని సన్నిధికి చేరెను. తన ప్రార్థనలో అతడు మూడు సంగతులను గుర్తించాడు. తానొకగొప్పపాపి, శిక్షార్హుడు, పాపక్షమాపణను, కరుణను విన్నవించుకొన్నాడు. పౌలువలెతాను పాపులలో ప్రధానుడనని ఒప్పుకున్నాడు (I తిమో1:15).

ఈ యిద్దరి మనుష్యుల యొక్క ఆత్మీయస్థితిని యేసు బేరీజు వేసారు. పరిసయ్యుడు తాను నీతిమంతుడనని అంచనా వేసుకొన్నాడు. యేసు అతనిని వేరేవిధంగా ఎంచారు. సుంకరి తాను అనీతిమంతుడననుకొన్నాడు. గాని యేసు ఆయభిప్రాయముతో ఏకీభవించలేదు. గర్విష్టుడైన పరిసయ్యుని దించి, సాత్వికుడైన సుంకరిని పైకెత్తారు. అతని కంటె యితడు నీతిమంతునిగా తీర్చబడి తమ తమ యిండ్లకు వెళ్లారు.

## ముగింపు:

పరిసయ్యుడు సుంకరిని గూర్చిన ఉపమానము ప్రార్థనను గూర్చి, ప్రార్థించే సమయములో ఒకని మనస్తత్వమును గూర్చి ఉపదేశించు చున్నది. పరిసయ్యుడు తన్నుతానే ఉన్నతునిగా ఆలోచించుకొనెను. దేవుడు ఉన్నతుడు, ఆరాధనీయుడని మరచిపోయాడు. ఇతరులను హీనముగా ఎంచాడు. పాపియైన తాను వేరొకపాపికి తీర్పు తీర్చుట మంచిదికాదని అతడు మరిచాడు.

క్రైస్తవులు తమ జీవితములను బైబిలు బోధతో సరిచూచుకోవాలి (మత్త 7:15-20; I యోహా 4:1).

# ౨౬. ఇద్దరు కుమారులు

## (The Two Sons)

మత్తయి 21:28-32

### పరిచయము:

ఈ ఉపమానము చెప్పక ముందు జరిగిన సంఘటనలు చురుకుగా జరిగి పోయెను. దానిముందు జరిగిపోయిన రెండు రోజులు, ఇది చెప్పబడే సమయమువరకు అన్నీ త్వరితముగా జరిగిపోయెను.

యేసు ప్రభువు సిలువవేయబడిన వారములో సోమవారం అది. దానిముందు రోజు ఆదివారమున యేసు గొప్ప విజయోత్సాహముతో యెరూషలేములో ప్రవేశించెను. సోమవారం ఆయన దేవాలయములో ప్రవేశించి దాని ఆవరణములో అమ్మువారిని కొనువారిని త్రోలి వేసెను. గ్రుడ్డివారిని, కుంటివారిని ఆయన స్వస్థపరచెను. ప్రధాన యాజకులు, శాస్త్రులు దీనిని గమనించారు. చిన్నపిల్లలు "దావీదు కుమారునికి జయము" అని దేవాలయములో కేకలు వేసిరి. వీరు చెప్పుచున్నది వినుచున్నావా? యని వారాయన నడిగిరి. "బాలుర యొక్కయు చంటిపిల్లలయొక్కయు నోట స్తోత్రము సిద్ధింప జేసితిని అను మాట మీరు చదువలేదా?" అని ఆయన వారితో చెప్పెను. అదే రోజున ఆయన నిష్ఫలమైన అంజూరపు చెట్టును శపించెను.

మంగళవారమున ప్రధాన యాజకులును పెద్దలును ఆయన యొద్దకు వచ్చి "ఏ అధికారమువలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు? ఈ యధికారమెవడు నీకిచ్చెనని" ఆయనను సవాలు చేసిరి. ఏ అధికారమువలన నీవు రూకలు మార్చువారిని త్రోలి వేసావు? వారి బల్లలను పడద్రోసావు? గ్రుడ్డివారిని కుంటివారిని బాగుచేసావు? పిల్లలు నిన్ను దావీదు కుమారుడని పిలువనిచ్చావు? అని ప్రశ్నించారు. ఇంకొక మాటలో ఈపనులు చేయుటకు నీకు అధికారము లేదనివారు వక్కాణించగోరారు. ఆయన చేసిన

అద్భుతములను వారు చూసారు; నిజానికి వారి ప్రశ్నలో వారి దురభిమాన ద్వేషము, అసూయ, వేషధారణ, కపటత్వము దాగి యుండెను. ఇవ్విధముగా ప్రభువు యొక్క పరిచర్యలోని ఆఖరివారము ఆరంభమాయెను. ఇట్టి సందర్భములో యేసు ఇద్దరు కుమారులను గూర్చిన ఉపమానమును ఉపదేశించారు. యేసు యొక్క అధికారమును ప్రశ్నించిన వారికి జవాబుగా ఆయన ఈ ఉపమానము చెప్పెను. వారడిగిన ప్రశ్నకు జవాబుగా ఆయన ప్రశ్నిస్తు వారికి ఈ ఉపమానము చెప్పెను!

"మీకేమితోచుచున్నది? ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. అతడు మొదటివాని యొద్దకు వచ్చి-కుమారుడా, నేడు పోయి ద్రాక్షతోటలో పనిచేయుమని చెప్పగా వాడు పోను అని యుత్తర మిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొనిపోయెను. అతడు రెండవవాని యొద్దకు వచ్చి ఆ ప్రకారమే చెప్పగా వాడు అయ్యా-పోదునని చెప్పెను గాని పోలేదు. ఈ యిద్దరిలో ఎవడు తండ్రి యిష్టప్రకారము చేసెనని వారినడిగెను. అందుకు వారు మొదటివాడే అనిరి. యేసు-సుంకరులును వేశ్యలును మీకంటె ముందుగా దేవుని రాజ్యములో ప్రవేశించుదురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. యోహాను నీతిమార్గమున మీ యొద్దకు వచ్చెను, మీరతని నమ్మలేదు; అయితే సుంకరులును వేశ్యలును అతనిని నమ్మిరి. మీరు అది చూచియు అతనిని నమ్మునట్లు పశ్చాత్తాప పడకపోతిరి" (మత్తయి 21:28-32).

ఇద్దరి కుమారుల ఉపమానముద్వారా యేసును గద్దించడానికి వచ్చిన మత నాయకులును ఆయనే గద్దించారు. వారిని సంభాషణలో దింపి వారి మాటలతోనే వారిని ఖండించారు. భక్తి కలిగి యుంటేనే సరిపోదు. పరిసయ్యులు శాస్త్రులు ధర్మ శాస్త్రమునందు ఆసక్తి కలగినవారి వలె నటించారు, గాని వారి మాటలు రెండవ కుమారుని విధేయతవలె యున్నవి. ప్రధాన యాజకులు పెద్దలు కూడ ఇట్టి వేషధారణలో కూడిన భక్తినే కలిగియుండిరి.

"వేషధారులారా–ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా నున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారునన్ను వ్యర్ధముగా ఆరాధించుచున్నారు" అని యేసు వారిని గూర్చి చెప్పెను (మత్తయి 15:7–9).

ఈ ఉపమానము ముఖ్యముగా రెండు రకాలైన యూదులకు వర్తించెను, రక్షింపబడేవారు రక్షణను నిరాకరించేవారు. ఈ రెండురకాలైన యూదులు బాప్తిస్మమిచ్చు యోహాను బోధించే సమయములో యుండిరి (మత్తయి 3:1–7). రెండోరకమైన యూదులు దేవాలయములో యేసును ప్రశ్నించారు గాని యోహాను యొక్క బాప్తిస్మమును గూర్చి యేసు అడిగిన ప్రశ్నకు జవాబిచ్చుటకు నిరాకరించిరి (మత్త 21:24–27). రెండవదిగా, ఇద్దరు కుమారులను గూర్చిన ఉపమానము యుక్తవయస్సుగల ప్రతివానికి వర్తించును, రక్షింపబడగోరే వారు, రక్షణను నిరాకరించేవారు.

మతగురువులు దేవుని వాక్యమును నిరాకరించారు. గాని వెలివేయబడినవారు దానిని అంగీకరించారు. బాప్తిస్మమిచ్చు యోహాను బోధకు యాజకులు, పెద్దలు చలించలేదు గాని పాపులైన అనేకులు మారుమనస్సు పొంది అతని వాక్యమును విన్నారు. రెండవ కుమారుడు పోదునని చెప్పాడు గాని పోలేదు. పరిసయ్యులు ఇట్టివారే. గాని నేనుపోను అనిచెప్పి పిమ్మట మనస్సు మార్చుకొనిన మొదటి కుమారుని వలె మారుమనస్సు పొందిన పాపులు సుంకరులు యున్నారు.

ఈ ఉపమానములో తండ్రి పరలోక తండ్రిని పోలియున్నాడు. ద్రాక్షతోటయైతే ఆయన రాజ్యమైన సంఘము. కుమారులను ఆజ్ఞాపించే అధికారమును తండ్రి కలిగి యున్నాడు. ప్రతి కుమారుని ఆయన వెళ్లుమని మాత్రమే చెప్పాడు. ఎందుకు? పనిచేయుటకు, ఎప్పుడు? నేడే, ఎక్కడికి? నా ద్రాక్షతోటలోనికి. అదే రీతిగా మన పరలోకపుతండ్రి మనలను ఆజ్ఞాపించు

అధికారము కలిగి యున్నారు. ఆయన వెళ్లుము అని ఆజ్ఞాపించుచున్నారు. ఎందుకు? శిష్యులుగా చేయుటకు, ఎప్పుడు? ఈరోజే (2 కొరింథీ 6:2; యోహాను 4:35). ఎక్కడికి? సర్వలోకానికి (మార్కు 16:15-16). ఈ లోకం అంతా ఆయన ద్రాక్షతోటయే. అది చాల విస్తీర్ణము గలది. కోతకాలము యిదే, గాన పనివారు కొద్దిమందియే.

ఈ ఉపమానములోని మొదటి కుమారుడు తమకు రక్షణ అవుసరమని ఎరిగిన ప్రజలవలె యున్నాడు. ఆహ్వానించబడినప్పుడు వారు మారుమనస్సు పొంది ఆయన రాజ్యములో ప్రవేశించి పనిచేయుదురు. రెండవ కుమారుడు తమ పాపముల విషయమై గ్రుడ్డివారైన యూదులను సూచించుచున్నాడు. మారుమనస్సు పొందవలెనని పిలువబడగా వారు అభ్యంతర పడిరి. అందువలన వారు విమోచన కర్తలో ఆసక్తిని యేమీ కనుబరచలేదు. సరిగదా ఆయనను నాశనము చేయజూచారు.

దేవుని పిలుపు సార్వజనికమైనది. అది అత్యవుసర ఆహ్వానము. తండ్రి తన యిద్దరు కుమారులకు ఒకే రకమైన ఆజ్ఞను యిచ్చాడు. విధేయత చూపవలసిన ఆజ్ఞలు అందరికీ సమానమే (మార్కు 16:15-16; అపొ.కా. 2:38; అపొ.కా. 17:30). తండ్రికి ఉన్నా కుమారులు యిద్దరే. ఆయన వారిద్దరినీ ఆజ్ఞాపించాడు. దేవుని పిలుపు అందరికీ, అయితే అందరు సత్యమునకు విధేయులు కారు. యూదామతగురువుల కంటే ముందుగా సుంకరులు, పాపులు వేశ్యలు సత్యమును గ్రహించి అంగీకరించారు. గనుక వారే దేవుని రాజ్యములో ముందు ప్రవేశించారు (యోహాను 9:39-41).

ఈ యిద్దరి కుమారులు ఉపమానము బైబిలు సంబంధమైన మారుమనస్సును గూర్చి కూడ బోధించుచున్నది. యూదులు మారుమనస్సు పొందాలని బాప్తిస్మమిచ్చు యోహాను బోధించాడు. "మారుమనస్సుకు తగిన ఫలములను ఫలించుడి" యని హెచ్చరించాడు (మత్తయి 3:8).

మారుమనస్సు అనగా యేమిటి? అది తండ్రి మాటను కాదనినందుకు

కలిగిన దుఃఖము మాత్రమే కాదు. మారుమనస్సు పొందకుండా అతడు ఆలాగే దుఃఖించుచుండవచ్చును. గాని అతడిప్పుడు మారుమనస్సు పొందాడు? అతడు మనస్సు మార్చుకొని, పోయి ద్రాక్ష తోటలో పనిచేసినప్పుడు. క్రియలులేని మాటలు వ్యర్థము (యాకోబు 1:22; లూకా 6:46).

## ముగింపు:

ఇద్దరు కుమారులకు ఉన్న తండ్రి ఒక్కడే, వారికీయబడిన అజ్ఞలు సమానమే, తరుణములు ఒక్కటే, బాధ్యతలు సమానమే, ఆశీర్వాదములు సమానమే.

దేవుడు ఆదాము హవ్వలను ఏదెనువనములో యుంచినపుడు వారికి చేయుటకు పని అప్పగించెను (ఆదికా 2:15). మన కుటుంబ సంరక్షణ కొరకు కష్టపడి పనిచేయాలి (2 థెస్స 3:10). క్రైస్తవులు సంఘములో చురుకుగా పనిచేయాలని దేవుడు కోరుచున్నారు (I కొరింథీ 15:58; యాకో 2:20, 24, 26). దేవుని బిడ్డలు ఆయన రాజ్యములో పనిచేయాలి.

---

*Translated from English to Telugu*
*by Joshua Gootam*
*Jan.2013.*